ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కడప

fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-10-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 244 పేజీలు: 10+4 వెల: 8.00

లాంగ్‌కోవిడ్ బాధితుల్లో గుండెజబ్బులు ఎక్కువ 5లో

ఉక్రెయిన్ రైలుపై రష్యా డ్రోన్‌దాడి: 30మంది మృతి

# ఆటో డ్రైవర్ల సేవలో..సర్కార్

## కొత్తపథకంతో 2.90లక్షల మంది డ్రైవర్ల ఖాతాల్లోకి రూ.436కోట్లు

### వారి భవిష్యత్తు కోసం ప్రత్యేక సంక్షేమబోర్డు

### ఉబెర్ తరహాలో ప్రత్యేక యాప్ చేయిస్తా

### కూటమి పాలనలో అందరికీ సంక్షేమం: సిఎం చంద్రబాబు



శనివారం ఆటో డ్రైవర్ల సేవల సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** తమది పేదల ప్రభుత్వం అని, ప్రతి పేదవాడి జీవితంలో మార్పు తీసుకురావడం లక్ష్యంగా పని చేస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా దేశంలో ఎక్కడా లేని సంక్షేమం ఆంధ్రప్రదేశ్‌లో అందిస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడ సింగ్‌నగర్‌లో జరిగిన 'ఆటో డ్రైవర్ల సేవల్లో' పథకం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రూ.436 కోట్లను 2.9 లక్షల ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఇందుకు సంబంధించిన రూ.436 కోట్ల భారీ నకలు చెక్కును సీఎం చంద్రబాబు లబ్ధిదారులకు అందించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ట్రాన్స్‌పోర్టు మినిస్టర్ రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాధవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఎక్కువగా పేదవారేనని, వారికీ ఆర్థిక సాయం అందించడమే ఈ పథకం ఉద్దేశమని తెలిపారు. ఏడాదికి రూ.15,000 సాయం ఇవ్వడం వల్ల వారికి కొంత ఊరట లభిస్తుంది. ఇది పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్య అని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో రహదారులు గుంతలతో నిండిపోయాయని, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చంద్రబాబు మండిపడ్డారు. గత ప్రభుత్వం రోడ్లను పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.2,000 కోట్లు ఖర్చుపెట్టి రహదారులను బాగు చేశామని చంద్రబాబు వివరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. "చెప్పిన పని చెప్పినట్లు చేసే ప్రభుత్వం కూటమిదే, ఎవరికి లంచాలు ఇవ్వకుండానే అర్హులందరి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి" అని చంద్రబాబు తెలిపారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, భవిష్యత్తులో ర్యాపిడో, ఉబర్ తరహాలో కొత్త యాప్ తీసుకువచ్చి డ్రైవర్లకు మెరుగైన వ్యాపారావకాశాలు కల్పిస్తామని భరోసానిచ్చారు. ఆటో డ్రైవర్ల కుటుంబాల్లో ఉన్న అమ్మాయిలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుతోందని చెప్పారు. స్త్రీ శక్తి పథకం బంపర్ హిట్ అయింది. రాష్ట్రంలో మహిళలు ప్రతి రంగంలో రాణిస్తున్నారు అని అన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థను తీసుకొచ్చాం. దీని ద్వారా 750 ప్రభుత్వ సేవలు నేరుగా ప్రజలకు అందుతున్నాయి. సాంకేతికతను పేదల కోసం ఉపయోగించడం మా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యూని వర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం కింద ప్రతి పేద కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమా రక్షణ అందించే ప్రణాళికను అమలు చేస్తున్నామని తెలిపారు సంపద సృష్టించి పేదలకు పంచడం, అదే మా సిద్ధాంతం. సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది' అని ఆయన స్పష్టం చేశారు. 'గత ఐదేళ్లు విధ్వంస కాలం. దుర్మార్గులు అధికారంలో ఉంటే అభివృద్ధి శూన్యం. ప్రజలు అలాంటి శక్తులు తిరిగి రాకుండా కాపాడుకోవాలి' అన్నారు. ప్రధాని మోడీ తీసుకొచ్చిన సూపర్ జీఎస్టీ సంస్కరణలతో >>2

## ప్రణాళికాబద్ధ పాలనతో రాష్ట్రం సుభిక్షమే

### ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా రూ.436 కోట్ల భారం అదనంగా మోస్తున్నాం: డి.సిఎం పవన్



**విజయవాడ, అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల సమస్యలు విని పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ఇబ్బందులను ఆటో డ్రైవర్లు మా దృష్టికి తీసుకొచ్చారు. గ్రీన్ ట్యాక్స్ భారంపై ప్రముఖంగా ప్రస్తావిస్తే తగ్గించాం. కూటమి ప్రభుత్వం రాగానే రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాం. సమర్థ నాయకత్వం, ప్రణాళికాబద్ధ పాలన ఉంటే ఏ రాష్ట్రమైనా సుభిక్షంగా ఉంటుంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా రూ.436 కోట్ల భారాన్ని ప్రభుత్వం ఆనందంగా మోస్తోంది. సమర్థమైన నాయకత్వం, ప్రణాళికాబద్ధమైన పాలన ఉంటే ఏ రాష్ట్రమైనా సుభిక్షంగా ఉంటుంది. అందుకు కూటమి ప్రభుత్వ పాలనే నిలువెత్తు నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, హామీలకు కార్యరూపం ఇస్తూ ప్రజలందరికీ అండగా నిలుస్తున్నట్టు తెలిపారు. స్త్రీ శక్తి పథకంతో ఇబ్బందిపడుతున్న ఆటో డ్రైవర్ల కుటుంబాల్లో భరోసా నింపేందుకు ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలు వింటూ ఎల్లప్పుడూ వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. శనివారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌తో కలసి ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఈ సభా కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లు ఉండవల్లి నుంచి సింగ్‌నగర్‌కు ఆటోలో వచ్చారు. అక్కడకు వచ్చిన చంద్రబాబు, పవన్, మాధవ్‌కు మంగళగిరి చేనేత కండువాలను కప్పి లోకేశ్ స్వాగతం పలికారు. కూటమి నేతలకు మద్దతుగా పెద్ద ఎత్తున మంగళగిరి ప్రజలు తరలివచ్చారు. బాణసంచా, తీన్‌మార్ డప్పులతో మంగళగిరి యువత సందడి చేశారు. లబ్ధిదారులైన ఆటో డ్రైవర్లతో కలిసి ఖాకీ చొక్కాలను ధరించి నేతలు సభలో పాల్గొన్నారు. బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం ప్రతివర్గానికి >>2

# 'సోషల్' ట్రోల్స్‌తో జన్‌నాయక్‌లా?

### ప్రజాభిమానం పొందగలిగితేనే సాధ్యం

### పరోక్షంగా రాహుల్‌ను దెప్పిపొడిచిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** బీహార్ విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఎన్డీయే ప్రభుత్వానికి దక్కుతుందని ప్రధాన మంత్రి మోడీ అన్నారు. ఆర్జేడీకాంగ్రెస్ హయాంలో విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. నైపుణ్యాలు, నూతన ఆవిష్కరణలతో దేశాన్ని ముందుకు నడిపించే యువశక్తిని సన్నద్ధం చేసేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సోషల్ మీడియా ట్రోల్స్‌తో ఎవరూ జన్‌నాయక్ కాలేరని, ప్రజల ప్రేమాభిమానాలు, గౌరవం చూరగొంటేనే అది సాధ్యమని పరోక్షంగా రాహుల్‌గాంధీపై విమర్శలు గుప్పించారు. రూ.62,000 కోట్ల విలువైన విద్యా ప్రాజెక్టులను ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ, బీహార్‌లో నేడు మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలలను పునర్నిర్మిస్తూ, ఉన్నత విద్యా సంస్థలను విస్తరిస్తూ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఆర్జేడీ హయాంలో విద్యావకాశాలు లేక ప్రజలు వలసల బాట పట్టేవారని, లెక్కకు మిక్కిలిగా కుటుంబాలు తమ పిల్లలను చదువుల కోసం, పనుల కోసం ఇతర రాష్ట్రాలకు పంపేవారని చెప్పారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఓబీసీల ఆరాధ్యదైవం జననాయక్ కర్పూరి ఠాకూర్ వారసత్వాన్ని ఆపాదించుకునేందుకు కొందరునేతలు ప్రయత్నిస్తున్నారని, సోషల్ మీడియా ట్రోల్స్‌తో ఎవరూ జన్‌నాయక్‌లు కాలేరని, ప్రజల మనస్సులో స్థిరమైన ముద్ర వేసుకున్న నేతలకే ఆ పేరు చెల్లుతుందని అన్నారు. గత ఏడాది కర్పూరి ఠాకూర్‌కుతమ ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో గౌరవించిందన్నారు.

# 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఇ పార్కులు

### పూర్వోదయ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ప్రోత్సహించాలి: సిఎం చంద్రబాబు



శనివారం వ్యవసాయ అనుబంధ రంగాలపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ అక్టోబరు 4, ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పూర్వోదయ స్కీంను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పూర్వోదయ మిషన్‌లో భాగంగా వ్యవసాయ అనుబంధం రంగాల్లో రూపొందించుకోవాల్సిన ప్రణాళికలపై సీఎం చంద్రబాబు శనివారం సాయంత్రం దాటిన తరువాత క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. ఉద్యాన పంటలు, మైక్రో ఇరిగేషన్, ఫిషరీస్, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ఆయా రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు వాటిపై ఆధారపడిన వారి జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా చూడాలన్నారు. ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా మార్కెట్ పరిధిని విస్తరించాలని, అలాగే రాష్ట్రాభివృద్ధికి మరింతగా తోడ్పడేలా ఉద్యాన, మైక్రో ఇరిగేషన్, ఫిషరీస్, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రధాన పంటలతో పాటు అంతర పంటలు వేయడం ద్వారా కూడా ఆదాయం రెట్టింపయ్యేలా చూడాలన్నారు. అలాగే జాతీయంగా, అంతర్జాతీయంగా హైడిమాండ్ ఉన్న ఉత్పత్తులపై అధ్యయనం చేసి, ఆ మేరకు ఎగు మతులకు అనుగుణంగా ఉత్పత్తి చేపట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి పంటలకు డిమాండ్‌ఉంటుందో అంచనా వేసి, >>2



# యుద్ధ ఖైదీలను అప్పగిస్తాం

### ట్రంప్ షరతులకు దిగివచ్చిన హమాస్

**గాజాసిటీ,అక్టోబరు 4:** గాజాలో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై హమాస్ సానుకూలంగా స్పందించింది. బందీల విడుదల, గాజా పాలనను స్వతంత్రులకు అప్పగించడం వంటి కీలక అంశాలకు అంగీకారం తెలిపిన హమాస్, ప్రణాళికలోని పలు ఇతర షరతులపై మాత్రం చర్చలు జరపాలని కోరుతోంది. ట్రంప్ ఇచ్చిన 20అంశాల ప్రతిపాదనను అంగీకరించడమో లేదా తిరస్కరించడమో ఆదివారం లోగా తేల్చాలని గడువు విధించిన నేపథ్యం లో హమాస్ ఈ >>2

# ఎన్టీఆర్ జిల్లాకు 8 స్వచ్ఛాంధ్ర అవార్డులు

### సమష్టి కృషి ఫలితమే ఈ విజయం: కలెక్టర్ జి.లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు పట్టం కడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర పురస్కారాలు2025లో ఎన్టీఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సమష్టి కృషి ఫలితమే ఈ స్వచ్ఛ విజయానికి కారణమన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేస్తున్న స్వచ్ఛ్ సర్వేక్షణ్ అవార్డుల తరహాలో రాష్ట్ర స్థాయిలో గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డులను ప్రకటించిందని ఇందులో ఎనిమిది రాష్ట్రస్థాయి పురస్కారాలకు జిల్లా ఎంపిక కావడం ఎంతో ఆనందాన్నిస్తోందన్నారు. ఈ నెల 6వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి విజేతలకు అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. 69రాష్ట్రస్థాయి పురస్కారాల్లో ఎనిమిది పురస్కారాలు ఎన్టీఆర్ జిల్లాకు రావడానికి సరైన స్వచ్ఛతా ప్రణాళికల అమలు కారణమని పేర్కొన్నారు. ప్రత్యేక కేటగిరీ అవార్డులు (స్వచ్ఛ్ సర్వేక్షణ్)లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ విజేతగా నిలిచిందని తెలిపారు. అదేవిధంగా స్వచ్ఛ కాలనీల విభాగంలో విజయవాడలోని కేపీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో విజయవాడ హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ, అనిగండ్లపాడు జీఏడీ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఎంపికయ్యాయన్నారు. స్వచ్ఛ అంగన్వాడీలు విభాగంలో కేదారేశ్వరపేట 3 అంగన్వాడీ కేంద్రం, స్వచ్ఛ బస్ స్టేషన్ల విభాగంలో విజయవాడ బస్ స్టేషన్, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో విజయవాడ కృష్ణలంకలోని వీఎంఆర్ఆర్ (జి) మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, స్వచ్ఛతా ఎన్‌జీవోలు కేటగిరీలో రైజ్ సంస్థ ఎంపికైనట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో ఎన్టీఆర్ జిల్లాకు జిల్లాస్థాయిలో వివిధ కేటగిరీల్లో 50 పురస్కారాలు లభించినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్రతినెలా మూడో శనివారం >>2

### ప్రధాని ధనధాన్యయోజనకు

# 4 జిల్లాల ఎంపిక

### జాబితాలో అల్లూరి, శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాలు

### నోడల్ అధికారులుగా నలుగురు ఐఎఎస్‌లు

**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం జులై 16న ప్రకటించిన ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన క్రింద ఆంధ్రప్రదేశ్ నుంచి అల్లూరి సీతారామరాజు(ఏఎస్ఆర్), శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాలను ఎంపిక చేశారు. వీటికి నోడల్ అధికారులుగా నలుగురు ఐఏఎస్ అధికారులను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం గత రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఏఎస్ఆర్ జిల్లాకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి అమిత్ సింగ్లా,(ఏజీఎంయూటీ కేడర్), శ్రీ సత్యసాయి జిల్లాకు సహకార శాఖ సంయుక్త కార్యదర్శి సిద్ధార్థ్ జైన్, అనంతపురం జిల్లాకు పెట్రోలియం సహజవాయువుల శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ(ఇద్దరూ ఏపీ కేడర్), అన్నమయ్య జిల్లాకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి బాలమురుగన్ (బీహార్ కేడర్) నియమితులయ్యారు. వ్యవసాయపరంగా తక్కువ ఉత్పాదకత ఉన్న 100 జిల్లాలను ఈ పథకం కింద ఎంపిక చేసి అక్కడ ఉత్పాదకతను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. దీనికింద పంట మార్పిడిని ప్రోత్సహిస్తారు. సాగునీటి సౌకర్యం, పంటల సామర్థ్యం మెరుగుపరుస్తారు. రైతులకు తగినంత రుణాలు అందిస్తారు. మొత్తం ఆరేళ్ళ కాలంలో అమలు చేస్తున్న ఈ పథకం క్రింద రూ.24 వేలకోట్లు ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రంలోని 11 మంత్రిత్వశాఖల >>2

# మావోయిస్టుల లొంగు'బాట'

### కొత్త ఎత్తుగడలతో పోలీసులు

### సీనియర్ నాయకులు టార్గెట్‌గా వ్యూహాలు




**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేసేందుకు కేంద్రం చేబట్టిన ఆపరేషన్ కగార్ ఓవైపు వేగంగా సాగుతుండగా మరోవైపు భారీగా సీనియర్ మావోయిస్టులను లొంగిపోయేలా చేసేందుకు తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ పోలీసులు ప్రయత్నాలు చేబట్టారు. ఈ ఏడాది చివరి నాటికి మరో వెయ్యి మంది వరకు మావోయిస్టుల లొంగుబాట్లు వుండేలా చూడాలని, ఇందులో కనీసం పది శాతం ముఖ్య నేతలు వుండేలా చూసేందుకు పోలీసులు చర్యలు చేబట్టినట్లు సమాచారం. ఈ సంవత్సరం ఇప్పటి వరకు తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ లలో 500మందికి పైగా నక్సలైట్లు లొంగిపోగా ఈ సంఖ్యను మరింత పెంచేందుకు ఇరు రాష్ట్రాల పోలీసులు ఉమ్మడి వ్యూహం అమలు చేస్తున్నారు. నిషిద్ధ మావోయిస్టు పార్టీని మరింతగా నిర్వీర్యం చేసేందుకు కేంద్రంతో పాటు ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ పోలీసులు కొత్త తరహా ఎత్తుగడలను అనుసరించేందుకు నిర్ణయించారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఓవైపు కూంబింగ్ నిర్వహిస్తూనే మరోవైపు లొంగుబాట్లను భారీగా పెంచేందుకు క్షేత్రస్థాయిలో పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేబట్టారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌ఘడ్, ఝూర్ఖండ్‌లలో కేంద్ర బలగాలతో పాటు ఆయా రాష్ట్రాల పోలీసులు వరుసగా నక్సలైట్ల స్థావరాలను ధ్వంసం చేసుకుంటూ దూసుకు పోతుండడం తెలిసిందే. మరింత ముందుకు వెళ్లేందుకు ఎక్కడికక్కడ బేస్ క్యాంప్‌లను కూడా ఏర్పాటు చేసుకుంటున్న భద్రతా బలగాలు ఇదే సమయంలో స్థానికుల నుంచి సహాయం పొందడలో చాలా వరకు సఫలమైనట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. గతంలో నక్సలైట్లకు పట్టువున్న ప్రాంతాలలో పోలీసులకు పెద్దగా సహకారం అందేది కాదు. కానీ ప్రస్తుతం దీనికి భిన్నంగా ఆయా ప్రాంతాలలో స్థానికులు పోలీసులకు సహకరిస్తున్నారని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు మావోయిస్టు పార్టీకి చెందిన అగ్ర నాయకులతో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు అనారోగ్య కారణాలు, కుటుంబ నేపథ్యం కారణంగానే లొంగిపోయేవారు. ఇదే సమయంలో లొంగిపోయిన నక్సలైట్లు కూడా ఇదే విషయాన్ని చెప్పేవారు. ఒకటి రెండు సందర్భాల లోనే లొంగిపోయిన నక్సలైట్లు మావోయిస్టు పార్టీపై విమర్శలు చేసిన ఉదంతాలున్నాయి. కానీ గడచిన రెండేళ్ల కాలంలో పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు రాష్ట్ర, కేంద్రస్థాయి నాయ కులు తమ పార్టీపై పెద్దగా విమర్శలు చేయడం లేదు. దీంతో పాటు పోలీసుల నిర్బంధం పెరిగిన దరిమిలా లొంగుబాట్లు మరింతగా పెరిగాయి. ఇక మావోయిస్టు పార్టీలో వున్న అగ్రనాయకులంతా తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కావడం గమనార్హం. >>2

# తీరం దాటిన వాయుగుండం

### ఉత్తరాంధ్రకు భారీ వర్షసూచన

**విజయవాడ,అక్టోబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఒడిశాలో గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటింది. ఆ సమయంలోనే తీరం వెంబడి గరిష్ఠంగా గంటకు 75 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఇది వాయుగుండంగా బలహీనపడింది. ఇది ఉత్తర వాయవ్య దిశగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదులుతూ శనివారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో వర్షం దంచికొట్టింది. శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి నదుల ఉధృతితో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయి. వర్షాల ధాటికి ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. మరోవైపు విజయనగరం జిల్లాలోనూ వర్షం, >>2




శనివారం ఆటో డ్రైవర్లు సేవ కార్యక్రమంలో లబ్ధిదారులకు రూ.రూ.436 కోట్లకు భారీ నకలు చెక్కును అందిస్తున్న సీఎం చంద్రబాబు

# ఆటో డ్రైవర్ల సేవలో..సర్కార్

>> ప్రజలపై ఆర్థిక భారాలు తగ్గాయి. ధరలు నియంత్రణలోకి వచ్చాయి" అని చంద్రబాబు అన్నారు. అలాగే, గుజరాత్‌లో ఉన్న సుస్థిర పాలన మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి మళ్లీ దుష్ట శక్తులు రాకుండా దసరా, దీపావళి పండుగలను స్ఫూర్తిగా తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

కూటమి పాలనలో ప్రజల కష్టాలు తీరాయి. సంక్షేమం దరిచేరింది.ఆటో డ్రైవర్ల కోసం ఒక యాప్ తయారు చేసి బుకింగ్‌లు వచ్చేలా చేస్తామని సిఎం పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం ద్వారా ఇవాళ ఆటో డ్రైవర్లు, మాక్సీ క్యాబ్, క్యాబ్ డ్రైవర్లకు పండుగ.గతంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. డబ్బులన్నీ రిపేర్లకే సరిపోయేవి... జరిమానాలు కూడా వేసి వేధించారు.2024లో జరిగిన ఎన్నికలు నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. 94 శాతం స్ట్రైక్ రేట్ వచ్చింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలతో ఈ స్ట్రైక్ రేట్ ఇంకా పెరగాలి. 16 నెలల క్రితం వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయి. పాలన ఎక్కడికక్కడ ఆగిపోయింది.2,90,669 మంది డ్రైవర్ల ఖాతాల్లోకి రూ.436 కోట్లు జమ చేశామన్నారు.ఏ ఒక్కరికి డబ్బులు జమ కాకపోయినా రిపోర్టు చేస్తే ఆర్హతను బట్టి ఖాతాలో వేస్తామన్నారు. రాష్ట్రంలో 23 వేల కిలోమీటర్ల మేర మరమ్మతులు చేసి గుంతలు లేని రోడ్లను తయారు చేశామన్నారు. ఎంఎల్ఏ బొండా ఉమామహేశ్వరరావు ఎంఎల్ఏ పల్లా శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు

>> దానికి అనుగుణంగా ఆ పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. మన వాతావరణంలో ఏయే పంటలు పండుతాయో అధ్యయనం చేస్తే.. మన వాతావరణంలో పండించగలిగే అన్ని రకాల పంటలను పండించేలా రైతులకు అవగాహన కల్పించాలని సీఎం వివరించారు. ప్రతి రైతును పరిశ్రమలకు అనుసంధానం చేసేలా ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇలా చేయగలిగితే, రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లదని చెప్పారు. ఈ మేరకు ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎఫ్పీఓలకు కేంద్రం ఆర్థికంగా అండగా నిలుస్తోందని చంద్రబాబు వివరించారు. ఉద్యాన రంగ రైతులకు.. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అందరికీ కలిసి వచ్చేలా ఓ వర్క్ షాప్ నిర్వహించాలని ఆదేశించారు. అన్ని రకాల ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేసబులిటీ వచ్చేలా చూడాలని చెప్పారు. అలాగే ఆక్వా ఉత్పత్తుల సాగు రెట్టింపయ్యేలా చూడాలన్నారు. ఆక్వా కల్చర్ యూనివర్శిటీ ఏర్పాటుపై ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న లాజిస్టిక్స్‌ను కూడా పూర్తిగా వినియోగించుకోగలిగితే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి ప్రతి రైతుసేవా కేంద్రం పరిధిలో 2 వేల హెక్టార్ల వ్యవసాయ, ఉద్యాన పంటలు ఉన్నాయని... ఆ రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏయే పంటలు ఉన్నాయనే విషయాన్ని విశ్లేషించి... రైతులకు అన్ని రకాలుగా అవగాహన కల్పించేలా రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని వినియోగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్లస్టర్ ఆధారంగా పశువుల కోసం సామూహిక షెడ్ల నిర్మాణంపై ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. పశువుల కోసం ఏర్పాటు చేసే సామూహిక షెడ్ల నిర్వహణ, పశు పోషణ బాధ్యతలను డ్వాక్రా సంఘాలకు అప్పచెప్పే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. పశువుల షెడ్ల ఏర్పాటుతో పాటు.. పాల ఉత్పత్తి యూనిట్లు, చిల్లింగ్ యూనిట్లు, దాణా బ్యాంకులు, బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పశువుల సంఖ్యను పెంచడం, పాల ఉత్పత్తి పెరిగేలా చూడడం, పశు వ్యాధులను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ఆ పార్కుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఉండేలా చూడాలని సీఎం అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజల్లో చైతన్యం తెచ్చేది ఆటో డ్రైవర్లే

## ఆటోల వెనుక ఉండే కొటేషన్లు స్ఫూర్తినిస్తాయి: మంత్రి లోకేష్



మహిళా ఆటో డ్రైవర్‌తో మాట్లాడుతున్న మంత్రి లోకేష్


**విజయవాడ,అక్టోబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆటో డ్రైవర్లది ఆదర్శనీయమైన సేవా జీవితమని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు.వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.వారి జీవన సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.విజయవాడ సింగ్‌నగర్‌లో జరిగిన "ఆటో డ్రైవర్ల సేవల్లో పథకం ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆటో డ్రైవర్ల కృషిని ప్రశంసించారు. ప్రజలతో నిత్యం మమేకమై ఉండే వృత్తి ఇదేనని, ఆటో డ్రైవర్లు గ్రామస్థాయి నుంచి దేశ రాజకీయాల దాకా చర్చించే ప్రజానేతలుగా నిలుస్తారని తెలిపారు.మంత్రి లోకేశ్ మాట్లాడుతూ "ఇంట్లో ఎన్ని ఇబ్బందులు ఉన్నా నవ్వుతూ పలకరిస్తారు ఆటో డ్రైవర్లు. ఎవరికి ఏ అత్యవసర ప్రయాణం ఉన్నా ఠక్కున గుర్తుకొచ్చేది వారే. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే శక్తి ఆటో డ్రైవర్లకు ఉంది" అని పేర్కొన్నారు. ఆనాడు దివంగత ఎన్టీఆర్ ఖాకీ డ్రెస్సు వేసుకుని ప్రజల మధ్యకు వెళ్లినట్లు, నేడు ఆటో డ్రైవర్లు అదే స్ఫూర్తితో సమాజానికి సేవ చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. "నేను కూడా ఆటో వెనక ఉన్న కొటేషన్లు చదువుతుంటా. వాటిలోని మాటలు చూస్తుంటే వారి మనసు ఎంత పెద్దదో అర్థమవుతుంది" అని లోకేశ్ అన్నారు.ప్రజలకు మెరుగైన సేవ చేసే ఆటో డ్రైవర్ల రుణం తీర్చుకోవడం మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎంతున్నా, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతాం" అని అన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో డ్రైవర్లపై భారీ ఛార్జీలు, గ్రీన్ ట్యాక్స్ వంటి భారం మోపారని, కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించి డ్రైవర్లకు ఊరట కల్పించిందని గుర్తు చేశారు. వాహనదారుల సౌకర్యార్థం కూటమి ప్రభుత్వం రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టి రహదారి గుంతలకు మరమ్మతులు చేపట్టిందని మంత్రి తెలిపారు. వైఎస్సార్సీపీ పాలనలో రోడ్లు దెబ్బతిన్నాయి, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది" అన్నారు. మహిళలు కూడా ఆటో నుంచి అంతరిక్షం వరకూ రాణిస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. ప్రజల రుణం తీర్చుకోవటమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ఆటో డ్రైవర్లు ప్రజల సేవలో ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు."వీరి నవ్వు, నిజాయితీ, చైతన్యం రాష్ట్రానికి బలం. అందుకే ప్రభుత్వం ఈ వర్గం సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. స్వర్ణలత అనే మహిళకు చెందిన ఆటోలో ప్రయాణించిన లోకేష్... ఆమెతో ముచ్చటిస్తూ కుటుంబ నేపథ్యం, ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల వివరాలను వాకబు చేశారు. తాము విజయవాడ ఆటోనగర్ లో నివాసం ఉంటున్నామని, మహిళను అయినప్పటికీ తన భర్త నమ్మకంతో తనను ఈ వృత్తిలో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. 2014లో నాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు శిక్షణ పొందానని, బాబు గారి చేతులమీదుగానే షి ఆటోలను మాకు అందజేశారని ఆమె తెలిపింది. తమ కుమార్తె సిఎ చదువుతోందని, కుమారుడు ఆర్మీలో చేరాలని ఆసక్తిగా కనబరుస్తున్నాడని చెప్పింది. ప్రస్తుతం పెట్రోలు ఖర్చులు పోను నెలకు పదివేల వరకు సంపాదిస్తున్నానని తెలిపింది. ఎక్కువగా తమ ఆటోలో మహిళలే ప్రయాణిస్తుంటారని చెప్పింది. మహిళల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడంలో మీరు చూపుతున్న చొరవకు హ్యాట్సాఫ్ అని లోకేష్ కు స్వర్ణలత కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోడ్రైవర్ సేవలో పథకం కింద ప్రభుత్వం రూ.15వేలు అందజేస్తున్నందుకు ఆమె సంతోషం వ్యక్తం చేశారు. భార్యాభర్తలిద్దరూ చెరొక పని చేసుకుంటే కుటుంబాన్ని సాఫీగా నడపవచ్చని చెప్పిన మంత్రి లోకేష్.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. అన్నా క్యాంటీన్లలో రూ.5కే ఆహారం పెడుతున్నాం. మధ్యాహ్నం పిల్లలకు సన్న బియ్యంతో భోజనం పెడుతున్నాంఎదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను కూడా గత పాలకులు నడవనీయలేదువిజయవాడలో 90 శాతం వాహనాలు సీఎన్జీ ఇంధనంతోనే నడుస్తున్నాయి వచ్చేరోజుల్లో అన్నీ ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేలా ప్రణాళికలు చేస్తున్నాం. గతంలో పెద్ద ఎత్తున జరిమానాలు విధించేవారు జరిమానాలు భారంగా కాకుండా చూస్తామన్నారు. ఆటో, మాక్సి, క్యాబ్ డ్రైవర్లు క్రమశిక్షణగా ఉండాలి. ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించవద్దు అన్నారు.

# మావోయిస్టులతో చర్చలు లేవు

## ఆయుధాలు వదిలి లొంగిపోవలసిందే

### వచ్చే మార్చి 31కి దేశం మావోయిస్టు రహితం: అమిత్ షా



**చర్ల,అక్టోబరు 4,ప్రభాతవార్త:** మావోయిస్టులు ఆయుధాలు వదిలిపెట్టి లొంగిపోవాలని లొంగిపోయినా వారికి పునరావాసం కల్పిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.శనివారం చత్తీస్‌గఢ్‌లోని జగదల్ పూర్‌లో జరిగిన దసరా ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ప్రభుత్వం తో శాంతి చర్చలపై మవోయిస్టుపార్టీ నుంచి వరుస లేఖలు వెలువడుతున్నాయని మావోయిస్టులతో చర్చలు జరిపేది లేదని అన్నారు. 2026 మార్చి కల్లా మావోయిస్టులను నిర్మూ లిస్తామని పేర్కొన్నారు. చర్చలకు కేంద్రం ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం సిద్ధంగా లేవని స్పష్టం చేశారు. లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసే వారికి మెరుగైన పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని లొంగిపోవాలని హితవు పలికారు.ఇప్పటికే మావోయిస్టుల నిర్మూలనకు పెద్ద ఎత్తున కూబింగ్ జరుగుతుందని దానిని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. మావోయిస్టులు చివరి అంకంలో ఉన్నారని వారితో చర్చలు ఏం ఉండవని స్పష్టం చేసారు.

# రాష్ట్రం సుభిక్షమే

>> అండగా ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో వివిధ సందర్భాల్లో ఆటో డ్రైవర్లను కలిసినప్పుడు గ్రీన్ టాక్స్ తో పడుతున్న ఇబ్బందులు నా దృష్టికి తీసుకువచ్చారు. రహదారుల నిర్వహణ చేయకపోవడం వల్ల ఏ విధంగా నష్టపోతున్నది చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిన్నర లోపే ఆ సమస్యలకు పరిష్కారం చూపాం. గత ప్రభుత్వం వాహన మిత్ర పేరిట రూ. 10 వేలు ఇచ్చింది. ఇచ్చిన రూ. 10 వేలు రోడ్ల మీద గుంతలు పూడ్చకపోవడం వల్ల ఆటోలకు మరమ్మత్తులు చేయించుకోవడానికి కూడా చాలేవి కాదు అన్నారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన రోడ్లకు మరమ్మత్తులు చేశాం. అవసరం ఉన్న చోట కొత్త రోడ్లు నిర్మించాం.కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15,000 ఆర్థిక సాయం అందించింది. తొలి ఏడాది 2,90,669 మంది డ్రైవర్లకు రూ.436 కోట్ల మేర ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఆటో డ్రైవర్లు 2.64 లక్షల మంది, ట్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు 20,072 మంది, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు 6,400 మందికి లబ్ధి చేకూరనుంది. అర్హులై ఉండి పథకం అందకపోతే ఫిర్యాదుల స్వీకరణకు ప్రభుత్వం వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు.




విజయవాడ వెళ్లేందుకు తన నివాసం నుంచి ఆటోలో ప్రయాణించిన సిఎం చంద్రబాబు

# విజయవాడకు ఆటోలో బాబు

**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు తన నివాసం నుంచి సభా ప్రాంగణం వరకు ఆటోలో ప్రయాణించారు. విజయవాడలో ఆటో డ్రైవరుల సేవలో కార్యక్రమలో పాల్గొనేందుకు సుమారు 14 కిలోమీటర్ల దూరం సీఎం ఆటోలో ప్రయాణించారు. ముఖ్యమంత్రితో పాటు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ వేర్వేరుగా ఆటోల్లో ప్రయాణించి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆటో డ్రైవర్ సేవలో పథకం లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్, మాధవ్ ఆటోల్లో ప్రయాణించారు. వారి కుటుంబ స్థితిగతులను నేతలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. రోజుకు 10 నుంచి 12 గంటల పాటు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నామని సీఎం అడిగిన ఓ ప్రశ్నకు ఆటో డ్రైవర్ అఫ్సర్ ఖాన్ సమాధానమిచ్చారు. ఆటో ద్వారా ప్రజలను, ప్రయాణికుల్ని గమ్య స్థానాలకు చేరుస్తూ చేస్తున్న సేవ అభినందనీయమని సీఎం బదులిచ్చారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని సీఎం హామీ ఇచ్చారు. తల్లికి వందనం, దీపం2.0 వంటి పథకాలు అందాయా, రేషన్ ద్వారా బియ్యం తీసుకుంటున్నారా అని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లలను చక్కగా చదివించుకోవాలని పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంచేలా చూడాలని ఆటో డ్రైవర్ అఫ్సర్ ఖాన్ దంపతులకు సీఎం సూచించారు. ఆటోల్లో వెళ్తున్న చంద్రబాబును, ఇతర నేతలను చూసి ప్రజలు సంతోషంతో కేరింతలు కొట్టారు. ప్రజలకు అభివాదం చేసుకుంటూ నేతలు ముందుకు కదిలారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కాళేశ్వరరావు మార్కెట్, ఏలూరు లాకులు, ముత్యాలంపాడు గవర్నమెంటు ప్రెస్ మీదుగా సీఎం సహా ఇతర నేతలు ఆటోల్లో ప్రయాణించారు. ఆటోల్లో సభా ప్రాంగణానికి చేరుకోగానే ప్రయాణానికి సంబంధించిన డబ్బులను ఆటో డ్రైవర్లకు చంద్రబాబు, ఇతర నేతలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమ, రవాణ శాఖ ఉన్నతాధికారులు సహా స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# తీరం దాటిన వాయుగుండం

>> ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. వర్షం నుంచి కోలుకున్న విశాఖలో చెట్ల తొలగింపు చర్యలు ముమ్మరంగా సాగాయి. మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు శ్రీకాకుళం జిల్లా చిగురుటాకులా వణికింది. మరోవైపు ఒడిశాలోనూ వానలు పడటంతో జిల్లాలోని నదులు ఉగ్రరూపం దాల్చాయి. హిరమండల గొట్టా బ్యారేజీకి వంశధార నది వరద నీరు పోటెత్తింది. నీటిని వచ్చినట్లు దిగువకు విడిచిపెట్టారు. ఈ క్రమంలో వాయుగుండం బలహీన పడింది.

# మావోయిస్టుల లొంగు'బాట'

>> తెలుగు రాష్ట్రాలకు చెందిన అగ్ర నాయ కుల్లో మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి సహా ఇతర నాయకులు కీలక స్థానాల్లో వున్నారు. ఇందులో కొందరు ఉమ్మడి ఎపి హయాంలో పోలీసుల కూంబింగ్ సమయంలో తృటిలో తప్పించుకోగా మరికొందరు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పోలీ సులకు సవాల్‌గా మారారు. అయితే మావోయిస్టు పార్టీలో వున్న అగ్రనేతలంతా వయో భారంతో వున్న వారే కావడంపై పోలీసులు దృష్టి సారించా రు. ఇదే సమయంలో వీరిలో అనేక మంది వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయమై కూడా పోలీసులు సమాచారం సేకరిం చారు.

ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యులు, స్నేహితుల చేత ఒత్తిడి చేయించి లొంగిపోయేలా చూడాలన్నది పోలీసుల వ్యూహంలో భాగంగా కని పిస్తోంది. లొంగిపోయిన వారికి భారీ ప్యాకేజి ఇచ్చేందుకు పోలీసు శాఖ రెడీ అవుతోంది. ఛత్తీస్‌ఘడ్‌తో పాటు ఆ రాష్ట్రంతో సరిహద్దులు పంచుకుంటున్న తెలంగాణ జిల్లాల ఎస్‌పిలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నక్సలైట్ల నేతల కుటుంబీలకులను కలుస్తూ లొంగుబాట్లు పెంచేలా కృషి చేస్తున్నారు. న క్సలైట్లు లొంగిపోతే వారు గౌరవంగా జీవించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. నక్సలైట్ల కుటుంబీకుల్లో అనేక మంది బీద రికంతో వుండడంతో వారికి పోలీసు అధికారులు కొన్ని నెలలకు సరిపడ నిత్యావసర సరుకులతో వృద్దులకు వైద్య సేవలకు ఏర్పాట్లు చేశారు. ఇది చాలా మంది ద్వితీయశ్రేణి నక్సలైట్లలో మార్పు వచ్చి వారిని లొంగిపోయేలా చేస్తోంది.

పోలీసులకు లొంగిపోయి ఇక్కడ జనజీవన స్రవంతిలో వుం టే ఎదురయ్యే సమస్యలు చాలా వుండడంతో ఎవరైనా విదేశాలకు వెళ్లాలనుకుంటే ఇందుకు కూడా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖ భావిస్తున్నట్లు తెలిసింది. ఓవైపు అగ్ర నాయకులను లొంగుబాట్లకు ఒత్తిడి తెస్తూనే మరోవైపు రాష్ట్ర స్థాయి నాయకులను కూడా లొంగిపోయేలా చేయాలన్నది పో లీసుల వ్యూహంగా కనిపిస్తోంది. ఇలా చేయడం ద్వారా నూతన భర్తీలు పూర్తిగా నివారించ వచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల వ్యూహం ఫలించి మావోయిస్టు పార్టీ నాయకురాలు పోతుల సుజాత ఇటీవలే లొంగిపోగా మరో నాయకుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ పో లీసులకు లొంగిపో యినట్లుగా తెలిసింది. ఆయన అనారోగ్యంతో పోలీసుల రక్షణలో వైద్యం పొందుతున్నట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో దీ నిపై ప్రకటన వెలువడే వీలుంది. మరికొందరు సీనియర్లను ఇదే తరహాలో లొంగిపోయేలా చేసేందుకు పోలీసులు పావులు కదుపుతున్నారు.

# రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అత్యంత శక్తివంతం

## జెఎస్పీ ఎంఎల్ఏలు, ఎంపిలతో భేటీలో పవన్

**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అత్యంత శక్తివంతంగా ఉందని, సంక్షేమ కార్యక్రమాలు అమలు,వాటి ప్రయోజనాలను ప్రజలకు మరింతగా వివరించాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గింపు ద్వారా ప్రధాని నరేంద్రమోడీ సామాన్య,మధ్యతరగతి వర్గాలపై ఆర్థిక భారం తగ్గించారన్నారు.ఈ విషయంపై ఎన్డీఏ కూటమి పక్షాలు ప్రతి నియోజకవర్గంలోను క్షేత్ర స్థాయి నుంచి విశేష ప్రచారం అందించాలన్నారు. శనివారం సాయంత్రం జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో పవన్‌కళ్యాణ్ కీలక భేటీని నిర్వహించారు.పార్టీనేతకు ముందస్తుగా సమాచారం అందించిన ముగ్గురు మినహా సమావేశానికి జనసేన ఎమ్మెల్యేలు హాజరయ్యారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని పవన్ కళ్యాణ్ సూచించారు.కూటమిలో మన ప్రాధాన్యత మనకు ఉంటుంది.అవసరమైన పదవులు మనం అడుగుతున్నాం,సీఎం చంద్రబాబు సహకరిస్తున్నారు. మీ అభిప్రాయాలకు అనుగుణంగానే ప్రభుత్వ పదవులు పార్టీకి విశేషసేవలందించిన వారికి ఇచ్చాం,ఈ సందర్భంలో కొందరికి పదవులు ఇవ్వలేక పోయాం,అయినప్పటికి వారు పార్టీ సేవల్లో విస్తృతంగా పనిచేస్తున్నారు.రాష్ట్రంలో అత్యంత క్రమ శిక్షణ కలిగిన పార్టీగా మనం ఉన్నాం,ఇలాగే ఉందాం, ప్రాంతీయంగా సమస్యలున్నప్పుడు నా దృష్టిలో పెట్టండి పరిష్కరించుకుందామన్నారు.కూటమిలోని ఇతర భాగస్వామ్య పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో క్రియాశీలక కార్యకర్తలకు పదవులు ఇప్పిస్తున్నాం.

ఇదే సందర్భంలో నామినేటెడ్ పోస్టులపై ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించారు. క్షేత్ర స్థాయిలో కూటమి నేతలతో మనం కలిసి పనిచేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.కొన్ని అంశాల్లో అభిప్రాయ బేధాలు ఉంటాయి.వాటిని మనం ఎప్పటికప్పుడు పరిష్కరించుకుందామన్నారు. కేవలం 16 నెలల మన ఎన్డీఏ పాలనలో ఎన్నో పథకాలు తీసుకొచ్చాం. సూపర్ సిక్స్ సూపర్‌హిట్ అయింది. పింఛన్ల మొత్తాన్ని భారీగా పెంచి ఆదుకుంటున్నాం. పింఛన్ల కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్న ఏకైక ప్రభుత్వమిది. ఇప్పుడు రోడ్లు బాగుపడ్డాయి. ప్రయాణాలకు ఇబ్బంది లేదు. ఉచిత ప్రయాణ సౌకర్యంతో మహిళలు సంతోషంగా ఉన్నారు. ఈ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయి. ఆటో డ్రైవర్లలో చాలా మది పేద వాళ్లే ఉంటారు. ఏడాదికి రూ.15వేలు ఇస్తే...వారికి కొంత ఊరటగా ఉంటుందని ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లు సేవలో పథకం తీసుకుని వచ్చారు.

## వారం - వర్జ్యం

05-10-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
త్రయోదశి మ.2.59
శతభిషం ఉ.7.59
వర్జ్యం : మ.1.51-3.19
దు.సా.4.15-5.03
శుభసమయం:ఉ.5.30-6.30,సా.7.15-8.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** చర్మ సంబంధిత బాధలు కలుగకుండా జాగ్రత్తలు పాటించండి.

**వృషభం:** ఇబ్బందులలో పడిన మీ ఆత్మీయ వర్గానికి రహస్యంగా పరోక్షంగా సహాయపడతారు.

**మిథునం:** సోదర వర్గంతో దీర్ఘకాలికంగా ఉన్న వివాదాలకు తెరపడుతుంది.

**కర్కాటకం :** జీవితాశయాన్ని ఏవిధంగానయినా సరే సాధించాలని దృఢ నిర్ణయానికి వస్తారు.

**సింహం:** మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా ప్రవర్తిస్తారు.

**కన్య :** ఉపయోగ పడని వ్యక్తులనుకున్న వారే కార్యవిజయాలకు కారణం అవుతారు.

**తుల :** మొండి వ్యవహారాలను కాలానికి వదిలి వేస్తారు. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** చికాకు కలిగించే కుటుంబ పరిస్థితులకు దూరంగా పోకుండా సమర్థవంతంగా బాధ్యతలు నెరవేరుస్తారు.

**ధనుస్సు:** అప్పు చేయకపోవటమే నిజమైన పొదుపని గుర్తిస్తారు. వస్తు లాభం.

**మకరం:** పెండింగ్ కేసులు పరిష్కారబాటలో ఉంటాయి. ప్రయాణాలు.

**కుంభం:** ఎదుటి వారి సంభాషణలలోని నిజాలను గుర్తెరిగి తదనుకూలంగా నడుచుకుంటారు.

**మీనం :** ప్రజలతో సంబంధాలు మెరుగుపరచుకోవడానికి అవిరళ కృషి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎన్టీఆర్ జిల్లాకు 8 స్వచ్ఛాంధ్ర అవార్డులు

>> నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు. ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపైనా ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లా పంచాయతీ కార్యాలయం, మునిసిపల్ విభాగాలు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నాయని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణలోనూ ముందంజలో ఉంటున్నాయన్నారు. బహిరంగ ప్రదేశాల శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, రెడ్యూస్ - రీయూజ్ - రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) వంటి విషయాల్లో విస్తృత ప్రజా భాగస్వామ్యంతో జిల్లా స్వచ్ఛమైన విజయాలు సాధిస్తోందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకునేందుకు కృషి చేస్తామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

# 4 జిల్లాల ఎంపిక

>> పరిధిలో ఉన్న 36 పథకాలను సమ్మిళితం చేసి దీని కింద అమలు చేస్తారు. తద్వారా 1.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం కల్గుతుందన్నది అంచనా. ఈ పథకం కింద ఎంపిక చేసిన జిల్లాల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు,నీతి ఆయోగ్ సాయంతో కలెక్టర్లు జిల్లా స్థాయి ప్రణాళికలు రూపొందించి,అమలు చేస్తారు. దీని అమలు తీరు పర్యవేక్షణ కోసం డిజిటల్ డ్యాష్ బోర్డు,రైతుల కోసం యాప్,జిల్లా ర్యాంకింగ్ వ్యవస్థను అమల్లోకి తెస్తారు.

# అప్పగిస్తాం

>>స్పందనతెలియజేసింది.గాజాలో యుద్ధాన్ని ముగించేందుకు, ఖైదీల మార్పిడికి, తక్షణ సహాయం అందించడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలతో పాటు అరబ్, ఇస్లామిక్, అంతర్జాతీయ కృషిని తాము అభినందిస్తున్నట్లు హమాస్ పేర్కొంది.ట్రంప్ ప్రణాళికలో పేర్కొన్న ఫార్ములా ప్రకారం ఇజ్రాయెల్ వద్ద ఉన్న తమ ఖైదీలకు బదులుగా, తమ వద్ద ఉన్న బందీలందరినీ (మృతదేహాలతో సహా) విడుదల చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని హమాస్ స్పష్టం చేసింది. అంతేకాకుండా, గాజా స్ట్రిప్ పాలనా బాధ్యతలను జాతీయ ఏకాభిప్రాయంతో ఏర్పడే స్వతంత్ర టెక్నోక్రాట్ల ప్యానెల్‌కు అప్పగించడానికి కూడా సిద్ధమని ప్రకటించింది. అయితే, ప్రతిపాదనలోని ఇతర వివరాలపై చర్చించేందుకు మధ్యవర్తుల ద్వారా తక్షణమే చర్చలు ప్రారంభించాలని హమాస్ తేల్చిచెప్పింది. ఇజ్రాయెల్, అమెరికా ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న నిరాయుధీకరణఅంశంపై మాత్రం హమాస్ ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంగమనార్హం. ట్రంప్ ప్రణాళికలో తక్షణ కాల్పుల విరమణ, బందీలుఖైదీల మార్పిడి, గాజానుంచి ఇజ్రాయెల్ దళాల దశలవారీ ఉపసంహారణ, హమాస్ నిరాయుధీకరణ, అంతర్జాతీయపర్యవేక్షణలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు వంటి అంశాలు ఉన్నాయి. హమాస్ తాజా స్పందనపై వైట్ హౌస్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



ఆటో నడిపిన ఎమ్మెల్యే, పక్కన పార్టీ అధ్యక్షుడు నాగరాజనాయుడు

## ఆటో నడిపి ఆకట్టుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 4 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి శనివారం ఆటో నడిపి జనాన్ని ఆకట్టుకున్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సహాయంగా రూ.15వేలు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామం నుంచి ఆటో ర్యాలి ఏర్పాటు చేసారు.ఓ వైపు కుండపోత వర్షంలో కూడా ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి ఆటో నడుపుకుంటూ సభా స్థలికి వెళ్ళారు. ఊరందూరు నుంచి పానగల్‌లోని ఓ కళ్యాణమండపం వరకు సుమారు 5కిలో మీటర్లు ఆటో నడిపారు.ఆయనతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా నామినేట్ చేసిన కొట్టే సాయి ఉన్నారు.గ్రామంలోని వారి ఇంటికి వచ్చిన ఆటో డ్రైవర్లతోమాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆటో డ్రైవర్ల ఖాతాల్లో రూ.15వేలు జమచేసారు.

## అన్నదాన కార్యక్రమంలో అపశ్రుతి!

### మరుగుతున్న గంజిపడి.. 16 మంది చిన్నారులకు గాయాలు

**( విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)** విశాఖపట్నంలో దుర్గాదేవి మండపం వద్ద అపశ్రుతి చోటుచేసుకుంది. మరుగుతున్న గంజి మీద పడటంతో 16 మంది చిన్నారులు సహా మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఈ ఘటన విశాఖలోని జాలరిపేట పిల్లా అప్పమ్మయ్య సంఘం వద్ద చోటుచేసుకుంది.ఈ సంఘం వద్ద దసరా సందర్భంగా మండపం ఏర్పాటు చేసి దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. శనివారం రోజున భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడానికి మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. అయితే వంట చేస్తున్న ప్రాంతంలో ప్రమాదవశాత్తూ మరుగుతున్న వేడి గంజి అక్కడే ఉన్న చిన్నారులు, మహిళలపై పడింది. ఈ ఘటనలో 16 మంది చిన్నారులు సహా మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గాయపడిన వారిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.ఈ ఘటనపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆరుగురికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. మిగిలిన 10 మందికి ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపించాలని వైద్యులు నిర్ణయించారు.



## తాతయ్యగుంటగంగమ్మ ఆలయ అభివృద్ధికి నగర మేయర్ భారీ విరాళం

**తిరుపతి,అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమలోనే అత్యంత ప్రసిద్దిచెందిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతుగా విరాళమిచ్చినట్లు తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. ఈ ఐదులక్షల రూపాయలు విరాళాన్ని టిటిడి మాజీ చైర్మన్,వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి చేతులమీదుగా ఆమె గంగమ్మ ఆలయ ఇఒ జయకుమార్‌కు శనివారం మధ్యాహ్నం అందజేశారు. ఈ విరాళం నగదుతో ఆలయ అవసరాలకోసం ప్రైవేట్ స్థలం కొనుగోలుకు ఐదులక్షల రూపాయలు వినియోగించాలని ఆమె కోరారు.గతంలోనే టిటిడి చైర్మన్‌గా ఉన్న కరుణాకర్‌రెడ్డి గంగమ్మ ఆలయాన్ని అన్ని విధాలా పున:నిర్మించి అభివృద్ధి చేశారన్నారు. వైష్ణవి ఆస్పత్రి అధినేత డాక్టర్ మునిశేఖర్,తమ కుటుంబసభ్యులు గంగమ్మ భక్తులుగా ఉన్నామని, అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని భావించి ఈ విరాళమందించడం జరిగిందన్నారు. గతంలోనే ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగిందని, ఈ కారణంగా ప్రైవేట్ స్థలం కొనుగోలుచేసి భక్తుల సౌకర్యాలు మెరుగుపరచాలని కరుణాకర్‌రెడ్డి సంకల్పంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామనర్నారు. శనివారం అది నెరవేరిందని డాక్టర్ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి, వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ హేమకుమార్‌రెడ్డి, డాక్టర్ హరిబాబు,డాక్టర్ రమేష్, మునయ్య, సురేష్‌యాదవ్, చింతారమేష్, అంకయ్య, వెంకటేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమజీవికి ప్రభుత్వం చేయూత!

### - తిరుపతి నియోజకవర్గంలో ఆటోడ్రైవర్లకు రూ.3.46కోట్లు జమ : మంత్రి అనగాని సత్యప్రసాద్



**తిరుపతి,అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్రరెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. స్వయం శక్తితో ఎదిగే శ్రమజీవికి ప్రభుత్వం చేయూతను అందించాలన్న ఉద్దేశ్యంతో "ఆటోడ్రైవర్ల సేవ"లోపథకాన్ని అమలుచేసిందన్నారు. తిరుపతి నియోజకవర్గంలో 2,307మంది లబ్ధిదారులకు ఖాతాల్లో 3.46కోట్లు రూపాయలు జమచేయడం జరిగిందన్నారు. ఒక్కొక్కరికి 15వేల రూపాయలు నగదు ఆర్థికసాయం అందించడం శుభపరిణామమన్నారు. ఆటోడ్రైవర్లు వారి జీవితాల్లో ఇది ఆనందదాయకమన్నారు. ప్రభుత్వం అమలుచేసిన ఆటోడ్రైవర్లుసేవలో 15వేల రూపాయలు నగదు జమ కార్యక్రమంలో శనివారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతిలో పాల్గొన్నారు. కచ్చపి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో అర్హులైన 14,375మంది ఆటోరిక్షా, మోటార్‌క్యాబ్,మ్యాక్సీ క్యాబ్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వాహనదారులకు 21,56, 25,000 రూపాయలను ఆర్థికసాయాన్ని వారివారి ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అని మరోసారి రుజువైందన్నారు. గత వైసిపి ప్రభుత్వం వాహనమిత్ర పేరుతో పదివేల రూపాయలు మాత్రమే ఇవ్వగా తమ ప్రభుత్వం 15వేలు ఆర్థికసాయం ఇచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వం 260 కోట్ల రూపాయలు ఈ పథకం కోసం ఖర్చుచేస్తే తమ ప్రభుత్వం 436కోట్ల రూపాయలు ఇస్తోందని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో ఆటోడ్రైవర్లకు ఒకచేత్తో సాయం చేస్తూనే మరోచేత్తో జరిమానాల రూపంలో 20వేల రూపాయలు దోపిడీచేసిందని మంత్రి అనగాని విమర్శించారు. అంతేగాకుండా పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతంగా పుంచి ఆటోడ్రైవర్లపై ఏడాదికి 36వేల రూపాయలు భారం మోపిందన్నారు. తమ కూటమి ప్రభుత్వంలో ఎలాంటి వేధింపులు లేవని, రోడ్‌ట్యాక్స్‌లు, గ్రీన్‌ట్యాక్స్‌లు లేవన్నారు.

చంద్రబాబు ప్రభుత్వం లైఫ్‌ట్యాక్స్ తొలగించి ఆటోడ్రైవర్లకు మేలుచేసిందన్నారు .ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, నగర కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్సీ,ఆర్టీఒ కొర్రపాటి మురళీమోహన్, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం

### జోరువానలో గోవిందనామ సంకీర్తనలు



**తిరుపతి, అక్టోబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** మోక్షమార్గం పొందడానికి హరినామస్మరణ, హరినామసంకీర్తన సులువైన మార్గమని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. జోరువానలోనూ శనివారం వేకువజామున తిరుపతి పుణ్యక్షేత్రంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో భక్తిభావం చాటింది. శనివారం వేకువజామున రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు తొండడమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కొండె చెంగారెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌చౌదరి, విగ్రహాల కల్యాణి, సుశీల,మునికుమారి, పద్మ, కల్పన, పార్వతి, ధనలక్ష్మి, నిర్మలవాసురెడ్డి, మునినాధరెడ్డి, కస్పాపద్మనాభం, శాంభోలు హరినాథ్, పోన్నాలజేజిరెడ్డి తదితరులు తిరునామం ధరించి భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

### శ్రీవారి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలి



**తిరుమల,అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతోఉండాలని ప్రార్థించినట్లు కేంద్రమంత్రి మురుగన్, తమిళ నాడు మాజీ సిఎం పన్నీరుశెల్వం తెలిపారు. పెరటాసి మాసం మూడవ శనివారం ఉదయంనైవేద్యాల విరామ సమయంలో జోరువానలోనే వీరు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి దర్శనంతో ఆనందంగా ఉందన్నారు.

## పుంగనూరులో భారీ వర్షం

### జలదిగ్బంధంలో సోమల పంచాయతీ గ్రామాలు - మూడు గ్రామాలకు రాకపోకలు నిలిపివేత - రెండు పంచాయతీలలో పెద్ద ఎత్తున పంట నష్టం



రాకపోకలు తెగిన బసవపల్లి రాయల్ పేట రోడ్డు

**పుంగనూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లాలో శనివారం తెల్లవారుజాము కురిసిన కుండపోత వర్షానికి పుంగనూరు నియోజకవర్గం సోమల మండలంలో పలు గ్రామాల్లో జలమయమయ్యాయి. మండలంలోని బసవపల్లె, పేటూరు, పేటూరు ఇర్లపల్లి గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. తెల్లవారుజామున 4గంటల నుంచి ప్రారంభమైన భారీ వర్షానికి సీతమ్మచెరువు మరవకట్ట ఇదివరకే తెగగొట్టబడి ఉండడంతో, పెద్ద ఉప్పరపల్లి అడవుల్లో కురిసిన భారీ వర్షపునీరు మొత్తం ఆవులపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాలకు గార్గేయనది ద్వారా పొంగి ప్రవహించింది. దీంతో ఆవులపల్లి పెద్దపల్లి గ్రామాలలో వ్యవసాయ భూముల్లో గార్గేయ నది ప్రవాహపు నీరు పొంగి ప్రవహించింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 6:30 వరకు ఏకధాటిగా కురిసిన వర్షం 78.5 మి.మిలుగా నమోదు కాగా, 7:30 నుంచి 10 గంటల వరకు ఆగకుండా కురిసిన వర్షంతో మొత్తం వర్షపాతం 120 మిల్లీమీటర్లపైగా నమోదైంది.గత ప్రభుత్వంలో ఆవులుపల్లిని ఆధారంగా చేసుకుని రెండు టీఎంసీల ఆవుల పల్లె ప్రాజెక్టు నిర్మించడానికి పనులు మొదలుపెట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రాజెక్టును పూర్తిగా కాకుండా అర్థంతరంగా ఆగిపోవడంతో పాటు,తలపెట్టిన ఆవుల పల్లె ప్రాజెక్టు కోసం సీతమ్మ చెరువు వంక కట్టను అప్పుడే ప్రాజెక్టు నిర్వాహకులు తెగగొట్టడంతో ప్రస్తుతం ఆ సీతమ్మ చెరువు నుంచి వచ్చే నీరు అడవినీరుతో కలిసి ఇప్పటికే రైతులు బీడు పెట్టబడిన పంట పొలాలు నింపివేశాయి. వర్షం వల్ల ముఖ్యంగా బసవపల్లి రాయల్ పేట రోడ్డు మార్గం పూర్తిగా తెగిపోయింది. రెండు గ్రామాల ప్రజలు నీటి దిబ్బందుల్లో చిక్కుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఉదయం పదిగంటల వరకు ఉధృతంగా ప్రవహించిన వర్షపు నీటి వల్ల ఎటువంటి ప్రాణ నష్టము జరగకపోగా ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. రెవిన్యూ యంత్రాంగం వర్షపు నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. బసవపల్లి రాయల్ పేట తత్కాలిక రోడ్డు తెగిపోవడంతో 24 గంటల్లోగా రోడ్డు సిద్ధం చేసేందుకు అధికారులు ఉపక్రమించారు.

## కూటమి పాలనలో దళితులపై దాష్టీకాలు

### వైఎస్సార్సీ ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొమ్మూరి కనకారావు



**విజయవాడ, అక్టోబరు 4,ప్రభాత వార్తప్రతినిధి:** టీడీపీ ప్రభుత్వం దళితులకు తీరని అన్యాయం చేస్తుందని వైసిపి ఎస్‌సి, ఎస్‌టి సెల్ అధ్యక్షులు కొమ్మూరి కనకారావు ఆరోపించారు.సిఎం చంద్రబాబు దళిత ద్రోహి అన్నారు.తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి సర్కారు పాలనలో దళితులపై నిత్యం దాష్టీకాలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని అన్నారు. ఈ ఘటనకు కారణమైన టిడిపి నాయకులు సతీష్ నాయుడును అరెస్టు చేయాలని కోరారు. ఆయనను రక్షించేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు.ఈ ఘటనలో బాధ్యులందరిపై చర్య తీసుకోవాలన్నారు.

## విష్ణుసదన్ 3వ అంతస్తు నుండి పసిబిడ్డతో జారిపడ్డ మహిళ - తల్లి, కూతురు సేఫ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** అన్నవరం దేవస్థానం రెండవ కొండైన సత్యగిరి పై గల విష్ణు సదన్ 3వ అంతస్తు పై నుండి మూడేళ్ళ చిన్నారితోసహా జారి పడిన మహిళ సంఘటన తీవ్ర కలకలం రేపింది. వివరాల ప్రకారం రాజోలు మండలం, మలికిపురం గ్రామానికి చెందిన శ్యామల సింధు అనే మహిళ కుటుంబ సభ్యులతో కలసి అన్నవరం దేవస్థానం విష్ణుసదన్ హాలు లో జరుగుచున్న బంధువుల వివాహానికి హాజరయ్యారు. శనివారం ఉదయం విష్ణుసధన్ మూడవ అంతస్తులో ఉన్న హాలు లో వివాహం జరుగుచుండగా శ్యామల సింధు తన మూడేళ్ళ కుమారుడు శ్యాకేత్ రామ్ ను అక్కడ గట్టుపై కూర్చోబెట్టి అన్నం తినిపిస్తుండగా ప్రమాదవశాత్తు ఇద్దరూ జారి క్రింద పడ్డారు. క్రిందపడేటప్పుడు బాబుని గట్టిగా పొదువి పట్టుకోవడం, మూడవ అంతస్థు నుండి నేరుగా క్రిందపడకుండా మొదట సన్ షేడ్ పై పడటం వలన ఇద్దరికీ ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదంలో చిన్నారి శ్యాకేత్ రామ్ కు ఎటువంటి గాయాలు కాలేదు. తల్లి శ్యామలకు కాళ్ళకు దెబ్బలు గట్టిగా తగలడం వలన అంబులెన్సులో కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రెండు మోకాళ్ళ ఎముకలు చిట్లడం వలన రెండు మోకాళ్ళకు సర్జరీ అవసరమని వైద్యులు చెప్పినట్లు ఆమె బంధువులు తెలిపారు.సత్యదేవుని దయతో బాబు శ్యాకేత్ రామ్ కి ఎటువంటి గాయాలు కాలేదని, తల్లి శ్యామల సింధుకు కూడా అదృష్టవశాత్తు పెద్ద గండం తప్పిందని వీరి బంధువులు తెలిపారు. ఈ సంఘటనపై తొండంగి మండల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కల్తీమద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం

### టిడిపి నాయకులే లిక్కర్‌డాన్‌లుగా మారారు

వైఎస్సార్సీ జనరల్ సెక్రటరీ గడికోట శ్రీకాంత్‌రెడ్డి




**హైదరాబాద్, అక్టోబరు 4,ప్రభాతవార్త:** రాష్ట్రంలో టీడీపీ నాయకులు కల్తీ లిక్కర్ డాన్లుగా మారి, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వైఎస్‌ఆర్‌సిపి జనరల్ సెక్రటరీ గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులే పారుతోందని, టీడీపీ నేతలు కల్తీ మద్యం తయారీని పరిశ్రమ స్థాయికి తీసుకువెళ్ళారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త మద్యం పాలసీ ముసుగులో విచ్చలవిడిగా ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు కేటాయించి, గ్రామగ్రామాన బెల్ట్ షాప్‌లను ఏర్పాటు చేయించి, ఈ కల్తీ మద్యాన్ని వాటి ద్వారా విక్రయిస్తున్నారని ధ్వజమెత్తారు. నాణ్యమైన మద్యం పేరుతో సీఎం చంద్రబాబు చెబుతున్నది ఈ కల్తీ మద్యం గురించేనని, ప్రజల ప్రాణాలను బలిపెట్టి, టీడీపీ నేతలు తమ జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ అండదండలతో టీడీపీ నాయకులే కల్తీ లిక్కర్ తయారు చేసి మందు బాబుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తాజాగా మదనపల్లె సమీపంలోని తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో శుక్రవారం కల్తీ మద్యం రాకెట్ వ్యవహారం బయటపడింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏకంగా ఒక డిస్టిలరీ యూనిట్ స్థాయిలో రోజుకు 15వేల కేసుల కల్తీ లిక్కర్ తయారు చేసి బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్నారు. ఈ కేసులో మండల స్థాయి టీడీపీ నేత కట్టా సురేంద్ర నాయుడుతోపాటు ఎనిమిది మంది కూలీలను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. కానీ ఈ కల్తీ మద్యం రాకెట్ వెనుక రింగ్ మాస్టర్, సూత్రధారుల పేర్లపై ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. అన్నమయ్య జిల్లాకు చెందిన ప్రభుత్వ కీలక నేతను చంద్రబాబు, నారా లోకేశ్‌కాపాడుతున్నారు. అయితే ప్రశ్నిస్తానని పార్టీ పెట్టిన పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో కూటమి పాలనలో యథేచ్ఛగా సాగుతున్న కల్తీ మద్యం విక్రయాలపై స్పందించాలన్నారు.

### తన ఫొటోలు మార్ఫింగ్ చేశారంటూ జనసేన నేత లక్ష్మీరెడ్డి ఫిర్యాదు

**తిరుపతి,అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నియోజకవర్గ జనసేనపార్టీ నేత కిరణ్‌రాయల్ వివాదంలో బాధితురాలు లక్ష్మీరెడ్డి పోలీసులకు ఫిర్యాదుతో పెద్ద ట్విస్ట్ నెలకొంది. కొందరు పనిగట్టుకుని తనపై మార్ఫింగ్ వీడియో ఫోటోలను జనసేన, వైసిపికి చెందిన వ్యక్తులు వైరల్‌చేశారని, తనను నమ్మించి గత కేసులో ఏమీ మాట్లాడకూడదని బెదిరిస్తున్నారని ఆమె తిరుపతి ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసిన వైసిపి నేత పసుపులేటి సురేశ్‌పై, జనసేనపార్టీ నేతలు దినేశ్‌జైన్, హరిశంకర్, గనిలపై ఆమె పలు ఆరోపణలు చేశారు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈస్టు పోలీసులకు శనివారం పిర్యాదు చేయడంతో ఇప్పుడు మరో మలుపుతిరగనుంది. గతంలో కిరణ్‌రాయల్‌పై తనతో వీరంతా బెదిరించి కొన్ని విషయాలు చెప్పాలన్నారని అయితే అలాంటిదేమీ జరగలేదని, ఆమె కొన్ని సంచలన నిజాలు బయటపెట్టారు. తన ఫోటో వీడియోలు మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారని సురేష్‌పై ఆరోపణలు చేశారు. వాటిని తొలగించాలని కోరినా అందుకు వారంతా తనపై తిరగబడి ఏమీ పట్టించుకోకుండా ఉండాలని బెదిరిస్తున్నారని లక్ష్మీ పోలీసులకు ఫిర్యాదులో పేర్కొంది.

## అల్పపీడనం ప్రభావం - తిరుమల,తిరుపతిలో భారీ వర్షం

### - లోతట్టుప్రాంతాలు జలమయం



**తిరుమల,అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళా ఖాతంలో అల్పపీడనం ప్రభావంతో శనివారం వేకువజామున 4గంటల నుండి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామునుండి ఏకధాటిగా కురిసిన వర్షంతో తిరుమల,తిరుపతి తడిసి ముద్ద య్యా యి. ఆలయం ముందు వర్షపునీరు పోటెత్తింది. ఆలయం మాఢవీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాంభగీచా అతిథి గృహా లు, హెచ్‌టి కాంప్లెక్స్, ఎస్వీ షాపింగ్ కాంప్లె క్స్, ఎస్ఎన్‌సి ప్రాంతాల్లో వాననీరు చేరింది. భారీ వర్షంతో తిరుమల పూర్తిగా వాతావరణం మారిపోయింది. ఉదయం 10గంటల వరకు ఈ జోరువాన కురిసింది. వేకువజామున ఆలయం లోనికి వెళ్ళే భక్తులు వర్షానికి తడుస్తూ స్వామి వారి దర్శనానికి చేరుకోవాల్సి వచ్చింది. ఆల యం నుండి వెలుపలకు వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు. గదులకు చేరుకోవడానికి ఇబ్బం దులు పడ్డారు. ఎండిన చెట్లను, కొమ్మలను తొలగించడంతో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. ఒక్కసారిగా ఐదుగంటలపైగా కురిసిన భారీ వర్షానికి తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటి ఘాట్‌లో, తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో వాననీరు జోరుగా ప్రవహించింది. వాహనదారులు చాలా జాగ్రత్తగా వాహనాలను నడిపారు. కాలినడక మార్గాల్లో ఎక్కడ భక్తులు అక్కడ నిలిచిపోయారు. శనివారం వాతావరణం పూర్తిగా మారిపోయి చల్లటిగాలులు వీస్తున్నాయి. ఆలయంలోపల వాననీరును ఎప్పటికప్పుడు వెలుపలకు పంపారు. జలాశయాలకు నీరు మోస్తరుగా చేరింది. అల్పపీడనం ప్రభావంతో తెల్లవారుజామున 4గంటల నుండి మొదలైన వాన ఉదయం 9గంటల వరకు కురిసింది. జోరువానతో తిరుపతిగరంలో జనజీవనం స్తంభించిపోయింది. నగరంలోని రైల్వే అండర్‌బ్రిడ్జిలు డిఆర్‌మహల్‌రోడ్డు, ఆర్‌సిరోడ్డు, వెస్టుచర్చి ప్రాంతాల్లోని అండర్‌పాస్‌లలో మోకాలిలోతువరకు వాననీరు చేరడంతో ప్రమాదస్థాయి ఏర్పడింది. వాహనాలను రాకపోకలను ఆపివేశారు. తిరుమలకు వెళ్ళడానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు తిరుపతి అలిపిరి టోల్‌గేట్‌లో భక్తులు ఆగిపోయారు. వరదనీటితో నగరంలోని రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ఆర్టీసి బస్టాండ్ వరదనీరు చేరింది. లోతట్టు శివారుప్రాంతాల్లో వాననీరు ఇళ్ళలోకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నంకు వాన ఆగడంతో ప్రజలు కొంత ఊపిరిపీల్చుకున్నారు.

## విజయవాడ ఉత్సవాల పేరుతో రూ.70 కోట్లు వసూలు: దేవినేని అవినాష్



విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:విజయవాడ ఉత్సవ్ పేరుతో అధికార పార్టీ నాయకులు దోపిడీకి పాల్పడ్డారని, డొనేషన్ల పేరుతో రూ.70 కోట్లు వసూలు చేశారని ఎన్‌టిఆర్ జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్ ఆరోపించారు. కూటమి పాలనలో పండగ రోజు కూడా ప్రజలు సంతోషంగా లేరని, ఇచ్చిన హామీల అమల్లో వైఫల్యం చెందిందని అన్నారు. ఉత్సవాల పేరుతో దండుకున్న రూ.70 కోట్లు ఎవరి చేతుల్లోకి పోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.450 కోట్ల విలువైన 45 ఎకరాలు భూమిని కాజేసేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. వాటిల్లో హోటళ్లు, మల్టీప్లెక్స్‌లు, గోల్ఫ్ కోర్స్ పేరుతో కాజేసేందుకు కుట్ర చేశారని విమర్శించారు. ఉత్సవాలకు డొనేషన్లు ఇవ్వని వారిని జీఎస్‌టి అధికారుల పేరుతో ఒత్తిడి చేయించారని అన్నారు. ఎంపితో సహా అందరూ బలవంతపు వసూళ్లలో భాగస్వాములేనని ఆరోపించారు. ఓ ప్రైవేటు వాణిజ్య కార్యక్రమానికి నేరుగా సీఎం ప్రమోట్ చేయడమేమిటని ప్రశ్నించారు.విజయవాడ ఉత్సవం కార్యక్రమంలో ప్రతి ఈవెంట్ డబ్బుతో కూడుకున్నవన్నారు.భారీగా ప్రజలను దోచుకున్నారన్నారు.ఇది ప్రైవేట్ సంస్థలు వ్యాపారం కోసం పెట్టిన కార్యక్రమం అని తెలిసినా అధికార యంత్రాంగం ఎందుకు ఇందులో పాల్గొందన్నారు.మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలన్నారు.

## ప్రభుత్వం తక్షణమే విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

### - సిఎంకు సిపిఐ రామకృష్ణ లేఖ

**విజయవాడ.అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను నివారించేందుకు తగు చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు ఆయన శుక్రవారం లేఖ రాశారు. విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు గత కొంత కాలంగా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు. రెగ్యులర్ ఉద్యోగుల ప్రధాన సమస్యలతోపాటు కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర పలు డిమాంతడ్లపై పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. గత ఎన్నికల ముందు విద్యుత్ సంస్థల్లోని కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఈ నెల 15 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు యాజమాన్యానికి ఇప్పటికే నోటీసు సమర్పించిందని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులు సమ్మెలోకి వెళితే విద్యుత్ సరఫరాలో అతరాయం ఏర్పడే ప్రమాదం నెలకొందన్నారు. తాగు, సాగునీరు, పరిశ్రమలకు విద్యుత్ కీలకమైనందున సరఫరాలో సమస్యలు ఏర్పడితే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు.

## ప్రతిష్టాత్మక స్వచ్ఛాంధ్ర పురస్కారాలలో మెప్మాకు నాలుగు రాష్ట్రస్థాయి అవార్డులు!

### - బెస్ట్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ అవార్డుతో సత్తా చాటిన మెప్మా

**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణ పేదరిక నిర్మూలనకు కృషిచేస్తున్న మెప్మా సంస్థ, తాజాగా ప్రకటించిన రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాలలో ఒకేసారి ఏకంగా నాలుగు రాష్ట్రస్థాయి అవార్డులను సాధించి చరిత్ర సృష్టించింది.. బెస్ట్ సోషల్‌మీడియా అవార్డు మెప్మాకు దక్కింది.స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిర్వహించిన ఈ పోటీలో 19 ప్రభుత్వ శాఖలు పాల్గొనగా, ఈ అవార్డును మెప్మా దక్కించుకుంది. కంటెంట్ నాణ్యత, సృజనాత్మక ప్రచారాలు, రెగ్యులర్ పోస్టింగ్‌లు, ఎంగేజ్‌మెంట్ (లైక్స్, షేర్స్) స్వచ్ఛాంధ్ర థీమ్‌లను సమర్థంగా ప్రచారం చేసినందుకు ఈ గుర్తింపు లభించింది.మూడు స్టేట్ స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ లెవెల్ అవార్డులు మెప్మాకు లభించాయి. టెర్రస్ గార్డెన్, హోమ్ కంపోస్ట్ విభాగాల్లో జరిగిన పోటీల్లో మెప్మాకు చెందిన ప్రకాశం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల ఎస్ఎల్ఎఫ్ అవార్డులను గెలుచుకున్నాయి. ఈ ప్రతిష్టాత్మక అవార్డులను ఈ నెల 6వ తేదీ సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా అందించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడునుంచి మెప్మా మిషన్ డైరెక్టర్ శ్రీ ఎన్. తేజ్ భరత్ ,ఐఏఎస్ గారు ఈ సోషల్ మీడియా అవార్డును అందుకోనున్నారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ మార్గదర్శకత్వం, ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ ఎస్. సురేష్ కుమార్ రి పర్యవేక్షణకు దక్కిన గౌరవంగా ఈ పురస్కారాలని మెప్మా మిషన్ డైరెక్టర్ శ్రీ ఎన్. తేజ్ భరత్ ఐఏఎస్ పేర్కొన్నారు. ఈ విజయాన్ని మెప్మా బృందం, పట్టణ స్వయం సహాయక సంఘాలకు అంకితమిచ్చారు.

# వైభవంగా విశ్వపతి విజయోత్సవాలు

ఈ ఏడాది భారీగా భక్తులు విచ్చేస్తారని ముందుగానే ఊహించిన ఆలయ ఇఒ శీనానాయక్, ఆలయ వర్గాలు అందుకు తగ్గట్లు తగిన ఏర్పాట్లు చేయడంతో ప్రశాంతంగా భక్తులు అమ్మవారిని దర్శించుకోగలిగారు. చివరిరోజు కృష్ణనదిలో కనకదుర్గమాత తెప్పోత్సవం అత్యంత విశిష్టత.హంస వాహనంపై గంగాపార్వతీసమేత దుర్గామల్లేశ్వరులు కటాక్షించారు. ఈ పదిరోజులు లక్షలాదిమంది భక్తులు దేశం నలుమూలల నుండి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నవరాత్రుల్లో మూలనక్షత్రంరోజు సెప్టెంబర్ 29వతేదీ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఇంద్రకీలాద్రిపై సరస్వతీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఇంద్రకీలాద్రిని అభివృద్ధిచేసి భక్తు




లకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని కూడా ప్రకటించారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రులు ప్రారంభమై చివరిరోజు వరకు 15లక్షల మంది సాధారణ భక్తులతోబాటు భవానీ మాలలుధరించిన భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం రికార్డుస్థాయిగా ఆలయ అధికారులు తెలిపారు. గత ఏడాదికంటే 15శాతం భక్తులు పెరగడం ఆలయవర్గాల ప్రణాళికలు,ప్రశాంత దర్శనం,సౌకర్యాలు కల్పనగా భావిస్తున్నారు. నవరాత్రుల్లో రోజుకు పలురకాల పిండివంటలు నైవేద్యంగా అమ్మవారికి నివేదించారు. ఈ ఏడాది భక్తులకు ప్రశాంత దర్శనంకల్పించడం ఆలయ అధికారులు ప్రణాళికలు అమలుచేసి భక్తుల మన్ననలు అందుకున్నారు.

'వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన, వేంకటేశ సమో దేవో నభూతో నభవిష్యతి"

కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామి వంటి మహిమాన్వితమైన దేవుడు, అంతటి సమానమైన దేవుడు లేడనేది పదకవితా పితామహుడు అన్నమాచార్యులు ఆనాడే విశదపరిచాడు. బ్రహ్మోత్సవాలు, నవరాత్రి ఉత్సవాలు అంటే హిందూ దేవాలయాలలో నిర్వహించే ముఖ్యమైన వార్షిక పండుగలు. వీటిని ఆయా దేవాలయ సంప్రదాయాన్ని పరిగణనలోనికి తీసుకుని తొమ్మిదిరోజులు జరుపుకుంటారు. ఈ ఉత్సవాలలో దేవతలను వివిధ రకాల అలంకరణల్లో వాహనాలపై ఊరేగించడం, యాగశాలలో హోమాలు, ధ్వజారోహణం వంటి ఆచారాలు జరిపిస్తారు. దక్షిణ భారతదేశం సుప్రసిద్ధ ఆలయాలకు ఖ్యాతి. ఆంధ్రప్రదేశ్‌లో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో ఈ ఉత్సవాలను ఎంతోభక్తితో అత్యంత వేడుకగా నిర్వహిస్తారు.నవరాత్రులు తొమ్మిది రోజులు కలియుగ వైకుంఠం తిరుమల 'గోవింద' నామంతో ప్రతిధ్వనించగా, ఇంద్రకీలాద్రి 'జై భవానీ'నామంతో పులకించింది. ప్రపంచవ్యాప్తంగా భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా, పుణ్యక్షేత్రంగా అలరారుతున్న తిరుమల క్షేత్రానికి వేలసంవత్సరాల చరిత్ర ఉంది. శ్రీ వేంకటేశ్వర స్వామిని కోట్లాదిమంది భక్తులు తమతమ ఇష్టమొచ్చినట్లు శ్రీనివాసుడని,సప్తగిరీశుడని, ఏడుకొండలస్వామి, పెరుమాళ్‌అని, బాలాజీ అని,తిరుమలప్ప, తిరుమలేశ అని కొలుస్తున్నారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సప్తగిరులపై ప్రతి రోజూ ఉత్సవాలే. ఆలయంలో ఆయా ప్రత్యేక పర్వదినాల్లో ఆయా సందర్భాల్లో స్వామివారి 'పంచబేరాలు'కు వేదపండితులు ఉత్సవాలు జరిపిస్తారు. ఏడాదిలో 450 ఉత్సవాలు జరిగినా, నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలలో బ్రహ్మోత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. అధికమాసం వచ్చినపుడు ఏడుకొండల దేవునికి రెండుసార్లుబ్రహ్మోత్సవాలు జరుగుతాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడవసంవత్సరం అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భంలో కన్యామాసం(భాద్రపదంలో) సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవం,


పావులూరు పద్మనాభమ్

ఆశ్వయుజంలో దసరా నవరాత్రుల్లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఉంటాయి. స్వామివారికి తొలిసారిగా బ్రహ్మోత్సవాలను సృష్టికర్త బ్రహ్మదేవుడే ఆరవ శతాబ్దంలో జరిపించినట్లు భవిష్యోత్తర పురాణం పేర్కొంది. ఈ ఏడాది కన్యామాసంలో సెప్టెంబర్ 24వతేదీ నుండి అక్టోబర్ 2వరకు విశ్వపతికి కన్నులపండువగా ఒకసారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా జరిపించడం వెనుక టిటిడి బోర్డు ఛైర్మన్ బొల్లినేని



రాజగోపాల్ నాయుడు(బిఆర్‌నాయుడు),అనుభవజ్ఞులైన గత టిటిడి ఇఒ శ్యామలరావు,సెలవుపై వెళ్లినా అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తాజా టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ పటిష్టప్రణాళికలు రచించి, వ్యూహాత్మకంగా చిన్నపాటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేశారు. గత అనుభవాలను,లోటుపాట్లను సరిదిద్దుకుంటూ తొలి నుండి బ్రహ్మోత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించిన టిటిడి బోర్డు, అధికార యంత్రాంగం సిఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా సామాన్యభక్తులకు అధిక ప్రాధాన్యతనిచ్చింది. సెప్టెంబర్ 23వతేదీ మంగళవారం రాత్రి అంకురార్పణతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు 24వతేదీ సాయంత్రం ధ్వజారోహణం,రాత్రి పెద్ద శేషవాహనం, సిఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించారు. 25వతేదీ ఉదయం చిన్నశేష వాహనం నుండి అక్టోబర్ 1వతేదీ రాత్రి అశ్వవాహనం చివరి వరకు వాహన సేవలను సామాన్యభక్తులు వీక్షించేలాసకలసౌకర్యాలు, సదుపాయాలు కల్పించారు. బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు 28వతేదీ ఆదివారం రాత్రి అత్యంత విశిష్టమైన గరుడసేవను సైతం మూడులక్షలమంది భక్తులు వీక్షించేలా ఏర్పాట్లు చేసి, ఈ ఏడాది 14రకాల ఆహారపదార్థాలు గంటగంటకు వినూత్నంగా గ్యాలరీల్లోని భక్తులకు అందించారు. గరుడసేవలో చిన్నపాటి తోపులాట జరగకుండా, భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడటంతోనే టిటిడి తొలివిజయాన్ని అందుకుంది. ఇక అక్టోబర్ 2వతేదీ ఉదయం అత్యంత విశిష్టత ఉన్న చక్రస్నానమహోత్సవాన చక్రత్తాళ్వార్‌తోబాటు లక్షమందిభక్తులు పునీతమైన పుష్కరిణిలోని పవిత్ర జలాల్లో పుణ్యస్నానాలతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. టిటిడిలోని అన్ని విభాగాలు సమష్టిగా,సమన్వయంతో సేవలందించడమే ఈ పెద్ద విజయాన్ని అందుకోగలిగారు.తొమ్మిదిరోజులపాటు 16వాహన సేవలను, మూలవిరాట్టును 7.30లక్షలమంది భక్తులు దర్శనం చేసుకునేలా టిటిడి చక్కటి సేవలందించింది. భక్తులు తమ మొక్కుబడులను కానుకల రూపంలో స్వామివారిహుండీకి సమర్పించుకున్న ఆదాయం కూడా 30.51కోట్ల రూపాయలు చేకూరింది.దాదాపు 28లక్షలమంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. 2.48లక్షలమంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ఏడుకొండలస్వామి దర్శనం తరువాత అంతటిపవిత్రమైన లడ్డూప్రసాదాలు 30లక్షలపైగా భక్తులకు విక్రయించారు. ముందుగానే 8లక్షల లడ్డూలను నిల్వఉంచారు. టిటిడి చరిత్రలో బ్రహ్మోత్సవాల్లో ఇదివరకు ఎన్నడూలేని విధంగా ఈఏడాది 28రాష్ట్రాల నుండి 298 కళాబృందాలలో దాదాపు 6,976 మంది కళాకారులు తమతమ భక్తిని చాటుకున్నారు. సెప్టెంబర్ 28వతేదీ రాత్రి జరిగిన గరుడసేవ రోజు మాత్రం 20 రాష్ట్రాల నుండి 37కళాబృందాలతో 780మంది కళాకారులతో అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో 60టన్నులు పుష్పాలు, నాలుగు లక్షల కట్‌ఫ్లవర్స్, 90వేల సీజనల్ పుష్పాలను వినియోగించి అత్యంత కనువిందుగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. 3,500 మంది శ్రీవారి సేవకులు ఆ తొమ్మిదిరోజులు తిరుమలలో భక్తులకు లేదు అని అనకుండా నిరంతరాయంగా పాలు,కాఫీ, మజ్జిగ, అల్పాహారం, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. భద్రతా పరంగా కూడా టిటిడి ఈ ఏడాది మరింతగా ప్రత్యేకదృష్టి సారించింది. నాలుగువేలమంది పోలీసు అధికారులు, 1,800మంది టిటిడి విజిలెన్స్‌సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతను కల్పించారు. ఆరోగ్యశాఖ కూడా తిరుమలలో, ఆలయ మాఢవీధుల గ్యాలరీల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి 2,800మంది సిబ్బందితోమెరుగైన పారిశుధ్యం పనులుచేశారు. మొత్తం మీద తొమ్మిదిరోజులు జరిగిన తిరుమలేశుని బ్రహ్మోత్సవాలు భక్తుల సహకారంతోనే విజయవంతం చేశామనేది టిటిడి బోర్డు,టిటిడి అధికారులు తమ అభిప్రాయం తెలిపారు.

**వేడుకగా ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు..**



ఈ జగత్తును నడిపించేది కంటికి కనిపించని ఒక మహాశక్తి. చైతన్యస్వరూపిణి అయిన విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారనేది భక్తుల ప్రగాఢవిశ్వాసం. హిందువులుజరుపుకునే దసరా పండుగకు శరన్నవరాత్రి మహోత్సవాలు అని కూడా పేర్కొంటారు. నవరాత్రులు అనగానే అమ్మవార్లు భక్తులకు గుర్తుకువస్తారు. ఈ ఆరాధనోత్సవాలు తోమ్మిదిరోజులు పాటు జరిగాయి.సకల భువన బ్రహ్మాండాలకు ఆది దేవత అమె. షెడశమహామంత్ర స్వరూపిణి. ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ముఖ్యమైన పవిత్రమైన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం భక్తులకు ఎంతో ప్రాముఖ్యం. కనకదుర్గమ్మ ఆలయంలో దేవత స్వయంభుగా భావించబడుతుంది. శాంత స్వరూపంతో, చిరునవ్వులు చిందిస్తూ అమ్మవారు దర్శనమిస్తారు. ప్రతి శుక్రవారాల్లో ప్రత్యేక భక్తితో అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. దసరావేడుకలకు ముందు భక్తులు కృష్ణ నదిలో పవిత్రస్నానాలా చరిస్తారు. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని పదిరూపాలను పూజిస్తారు. నవరాత్రుల్లో తొలిరోజు స్వర్ణ కవచలం కృత దుర్గా, రెండో రోజు బాలాత్రిపుర సుందరి, మూడవరోజు అన్నపూర్ణగా, నాల్గవరోజు గాయత్రిమాతగా, ఐదవరోజు లలితాత్రిపురసుందరిదేవిగా, ఆరవరోజు చదువుల తల్లి సర స్వతిగా, ఏడవరోజు మహాలక్ష్మి అలంకారంలో, ఎనిమిదవ రోజు దుర్గదేవిగా, తొమ్మిదవరోజు మహిషాసురమర్థినిగా, దసరా ఉత్సవాల్లో చివరగా పదవరోజు రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారిని అలంకరించి భక్తులు మొక్కులు తీర్చుకోవడం ప్రత్యేకత. ●

# 'ఇంటర్వెల్' తర్వాత!

తమిళనాడు

తానొకటి తలిస్తే దైవమొకటి తలచిందన్నట్లుగా టివికె పార్టీ అధినేత, నటుడు విజయ్ పరిస్థితి కనిపిస్తోంది. రాజకీయంగా ఎదగాలనే కాంక్షతో పార్టీ పెట్టింది మొదలు గత యేడాదిన్నర కాలంలో వరుసగా ఏవో దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. పరుగు పందెంలో ఒక్కొక్కసారి దెబ్బలు తగలడం సహజమే అనుకోవచ్చుకానీ గతవారం రోజులుగా మాత్రం మరిన్ని పెద్ద గాయాలే ఆయనకు అయ్యాయని చెప్పక తప్పదు. గత సంవత్సరం ఫిబ్రవరిలో పార్టీని ప్రారంభించిన తర్వాత అటు సినిమాల్లో నటిస్తూనే ఇటు రాజకీయ సభలు కూడా నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా యేడాది వ్యవధి ఉన్నా,విజయ్ బహిరంగ సభలతో తమిళనాట రాజకీయ వాతావరణం రంగు మారింది. దానితో మిగిలిన రాజకీయ పార్టీలు కూడా ఎన్నికలకు సిద్ధం కావడం ఆరంభించాయి. తన పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేసుకోవడం కంటే ఇతర పార్టీలను విమర్శించడానికే ఆయన ప్రాధాన్యమిస్తూండడంతో అధికార డిఎంకె తనకు ప్రధాన ప్రత్యర్థిగా టివికెను భావించే పరిస్థితి ఏర్పడింది. ఈదశలో విజయ్ వారంక్రితం సెప్టెంబరు 27న కరూర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీ ఆయన పార్టీకి లాభంకంటే నష్టమే ఎక్కువ తెచ్చిపెట్టిందనిపిస్తుంది. ఆ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోవడం మొత్తం దేశ ప్రజలందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. 100 మందిపైనే తీవ్రంగా గాయపడ్డారు.ఒక రాజకీయ పార్టీ ర్యాలీలో తొక్కిసలాట జరగడం, దానిలో ఇంత మంది మరణించడం కూడా అసాధారణ విషయమే.సాధారణంగా గుడులు, గోపురాలవద్ద జరిగే వేడుకలకు భక్తులు అనూహ్య సంఖ్యలో రావడం, ఆరద్దీలో తొక్కిసలాట జరగడం, అప్పుడప్పుడు మరణాలు కూడా సంభవించడంవింటూ ఉంటాం. కానీ ఒక రాజకీయ ర్యాలీలో ఇంతటి విషాదం నిజంగానే అవాంఛనీయం. సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన వారు ఇలాంటి సభలు జరిపినప్పుడు అసంఖ్యాకంగా అభిమానులు రావడం సహజమే అయినావారిని క్రమబద్ధీకరించడంలో నాయకులు విఫలం కావడం విచారకరంముఖ్య మంత్రి స్టాలిన్ తక్షణమే స్పందించి అదేరోజు రాత్రి ఆస్పత్రులకు వెళ్లి

ఎ.వి.వి ప్రసాద్

బాధితులను పరామర్శించడం, కొంత పరిహారాన్ని ప్రకటించడం అధికార పార్టీకి రాజకీయంగా కలిగించిన ప్రయోజనం కాగా టివికె పార్టీకి అనూహ్య నష్టంగా కనిపిస్తుంది.తానెంతో బాధపడుతున్నట్లుగా ఓ ప్రకటన విడుదల చేసి విజయ్ ఊరుకున్నారు.కొంచెం ఆలస్యంగా మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించారు. ఈ ధోరణి ఆయన ఇమేజ్‌కు కొంత నష్టం కలిగించిందనే పరిశీలకులు భావిస్తున్నారు. ఘటన వెనుక కుట్రకోణం ఉన్నదంటూ విజయ్ ఆరోపించడం కూడా విమర్శలకు గురైంది. అతి దారుణ విషాదంలో అందరూ మునిగి ఉంటే విజయ్, ఆయన పార్టీనాయకులు అక్కడి నుంచి వెళ్లిపోవడం, కేవలం ఆరోపణలకే పరిమితం కావడం కూడా ఎక్కువ విమర్శల పాలైంది. ఈమొత్తం ఉదంతంలో విజయ్ వ్యూహ లోపం స్పష్టంగా కనిపించింది. దీనికితోడు రెండు రోజుల క్రితం హైకోర్టు చేసిన వ్యాఖ్యలు విజయ్,ఆయన పార్టీ ఇమేజ్‌ను మరికొంత తగ్గించాయనే చెప్పాలి. 'టివికె అధ్యక్షుడు విజయ్‌కి నాయకత్వ లక్షణాలు లేవు. ఘటన జరిగిన వెంటనే పార్టీ నాయకులందరూ అక్కడి నుంచి పారిపోయారు. ఆ ఘటన మనుషుల కారణంగా ఏర్పడిన విపత్తు. తొక్కిసలా టలో అన్ని పార్టీలు సహాయ చర్యలు చేపడితే కార్యక్రమ నిర్వాహకులు మాత్రం పరారయ్యారు' అంటూ చాలా నిశితంగానే హైకోర్టు ధర్మాసనం ఆక్షేపించింది. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేసింది. ఆ దర్యాప్తులో విజయ్ పార్టీదే దోషమని తేలితే చర్యలు కఠినంగానే ఉండవచ్చు. సిబిఐ దర్యాప్తు జరపాలని విజయ్ పార్టీ వేసిన పిటిషన్‌ను



విజయ్

ధర్మాసనం కొట్టివేయడం కూడాఆలో చించాల్సిన విషయమే. పోలీసు దర్యాప్తు పూర్తి కాకుండా సిబిఐ దర్యాప్తు ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. నెలరోజుల క్రితం మదురైలో ఇటు వంటి ర్యాలీయే విజయ్ నిర్వహించినప్పుడు ఏవో స్వల్ప ఘటనలు మినహా దాదాపు ప్రశాంతంగానే సాగిపోయింది. కరూర్‌పై కూడా ఆయన అలాగే భావించి ఉంటారు. కానీ అనుకున్న సంఖ్య కంటే చాలా అధికంగా అభిమానులు రావడం, విజయ్ రాక ఏడుగంటలు ఆలస్యం కావడం తొక్కిసలాటకు ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి. అంతటి భారీ జనసమూహం చేరే చోట అవాంఛనీయం జరగకుండా తగినముందు జాగ్రత్త చర్యలు తీసు కొనకపోవడం మరో విచారకరమైన అంశం. హై కోర్టు ఈఅంశాన్ని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించ డం గమనార్హం. భవిష్యత్తులో ర్యాలీలు నిర్వ హించే వారందరికి గుణపాఠంగా హైకోర్టు కొన్ని సూచనలు చేసింది. ఇకపై జరిగేసభలు,సమావేశాలలో నిర్వాహకులు, పోలీసులు తప్పనిసరిగా తీసుకోవల్సిన చర్యలను కూడా సూచించింది. తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు, అంబులెన్స్ సేవలు, ఎంట్రీ ఎగ్జిట్ మార్గాల విషయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. ప్రజల ప్రాణాల రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇది ఇలా ఉంటే, రాజకీయ పార్టీ నేతల ర్యాలీలపై ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించే వరకు హైవేలపై ఎటువంటి రాజకీయ ర్యాలీలకు పోలీసులు అనుమతి ఇవ్వరంటూ తమిళనాడు ప్రభుత్వం కూడా హైకోర్టుకు తెలిపింది. అటువంటి నిబంధనలు రూపొందించడం, అమలు చేయడం చాలా అవసరం. ముఖ్యంగా సినీ నటులు నిర్వహించే సభలకు ఇంకా అవసరం. మొత్తం మీద కరూర్ ఉదంతం విజయ్ పార్టీ భవిష్యత్తు పైనేగాక ఇతర పార్టీలపై కూడా ఎంతో ప్రభావం చూపుతుందనే అనిపిస్తుంది. విజయ్ తన సభలను కొంత కాలం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇది ఒక 'ఇంటర్వెల్' అనుకోవాలా! తరువాత? ●

# ప్రధానిగా 'ఐరన్‌లేడీ తకైచి'

జపాన్

జపాన్ పాలక పార్టీ కొత్త నాయకురాలిగా సనే తకైచిని ఎన్నుకుంది, షింజో అబే, షిగేరు ఇషిబా కేబినెట్లలో పనిచేసిన తకైచిని ఐరన్‌లేడీగా పిలుచుకుంటారు. ఆమె అమెరికా మిత్రదేశానికి తొలి మహిళా ప్రధానమంత్రి అయ్యారు. రెండవరౌండ్ రన్‌ఆఫ్ ఓట్లలో తకైచి షింజిరో కోయిజుమిని 185 నుండి 156 తేడాతో ఓడించి, రెండవ ప్రపంచ యుద్ధం ముగిసినప్పటి నుండి జపాన్ను దాదాపు నిరంతరాయంగా పరిపాలిస్తున్న కన్జర్వేటివ్ లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్డీపీ) నాయకురాలిగా అవతరించారు. గత నెలలో ప్రధానమంత్రి షిగేరు ఇషిబా ఒక సంవత్సరం పదవి తర్వాత తాను రాజీనామా చేస్తానని చెప్పడంతో నాయకత్వ పోటీ ప్రారంభమైంది. ఈనెల చివర్లో పార్లమెంటులో ఎన్నికలు జరిగినప్పుడు ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జపానుకు తకైచి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నప్పటికీ, గత ఏడాది ఉభయ సభలలో ఎల్‌డిపి నేతృత్వంలోని సంకీర్ణం మెజారిటీని కోల్పోయినందున వీలుకాలేదు. మాజీ బ్రిటిష్ నాయకురాలు మార్గరెట్ థాచర్ తన హీరో అని చెప్పుకునే 64 ఏళ్ల కరడుగట్టిన సంప్రదాయవాది, జపాన్లో ఎక్కువకాలం పనిచేసిన నాయకురాలు హత్యకు గురైన మాజీ ప్రధాన మంత్రి షింజో అబే అడుగుజాడల్లో నడిచిన వ్యక్తి. అబే రోజులకు తిరిగి వచ్చే అవకాశంగా తకైచి అధిరోహణను చాలా మంది పార్టీ సభ్యులు స్వాగతించినప్పటికీ, ఆమె జాతీయవాద చారిత్రక దృక్పథాలు తూర్పు ఆసియా పొరుగు దేశాలైన చైనా, దక్షిణ కొరియాతో ఘర్షణకు కారణమవుతాయనే ఆందోళనలు ఉన్నాయి.తకైచి 183ఓట్లను,కొయిజుమి 164ఓట్లకు గెలుచుకుంది. ప్రస్తుత జపాన్ ప్రభుత్వానికి అగ్రప్రతినిధి అయిన64ఏళ్ల యోషి మాసా హయాషి ఇటీవలి పోలింగ్ ఓట్ల పెరుగుదల తర్వాత 134 ఓట్లతో పాటు,10లక్షల సాధారణ పార్టీ సభ్యుల ఓట్లను సమానంగా విభజించి లెక్కించారు. చట్టసభ సభ్యులు కొంతమంది మితవాద కోయిజుమికి అనుకూలంగా ఉన్నప్పటికీ అధికశాతం ఎల్డీపీ సభ్యులు ఉద్వేగ భరితమైన ధోరణులు ఉన్న తకైచికే ప్రాధాన్యత ఇచ్చారు. రెండవ రౌండ్లో శాసనసభ్యులు తకైచికి అనుకూలంగా 145

గన్ని మోహన్

ఓట్లు వేశారు, పార్టీ సభ్యులు కోయిజుమికి 11 ఓట్లు పోలైతే ఆమెకు 36ఓట్లు ఇచ్చారు.ప్రస్తుత వ్యవసాయ మంత్రి మరియు మాజీ ప్రధాన మంత్రి జునిచిరో కోయి జుమి కుమారుడు 44 ఏళ్ల కోయిజుమి, 1885లో దేశ మొదటి ప్రధాన మంత్రి అయినప్పుడు కోయిజుమి కంటే కొన్ని నెలలు చిన్నవాడు అయి నహిరోబుమి ఇటో తర్వాత జపానుకు అతిపిన్న వయస్కుడైన నాయకుడిగా ఉండేవాడు. ఇక అవినీతి కుంభకోణాలతో కళంకం చెందిన ఎల్‌డిపిని మరింత ఉత్తేజభరితమైన, శక్తివంతమైన పార్టీగా, ప్రజల ఆందోళనలను ఆశగామార్చే పార్టీగా మార్చడం చాలా ముఖ్యమని చెపుతున్న ఆమె పాలన తీరుపై ఇప్పటికీ జపాన్‌పాలకవర్గంలో కొందరికి సందేహాలున్నాయి. జపాన్ అధికార పార్టీ ఎల్డీపీపై అవినీతి మరకలు ఎక్కువగానే ఉన్నాయి. అనేకఅ వినీతి కుంభకోణాల్లో ప్రస్తుత పాలకవర్గనేతలు కూరుకుని ఉండటం వల్లనే గత ఏడాది ప్రధాని షిగేరు ఇషిబాకొత్త నేతను ఎన్నుకోవాలని పాలకపార్టీకి సూచించారు. జపాన్ తదుపరి ప్రధానమంత్రికి అత్యంత ప్రాధాన్యతలలో ఒకటి జూలైలో ట్రంప్ పరిపాలనతో కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని అమలు చేయడం.అందుకు కీలకమైన ఆటోఎగుమతులు సహా జపాన్ వస్తువులపై 15 శాతం సుంకం విధించే ఒప్పందం ఇంకా లిఖితపూర్వకంగా జరగలేదు. ఈ ఒప్పందంపై చర్చలను తిరిగిప్రారం భించేఅవకాశాన్ని తకైచి సంకేతాలిచ్చారు, ఇందు లో అమెరికాలో 550 బిలియన్ల పెట్టుబడి పెట్టడానికి జపాన్ చేసిన ప్రతిజ్ఞ కూడా ఉంది. ప్రపంచంలో ఉన్న నాలుగోస్థానంలో ఉన్న జపాన్ ఆర్థికవ్యవస్థ ఇపుడు పతనం అయి ఐదో స్థానానికి దిగజారింది. 64 ఏళ్ల తకైచికున్న ప్రాధాన్యాల్లో ముందు జాతీయ భద్రత, రక్షణ, ఆర్థిక భద్రత అని చెప్పకతప్పదు.ఆమెకు పోటీగా కూడా పూర్వతరం నాయకుల వారసులే వచ్చారు.మాజీ ప్రధాని కోయిజుమి కుమారుడు షింజిరో కోయిజుమికూడా గట్టిపోటీ ఇచ్చారు. ప్రధానపోటీ యోషిమాసా హయాషినుంచే ఆమెకు ఎదురైంది. పార్లమెంటు ఆమోదించిన తర్వాతనుంచే ఆమె పదవీకాలం అమలుకు వస్తుంది. అదే జరిగితే తకైచి జపాన్ మొట్టమొదటి మహిళా ప్రధాన మంత్రిగా ఘనత సాధించినవారవుతారు. జపాన్‌లో మురుగునీటిపారుదల వ్యవస్థ కుంభకోణంతో ఓటర్లు ఎల్డీపీ పట్ల విముఖంగా ఉన్నారు. అదే సమయంలోవలసల వ్యతిరేకపార్టీగా ఉన్న సెన్సెయిటో పార్టీ పట్టు పెంచుకుంటోంది. వారిని తిరిగి తమపట్టులోకి తెచ్చుకోవాల్సిన రాజకీయ వ్యూహం కూడా ప్రస్తుత తకైచి అనుసరించాల్సి ఉంది. ఆర్థికభద్రత, రక్షణ మంత్రి కూడా అయిన తకైచి గతంలోచైనా, ఆసియాపసిఫిక్‌లో సైనిక నిర్మాణంపై తీవ్ర విమర్శలు చేసారు. విద్యార్థి జీవితంలో కళాశాలలో హెవి మెటల్‌బ్యాండ్ డ్రమ్మర్‌గా ఉన్న తకైచి అంచలంచెలుగా రాజకీయంగా ఎదుగుతూ వచ్చింది. ఎల్డీపీ సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగంలో లింగసమానత్వ సూచీలో జపాన్ నునార్డిక్ కూటమి స్థాయికి చేరుస్తానని ప్రతిజ్ఞ చేయడం అందరినీ ఆకర్షించింది. లింగసమానత్వ సూచీలో జపాన్ ప్రపంచంలోని 148 స్థానాల్లో 118వ స్థానంలోఉంది.తన రాజకీయగురువు అయిన షింజో అబే కాలంలో ప్రముఖంగా వాడుకలోకి వచ్చిన 'అబేనోమిక్స్'కు తకైచి పెద్దపీటవేస్తారన్న భావన కూడా ఉంది. అలాగే అమెరికాతో జరిగే వాణిజ్య ఒప్పందం జపాన్‌కు హానికరం అనిభావిస్తే పునఃసమీక్షకు కూడా వెనుకాడబోనని ఆమె స్పష్టంచేయడంతో ఎల్డీపీ మొత్తం ఆమె నాయకత్వానికే మొగ్గుచూపించింది. జపాన్‌కు ఎదురయ్యే భవిష్యత్ సవాళ్లకు ఈ ఐరన్‌లేడీ వ్యూహాలు ఎంతమేర సత్ఫలితాలిస్తాయన్నది వేచిచూడాల్సిందే. ●




సనై తకైచి

# ఎన్నికలలో ఫిరాయింపులకు తెరదీస్తున్న రాజకీయ పార్టీలు!

తెలంగాణ రాష్ట్రంలో 2024లోనే జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు నేటికీ జరగలేదు. ఫలితంగా రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి అవసరమైన పదిహేనవ ఫైనాన్స్ కమిషన్ నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికుంటుపడింది. స్థానిక సంస్థల ఎన్నికలను తక్షణమే నిర్వహించాల్సిందేననే ఫిర్యాదును విచారించిన హైకోర్టు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను మేము నిర్ణయించిన గడువులోపే నిర్వహించాల్సిందేననే ఉత్తర్వులను జారీచేసింది. సదరు ఉత్తర్వుల కత్తి మెడమీద వేలాడుతోన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనివార్యంగా ఎన్నికల నిర్వహణకు తగు చర్యలను తీసుకోకతప్పడం లేదు. ఐతే బి.సి. సామాజిక వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానికసంస్థల ఎన్నికలకు వెళ్తామని అధికార పార్టీ పట్టుదలగా వుంది. ఆ లక్ష్యాన్ని సుగమం చేసుకునే క్రమంలో డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం జీ.ఓ నెంబర్ 9ని జారీచేసింది. ఐతే న్యాయ స్థానాలలో ఈ జీ.వో చెల్లు బాటుపై న్యాయ నిపుణుల్లో, రాజకీయ పార్టీలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమౌతుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అంతటితో ఆగకుండా రాష్ట్రమంత్రి ఒకరు మరో అడుగు ముందుకేసి జీ.ఓ.పై ఎవ్వరూ కోర్టుకెళ్ళొద్దని చేసిన విజ్ఞప్తి ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో వేచిచూడాల్సిందే. విపక్ష పార్టీలు సైతం నిన్నటికి నిన్న రాష్ట్ర అసెంబ్లీలో సంబంధిత చట్టాన్ని బలపరుస్తూనే, మరోవైపు బి.సి.ల రిజర్వేషన్ల పట్ల అధికార పార్టీకి చిత్తశుద్ధి లేనేలేదు. ఎందుకంటే రిజర్వేషన్లు ఏభైశాతాన్ని అధిగమించాలంటే వాటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చితే తప్ప బి.సిలకు 42శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదని రాజ్యాంగ నిపుణులంటున్నారు. దానికి పార్లమెంట్ ఆమోదం అనివార్యం. యన్.డి.ఏ ప్రభుత్వం దీనికి సహకరిస్తుందో లేదోననేది మిలియన్ డాలర్ల ప్రశ్నగానే కనపడుతోంది. ఎందుకంటే బి.సి రిజర్వేషన్ల బిల్లు ఇటు గవర్నర్ దగ్గర అటు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో వుండడమే దీని కారణంగా భావించక తప్పదు. ఓ వైపు బి.సి.లకు స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ల బిల్లును శాసనసభలో సమర్థించిన బి.జె.పి రాజ్యాంగ విరుద్ధమైన ఈ ప్రతిపాదిత చట్టం న్యాయ స్థానంలో చెల్లదు కాబట్టి ప్రభుత్వానివి ఉత్తరకుమార ప్రగల్భాలేనంటూ ప్రజల ముందుకెల్తోంది. అధికార విపక్షాలతో సంబంధం లేకుండా హైకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ తన రాజ్యాంగ బద్ధమైన బాధ్యతలో భాగంగా ఎన్నికల నిర్వహణకవసరమైన ఓటర్ల తుది జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకాలు, వారికి అవసరమైన శిక్షణను పూర్తిచేసి స్థానిక సంస్థల ఎన్నికల కోసం తాము సిద్ధమేనని ప్రభుత్వానికి తెలియజేసింది. రిజర్వేషన్ల ఎంపిక ఏ ప్రాతిపదికన చేసినారోగాని యస్.సి ఓటర్లే లేని చోట యస్.సి రిజర్వేషన్,యస్.టి.లు లేని చోట యస్.టి రిజర్వేషన్, గిరిజన తాండాల్లో బి.సి రిజర్వేషన్ల ఎంపిక నేపథ్యంలో ఆయా స్థానాలలో ఎన్నికలు జరగవని చెప్పక తప్పదు. అలాంటప్పుడు ఆయా ప్రాంతాల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందని చెప్పక తప్పదు. రాష్ట్రంలో రాజ్యాంగ బద్ధంగా యస్.సి,యస్.టిల కోసం స్థానిక సంస్థలల్లో రిజర్వేషన్ల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి వాటి వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందజేసింది.అదేవిధంగా డెడికేటెడ్ కమీషన్ సిఫార్సుల మేరకు బి.సి.ల జనాభా ప్రాతిపదికన బి.సిలకు 42శాతం రిజర్వేషన్లను సైతం నిర్ణయించి ఎన్నికల రాష్ట్రమంత్రి విజ్ఞప్తిని తోసిరాజంటూ బి.సి రిజర్వేషన్ల మూలాన రిజర్వేషన్ల శాతం 50శాతానికి మించుతున్నాయని, ఇది రాజ్యాగ విరుద్ధమైన చర్య కావున ,ఈ విధానం

డాక్టర్ నీలం సంపత్

పై స్టే ఇవ్వాల్సిందిగా కొంత మంది వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించడం గమనార్హం. దీనిపై స్పందించిన న్యాయ స్థానం బి.సి రిజర్వేషన్ల అంశం ప్రభుత్వ గెజిట్‌లోకి రాక ముందే తొందరెందుకని ప్రశ్నిస్తూనే బి.సి రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ దగ్గర పెండింగ్‌లో వున్నప్పుడు జి.వోను ఎలాజారీ చేస్తారు? అంటూ ప్రభుత్వాన్ని సైతం ప్రశ్నించింది. స్టే



ఇవ్వడానికి నిరాకరిస్తూ, ఒకవేళ మీరు ఎన్నికలకు పోయినా బి.సి రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగ నిబంధనలే శిరోధార్యంగా ముందుకు వెళ్ళాల్సి వుంటుందని విస్పష్టంగా తెలియపరుస్తూ తదుపరి విచారణను అక్టోబర్ 8వ తేదీకి వాయిదా వేయడం గమనార్హం. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కోర్టు వ్యవహారాన్ని పట్టించుకోనట్లుగా ముందు జడ్.పి.టి.సి, యం.పి.టి.సి తర్వాత గ్రామ పంచాయతీల ఎన్నికలను ఐదంచెలలో పూర్తి చేస్తామని ప్రభుత్వానికి తెలియపరుస్తూ 9వ తేదీనుండి ప్రారంభమయ్యే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసింది. ఒకవేళ ఎనిమిదవ తేదీ విచారణలో బి.సి రిజర్వేషన్లపై హైకోర్టు వ్యతిరేక ఉత్తర్వులిస్తే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఎలా ముందుకు వెళ్తోందోననే సందిగ్ధత రాజకీయ పార్టీల్లో గందర గోళాన్ని సృష్టిస్తోంది. మరో మూడు సంవత్సరాల తర్వాత రాబోయే శాసనసభ ఎన్నికలకు,పార్లమెంట్ఎన్నికలకు పునాదిగా భావించే స్థానిక సంస్థల ఎన్నికలలో తమ తమపార్టీల అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడం ద్వారా తమ రాజకీయ పునాదులను సుస్థిరం చేసుకోవాలనే లక్ష్యంతో అధికార, విపక్షమనే తేడా లేకుండా అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. బడా లీడర్లు చిన్నాచితక నాయకులు, కులసంఘాల పెద్దల ఇండ్ల చుట్టూ చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది. శాసనసభ,పార్లమెంట్ ఎన్నికలలో గతంలో ఓడిన వారిని సైతం భారీ ప్రలోభాలతో తమ పార్టీలలోనికి ఆహ్వానించడానికి ప్రయత్నాలు కొనసాగిస్తుండడం గమనార్హం. గతంలో ఓ రాజకీయ పార్టీ తమకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని ఆ పార్టీపై అలిగి మరో పార్టీలో చేరిన వారిని తిరిగి పార్టీలో చేరమనిఅడుగుతున్నారు.వారు సైతం ఎలాంటి బేషజాలు లేకుండా తక్షణ ప్రయోజనాలు, భవిష్యత్ ప్రయోజనాల హామీ లాంటి కొత్త షరతులతో మాతృసంస్థలలోకి మళ్ళీ తిరిగి ప్రవేశిస్తున్నారు. ఈ క్రమంలో ఒకటికి రెండుసార్లు పార్టీలు మారిన నేతలు సైతం మేమేం చేసినా ప్రజల కోసమేననే నినాదంతో ఫిరాయింపులకు తెరదీస్తున్నారు.ఈ వరసలో మాజీ శాసన సభ్యులూ, జిల్లా పరిషత్ ఛైర్మన్లూ,మండల పరిషత్ అధ్యక్షులూ, జడ్.పి.టి.సి లూ, యం.పి.టి.సి లతో పాటు,మాజీ సర్పంచులనూ, వార్డు మెంబర్లనూ ప్రత్యేక ప్యాకేజీలతో ఫిరాయింపులకై ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ఆశ్చర్యకరమైన అంశమేమిటంటే ఒక్కో నాయకుడు ప్రజల అభ్యున్నతి కోసం నాలుగేసి పార్టీలు మారినా ఆయా ప్రాంతాల ప్రజల జీవన స్థితిగతులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కొనసాగుతున్న వైనంసదరు రాజకీయ నేతల చిత్తశుద్ధిని ప్రశ్నార్థకంగా మారుస్తోందని బుద్ధి జీవులతో పాటు పాలనా నిపుణుల నిశ్చితాభిప్రాయం. ఇక గ్రామ పంచాయతీల ఎన్నికలు రాజకీయపార్టీల ఎన్నికల చిహ్నాలకతీతంగా జరిగే ఎన్నికలుగా ఎన్నికల కమిషన్ గుర్తించినా అక్కడకూడా పరోక్షంగా వివిధ రాజకీయ పార్టీల మధ్య అధికార ఆధిపత్యం కోసం రాజకీయ పోరాటమే కొనసాగుతున్న వైనాన్ని జీర్ణించుకోకతప్పదు. మరో ముఖ్యమైన అంశమేమిటంటే గ్రామ పంచాయతీల, మండల ప్రాదేశిక నియోజకవర్గాల పరిధి పరిమితంగా వుండడం, ఆ ప్రాంతానికి చెందిన ఓటర్లు మాత్రమే ఎన్నికలలో పోటీ చేసే అర్హతను కలిగివుండే నేపథ్యంలో సదరు గ్రామాలలో, ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదైన అభ్యర్థుల కోసం రిజర్వుడు స్థానాలలో ధీటైన రిజర్వుడు అభ్యర్థుల కోసంఅన్ని రాజకీయ పార్టీలు తమ వేటను కొనసాగిస్తున్నాయి. ఒకవేళ గెలవగల అభ్యర్థులు తమ పార్టీలో లేకపోతే ఏదోఒక ప్రలోభాన్ని ఎరగా వేసి,ఎంత ఖర్చైనా వెచ్చించి ఎదుటి పార్టీ వారిని తమ పార్టీలోకి చేర్చుకోవడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నారు. వాటి ఫలితంగా విచ్చల విడిగా కొనసాగుతున్న కండువాలు, జెండాల మార్పిడి పర్వంతో గ్రామాలలో రాజకీయ పార్టీల పరిస్థితి కప్పల తక్కెడగా మారుతోంది.ఎవరు ప్రస్తుతం ఏ పార్టీలో కొనసాగుతున్నారో తెలియక ప్రజలు గందరగోళానికి గురౌతున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఫిరాయింపుల పట్ల తమ నిజాయితీని నిరూపించుకోవాలంటే ఫిరాయించిన మరుక్షణమే ఎన్నిక రద్దయి మళ్ళీ ఓ ఐదేళ్ల వరకు వారిని ఎన్నికల లో పోటీ చేయడానికి అనర్హులు గా ప్రకటించేలా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరించాలని ప్రజలు కోరుతున్నారు. ●

# బీహార్‌లో జన్‌సురాజ్ కొత్త వ్యూహం!

## ముస్లిం ఓట్లు అవసరంలేదంటున్న ప్రశాంత్ కిశోర్



**పాట్నా, అక్టోబరు 4:** బీహార్ రాజకీయాలు ఎల్లప్పుడూ కుల, మత సమీకరణాలపై ఆధారపడి ఉంటాయి. కొన్నిసార్లు ముస్లిం, యాదవ్ (ఎంవై) సమీకరణం ఆర్జేడీని అధికారంలో తెచ్చింది. కొన్నిసార్లు ఈబీసీలు, మహిళా ఓటు బ్యాంకు నితీశ్‌ను సీఎం పీఠంపై కూర్చోబెట్టింది. ఇప్పుడు కుల, మత సమీకరణాల మధ్య జన్ సురాజ్ పార్టీ కన్వీనర్ ప్రశాంత్ కిశోర్ కొత్త ఓటు బ్యాంకు కార్డును ప్లే చేశారు. 60శ40 ఫార్ములా కింద ఒక వ్యూహాన్ని రచించారు. తనకు ముస్లిం ఓట్లు అవసరం లేదని, వారి మద్దతు అవసరమని ప్రశాంత్ కిశోర్ ఇటీవలే ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు. 40శాతం హిందువులు, 20శాతం ముస్లింలు లేదా మొత్తం జనాభాలో 60శాతం మంది తన వెంట నిలిస్తే జన్‌సురాజ్ పార్టీ విజయం ఖాయమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రీయ జనతాదళ్ ముస్లిం అభ్యర్థిని ఎక్కడ నిలబెట్టిన చోట, తమ పార్టీ అక్కడ ముస్లిం అభ్యర్థిని నిలబెట్టదని ఆర్జేడీకి ఆఫర్ ఇచ్చారు. అయితే, అందుకు ఒక షరతు పెట్టారు. జన్‌సురాజ్ ముస్లిం అభ్యర్థిని నిలబెట్టే చోట, ఆర్జేడీ కూడా ఆ వర్గానికి చెందిన వ్యక్తిని బరిలో నిలపకూడదన్నారు. ప్రశాంత్ కిశోర్ కొత్త రాజకీయ సమీకరణానికి తెరలేపాడని వాదనలు వినిపిస్తున్నాయి. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ 1990లలో ముస్లింలు, యాదవులను ఏకం చేయడం ద్వారా బీహార్‌లో అధికారంలోకి వచ్చారు. 1990లో ప్రారంభమైన ఈ ఫార్ములా నేటికీ ఆర్జేడీతో బలంగా ముడిపడి ఉంది. ఇప్పటికీ ముస్లింలు, యాదవులు ఆర్జేడీకి ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్నారు.

ప్రశాంత్ కిశోర్ చేసిన ఆఫర్‌పై ఆర్జేడీ స్పందించింది. ప్రశాంత్ కిశోర్‌ను బీజేపీకి బీ టీంగా అభివర్ణించింది. ఈ వాస్తవాన్ని బిహార్ బీజేపీ చీఫ్ దిలీప్ జైస్వాల్ స్వయంగా అంగీకరించారని పేర్కొంది. ప్రశాంత్ కిశోర్ కొత్త అలజడిని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని, కానీ బీహార్ ముస్లింలకు అతని నిజ స్వరూపం ఏంటో తెలుసని వెల్లడించింది. ఈ మేరకు ఆర్జేడీ అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ వ్యాఖ్యానించారు. బీహార్‌ను మళ్లీ జంగిల్ రాజ్‌కు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీహార్‌లో లాలూ ప్రసాద్ కుటుంబం జంగిల్ రాజ్‌ను తిరిగి స్థాపించడమే పీకే కొత్త రాజకీయ ప్రాజెక్ట్. ప్రశాంత్ కిశోర్‌కు నిధులు ఎక్కడి నుంచి వస్తాయని అడిగినప్పుడు ఆయన మౌనంగా ఉన్నారు.

ఇప్పుడు, పీకే చేసిన ఈ ప్రకటన తర్వాత బీహార్‌ను రాజకీయంగా అస్థిరపరచాలనుకునే వారు పీకేకు నిధులు అందిస్తున్నారని స్పష్టమవుతోంది. దీంతో పీకే రాజకీయ ఉద్దేశం ఏంటో తెలిసిపోతోందని కుంతల్ కృష్ణ పేర్కొన్నారు. బీహార్ ప్రజలు నితీశ్‌ను విశ్వసిస్తున్నారని ముస్లింల గురించి జన్ సురాజ్ కన్వీనర్ ప్రశాంత్ కిశోర్ చేసిన ప్రకటన ఆయన ఉద్దేశాలను స్పష్టంగా వెల్లడిస్తుందని జేడియూ అధికార ప్రతినిధి అంజుమ్ అరా అన్నారు. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ అధికారం లోకి వచ్చిన తర్వాతే ముస్లిం సమాజం సర్వతో ముఖాభివృద్ధిని చూసిందని ఆమె పేర్కొన్నారు. అందుకే బీహార్ మైనారిటీ సమాజం ఇప్పుడు ఎన్‌డీఏ, నీతీశ్ కుమార్‌కు అండగా ఉందని వెల్లడించారు. మైనారిటీలు పీకేకి మద్దతు ఇవ్వరని బీహార్ లోని మైనారిటీ వర్గం ప్రశాంత్ కిశోర్‌కు ఎప్పటికీ మద్దతు ఇవ్వదని ఎందుకంటే బీహార్‌లోని మైనారిటీ వర్గం అవగాహన పెంచుకుంది. నీతీశ్ కుమార్ కన్నా ముందు, అన్ని రాజకీయ పార్టీలు ముస్లింలను సంతృప్తి పరచడంలో మాత్రమే నిమగ్నమై ఉన్నాయి. వారు ఓట్లు పొందడానికి బెదిరింపులకు పాల్పడ్డాయి. కానీ నేడు మైనారిటీల కోసం జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా వారు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌తో ఉన్నారని జెడియు ప్రతినిధి అంజుమ్ ఆరా అన్నారు.

# ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాపులు ఐటిఐలే..

## కౌశల్ దీక్షాంత్ సమారోహ్‌లో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు (ఐటీఐ) ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రశంసించారు. ఐటీఐ శ్రామిక విద్యా సంస్థలు మాత్రమే కాదు ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాప్‌లని చెప్పారు. ఈ సందర్భంగా రూ.62,000 కోట్లకు పైగా విలువైన యువత కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధాని శనివారం ఢిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మోడీ మాట్లాడారు. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధాన మంత్రి సేతు పథకాన్ని రూ.60,000 కోట్లతో ప్రవేశపెట్టారు. దేశంలో 2014 వరకు 10,000 ఐటీఐలు ఉండగా, గత దశాబ్దంలో 5,000 కొత్తగా ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేశారని, ఈ 11 సంవత్సరాల్లో 1.5 కోట్ల మంది యువకులకు స్థానిక భాషల్లో స్కిల్స్ శిక్షణ ఇచ్చారని మోదీ తెలిపారు. యువత సాధికారతకు మెగా ప్రోగ్రామ్‌గా ఈ ఈవెంట్‌ను ప్రధాని వర్ణించారు. శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే అని ఉటంకిస్తూ, స్కిల్డ్ వ్యక్తులను గౌరవించాలని ప్రధాని సూచించారు. అటు, బీహార్‌లోనూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ యువత సాధికారతను ప్రతిష్ఠాత్మకంగా నిర్వర్తిస్తున్నారు. నిశ్చయ్ స్వయం సహాయతా భత్తా యోజనాను ఆధునీకరించి, ప్రతి ఏటా 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు రూ.1,000 నెలవారీ స్కాలర్‌షిప్, రెండు సంవత్సరాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో యువతకు ఫ్రీ స్కిల్ ట్రైనింగ్ అందిస్తున్నారు. అంతేకాదు, బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్‌ను రీడిజైన్ చేసి, యువతకు రూ.4 లక్షల వరకు ఇంటరెస్ట్ ఫ్రీ లోన్లు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా 3.92 లక్షల మంది విద్యార్థులు రూ. 7,880 కోట్ల రుణాలుపొందారని మోడీ తెలిపారు.



## లాంగ్‌కొవిడ్ బాధితుల్లో గుండె జబ్బులే ఎక్కువ..

**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** లాంగ్ కోవిడ్‌తో బాధ పడుతున్న వారిలో, ముఖ్యంగా మధ్యవయస్కులైన మహిళల్లో అసాధారణ గుండె సంబంధిత రుగ్మతలుఎక్కువగా కనిపిస్తున్నట్లు స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు జరిపిన తాజా అధ్యయనంలో తేలింది. పోస్చురల్ ఆర్థోస్టాటిక్ టాకీకార్డియా సిండ్రోమ్ (పాట్స్) అనే ఈ సమస్య లాంగ్ కోవిడ్ రోగులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్లు వెల్లడైంది. పాట్స్ అనేది పడుకున్న స్థితి నుంచి నిలబడినప్పుడు గుండె వేగం అసాధారణంగా పెరిగే ఒక రకమైన ఆరోగ్య సమస్య. ఈ రుగ్మతతో బాధపడేవారికి నిలబడటం కూడా చాలా కష్టంగా ఉంటుంది. తీవ్రమైన అలసట, ఏకాగ్రత లోపించడం వంటి లక్షణాలు వీరిలో కనిపిస్తాయి. ఇవి లాంగ్ కోవిడ్ లక్షణాలను పోలి ఉండటం గమనార్హం. ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసేందుకు పరిశోధకులు, కోవిడ్ కారణంగా ఆసుపత్రిలో చేరని 467 మంది లాంగ్ కోవిడ్ బాధితులపై పరిశోధనలు చేశారు. వీరిలో 91 శాతం మంది గతంలో ఆరోగ్యంగా, చురుగ్గా ఉన్న మధ్యవయస్కులైన మహిళలే. అధ్యయనం ముగిసేసరికి, వీరిలో దాదాపు 31 శాతం మందికి పాట్స్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. మరో 27 శాతం మందిలో ఈ వ్యాధి లక్షణాలు కనిపించినా, పూర్తిస్థాయిలో నిర్ధారణ కాలేదు. ఈ పరిశోధన ఫలితాలపై కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మికాయిల్ బ్యోర్న్‌సన్ మాట్లాడుతూ, "లాంగ్ కోవిడ్ రోగులలో ఖిపాట్స్‌ఖి అనేది చాలా సాధారణ సమస్య అని మేం ఇప్పుడు కచ్చితంగా చెప్పగలం. ఈ సమాచారం వైద్యులకు, రోగులకు ఎంతో విలువైనది" అని తెలిపారు. అదే సంస్థకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ జూడిత్ బ్రుచ్‌ఫెల్డ్ మాట్లాడుతూ, "పాట్స్‌ను తక్కువ ఖర్చుతో కూడిన సులభమైన పరీక్షల ద్వారా అన్ని స్థాయిల ఆరోగ్య కేంద్రాల్లో గుర్తించవచ్చు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి, లక్షణాలను తగ్గించి జీవనప్రమాణాలను మెరుగుపరిచేందుకు చికిత్సలు కూడా అందుబాటులో ఉన్నాయి అని వివరించారు. లాంగ్ కోవిడ్ బారిన పడి, నిలబడినప్పుడు గుండె వేగం పెరగడం, తలతిరగడం, తీవ్రమైన అలసట వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే పాట్స్ పరీక్ష చేయించుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# అసోం గాయకుడు జుబీన్‌గార్గ్ మృతిపై అనుమానాలు..

## విషమిచ్చినట్లు ఆరోపణలు!



**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో ప్రమాదవశాత్తూ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతోన్న వేళ ఈ కేసు కీలక మలుపు తిరిగింది. జుబీన్‌కు విషమిచ్చి ఉంటారని ఆయన బ్యాండ్‌మేట్ శేఖర్ జ్యోతి గోస్వామి సంచలన ఆరోపణలు చేశారు. గాయకుడి మేనేజర్, ఫెస్టివల్ ఆర్గనైజేషన్ ఈ కుట్రకు పాల్పడి ఉంటారని ఆరోపించారు. జుబీన్ మృతిపై అస్సాం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో పలువురు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. జుబీన్ బ్యాండ్‌మేట్ గోస్వామి కూడా విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగానే సంచలన ఆరోపణలు చేశారు. సింగపూర్‌లో జుబీన్‌తో కలిసి ఆయన మేనేజర్ సిద్ధార్థ్ శర్మ ఒకే హోటల్‌లో ఉన్నారు. యాట్ ట్రిప్‌లో గాయకుడికి ప్రమాదం జరిగిన తర్వాత శర్మ తీరు అనుమానాస్పదంగా కనిపించింది. సముద్రం మధ్యలో ఆ విహార నౌకను మేనేజర్ బలవంతంగా తన నియంత్రణలోకి తీసుకున్నారు. అంతకుముందు మా అందిరికీ డ్రింక్స్ తీసుకురావొద్దని అస్సాం అసోసియేషన్ సభ్యుడు, ఎన్ఆర్ఐ తన్మోయ్‌కు చెప్పారు. సిద్ధార్థ్ శర్మనే స్వయంగా డ్రింక్స్ తీసుకొచ్చారు అని గోస్వామి తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఇక, జుబీన్ గార్గ్ మునిగిపోతున్న సమయంలోనూ శర్మ అతన్ని వెళ్లనివ్వండి అంటూ అరవడం తనకు వినిపించిందని గోస్వామి వెల్లడించారు. గార్గ్ శిక్షణ పొందిన స్విమ్మర్ అని, తనతో పాటు ఎంతో మందికి స్విమ్మింగ్‌లో కోచింగ్ ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన ఈత కొడుతూ నీట మునిగి చనిపోయే ఆస్కారమే లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. మేనేజర్ శర్మతో కలిసి ఈవెంట్ ఆర్గనైజర్‌శ్యామ్‌కాను మహంత ఈ కుట్రకు పాల్పడి ఉంటారని గోస్వామి ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే వారు జుబీన్‌కు విషమిచ్చి ఉంటారని అన్నారు. ఆ తర్వాత దాన్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారని ఆరోపించారు. జుబీన్ నోరు, ముక్కు నుంచి నురగ వస్తున్నప్పుడు కూడా మేనేజర్ ఏ మాత్రం కంగారు పడలేదని అన్నారు. వెంటనే చికిత్స అందించకుండా ఆలస్యం చేశారని పేర్కొన్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే జుబీన్ మృతి కేసులో మేనేజర్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఆయనపై నాన్‌బెయిలబుల్ అభియోగాలు నమోదు చేశారు. ఇక, ఈవెంట్ ఆర్గనైజర్ మహంత ఆర్థిక వ్యవహారాల పైనా ఆరా తీస్తున్నారు. గతంలో మహంతా ఆర్థిక అవతవకలకు పాల్పడినట్లు అస్సాం సిఐడి పోలీసులు గుర్తించారు. సెప్టెంబర్ 19న సింగపూర్‌లో జుబీన్ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన స్కూబా డైవింగ్ చేస్తూ ప్రాణాలు కోల్పోయినట్లు తొలుత వార్తలు వచ్చాయి. అయితే ఆ తర్వాత విహార నౌకలో ప్రమాదానికి గురైన జుబీన్‌ను సింగపూర్ ఆసుపత్రికి తరలించారని, అక్కడే మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై దర్యాప్తుకొనసాగుతోంది.

## ఆవు పన్నుపేరుతో రాజస్థాన్‌లో వ్యాట్‌సెస్!

**జైపూర్,అక్టోబరు 4:** ఒక బారులో బీర్లు కొన్న వ్యక్తి బిల్ చూసి షాక్ అయ్యాడు. అందులో 'ఆవు పన్ను' పేరుతో 20 శాతం మేర విలువ ఆధారిత పన్ను (వ్యాట్)లో అదనంగా వసూలు చేశారు. ఈ బిల్లు ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన వ్యక్తి తన ఫ్రెండ్స్‌తో కలిసి సెప్టెంబర్ 30న పార్క్ ప్లాజాలోని జియోగ్రఫీ బార్‌కు వెళ్లాడు. ఆరు బీర్లు, మొక్కజొన్న వడలు ఆర్డర్ చేశాడు. కాగా, ఆ ఆర్డర్ మొత్తం రూ. 2,650. అయితే జీఎస్టీ, వ్యాట్‌తోపాటు 20 శాతం 'ఆవు పన్ను'తో కలిపి మొత్తం రూ. 3,262కు బిల్లు జారీ చేశారు. మద్యంపై ఆవు పన్ను విధించడం చూసి ఆ కస్టమర్ షాక్ అయ్యాడు. ఈ బిల్లు ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు ఆ బార్ యాజమాన్యం దీనిపై వివరణ ఇచ్చింది. గోవుల రక్షణ, సంరక్షణ కోసం 2018లో ఆవు పన్నును రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు తెలిపింది. అప్పటి నుంచి మద్యం అమ్మకాలపై ఆ పన్ను వసూలు చేస్తున్నట్లు చెప్పింది. అయితే చాలా బార్ అండ్ రెస్టారెంట్లు దీనిని సర్‌ఛార్జ్‌గా పేర్కొంటాయని, కానీ తాము వ్యాట్‌లో అదనంగా కౌ సెస్సుగా ప్రస్తావిస్తామని ఆ బార్ యాజమాన్యం వివరించింది. ఆ పన్ను డబ్బును గో సంరక్షణ, ప్రచార సెస్సుగా ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తామని వెల్లడించింది. కాగా, మద్యం అమ్మకాలపై వ్యాట్ విధించినప్పుడల్లా ఆవు పన్నును కూడా విధిస్తారని రెవెన్యూ అధికారి కూడా స్పష్టం చేశారు. అయితే చాలా బార్ అండ్ రెస్టారెంట్లు దీనిని సర్జ్‌ఛార్జ్‌గా పేర్కొంటాయని వివరణ ఇచ్చారు.

# ఉక్రెయిన్ రైలుపై రష్యా డ్రోన్ దాడి

## 30 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు

### ఇది క్రూరమైన చర్య : జెలెన్‌స్కీ



**కీవ్, అక్టోబరు 4:** ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భీకర దాడికి పాల్పడింది. ఉక్రెయిన్‌లోని ఉత్తర సుమీ ప్రాంతంలో గల షోస్ట్కాలోని రైల్వేస్టేషన్‌పై డ్రోన్లతో విరుచుకుపడింది. అదే సమయంలో రాజధాని కీవ్ వెళ్తున్న ప్యాసింజర్ రైలును డ్రోను తాకింది. ఈ ఘటనలో కనీసం 30 మంది ప్రాణాలు కోల్పోగా అనేకమందికి గాయాలయ్యాయి. కాగా ప్రయాణికుల రైలుపై ఈ డ్రోన్ దాడి క్రూరమైన చర్య ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. దాడితో అప్రమత్తమైన అత్యవసర సేవల సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ దాడిలో చాలామంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాంతీయ గవర్నర్ ఒలేహ్ హ్రిహోరోవ్ తెలిపారు. అయితే, ఎంతమంది ప్రాణాలు కోల్పోయార్న దానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. అనేకమంది గాయపడినట్లు చెప్పారు. డ్రోన్ దాడిలో రైలు కోచ్ కాలిపోతున్న ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వైద్యులు, సహాయక బృందం ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని రష్యా దాడులు చేస్తోందని, ప్రతిరోజూ రష్యా ఎంతో మంది ప్రాణాలు తీస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్యా ఉన్మాద చర్య పట్ల ప్రపంచం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించరాదని, యుద్ధ పరిష్కారం కోసం ఐరోపా, అమెరికా నుంచి ఎన్నో ప్రకటనలు వింటున్నప్పటికీ మాట సాయం సరిపోదని అన్నారు. బలమైన చర్యలు అవసరమని పేర్కొన్నారు. కాగా, రీజనల్ గవర్నర్ ఒలేహ్ హ్రిహోరోవ్ ప్రయాణికుల రైలుపై రష్యా దాడి ఘటనను ధ్రువీకరించారు.

# బీమా డబ్బు కోసం అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి హత్య

## 24 గంటల్లో నిందితుల అరెస్టు

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** కర్నాటకలో దారుణం చోటుచేసుకుంది. బీమా డబ్బుల కోసం కొందరు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి అనారోగ్యంతో బాధపడుతున్న 34 ఏళ్ల వ్యక్తిని హత్య చేశారు. అనంతరం సదరు వ్యక్తి రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు నమ్మించారు. దీని తరువాత ఈ ముఠాకు చెందిన ఓ మహిళ చనిపోయిన వ్యక్తికి తాను భార్య అని చెబుతూ బీమా డబ్బులను తనకు ఇవ్వాలని బీమా కంపెనీని కోరింది. అయి తే దీనిపై పోలీసులకు అనుమానం వచ్చి రంగంలో దిగి విచారణ చేయగా బండారం రట్టయ్యింది. వివరాలు ఇలావున్నాయి. హోస్పేటకు చెందిన గ ంగాధర్ (34) తన పేరిట ఐదు కోట్ల రూపాయలు బీమా చేయించాడు. అయితే కొంతకాలం క్రితం ఇతను పక్షవాతానికి గురయ్యాడు. అయితే గం గాధర్ బీమా చేయించిన విషయాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు గుర్తించారు. నాలుగు రోజుల క్రితం పొలం పనులకు వెళ్లిన గంగాధర్‌ను ఈ ముఠా చంపేసింది. అనంతరం మృతదేహాన్ని ఓ ద్విచక్ర వాహనంపై వుంచి లారీతో ఢీకొట్టించింది. దీని తరువాత రోడ్డు ప్రమాదంగా చెబుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టి మృతుని భార్య శారదమ్మకు ఫోన్ చేశారు. అయితే తన భర్తకు ప క్షవాతం రావడంతో ఆయన ఎడమ భాగం పనిచేయదని, అలాంటిది ఆయన ద్విచక్ర వాహనం ఎలా నడిపిస్తారని ప్రశ్నించింది. ఇదే సమయంలో తాను గంగాధర్ భార్యగా మరో మహిళ రావడంతో పాటు బీమా డబ్బులు తనకే రావాలని కోరడం కూడా ఆమె దృష్టికి వచ్చింది. దీంతో ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేబట్టిన పోలీసులు గంగాధర్‌ను చంపిన ముఠాను అరెస్టు చేసి జైలుకు పంపారు.

# ఒకే విడతలో బీహార్ ఎన్నికలు నిర్వహించాలి

## రాజకీయ పార్టీలతో సమావేశంలో సిఇసికి జెడియు విజ్ఞప్తి


**పాట్నా, అక్టోబరు 4:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎన్నికల సన్నద్ధతపై రెండ్రోజుల పాటు అధికారులతో సమీక్షించేందుకు ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, ఎస్‌ఎస్ సంధు శనివారం ఉదయం పాట్నా చేరుకున్నారు. తాజ్ హోటల్‌లో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈసీఐ సీనియర్ అధికారులు, బీహార్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వినోద్ గుంజ్యాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలో గుర్తింపుపొందిన 12 రాజకీయల పార్టీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణపై వారి అభిప్రాయలను ఈసీఐ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని తాము కోరినట్టు జేడీ(యూ) ఎంపీ సంజయ్ ఝా తెలిపారు. బీహార్‌లో శాంతిభద్రతల సమస్య కానీ, నక్సల్స్ సమస్య కానీ లేవనీ, మహారాష్ట్రలో ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించిన తరహాలోనేబీహార్‌లోనూ ఎన్నికలు నిర్వహించాలని సమావేశంలో కోరామన్నారు. కాగా, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలని అఖిలపక్ష సమావేశంలో ఎన్నికల కమిషన్ కోరింది. మతసామరస్యం, పరస్పర గౌరవం చాటుకుంటూ ఎన్నికల పండుగలో పాల్గొనాలని, ప్రతి బూత్‌లోనూ పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించింది. ఓటర్ల జాబితా సవరణకు కమిషన్ తీసుకున్న చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు గరిష్ట ఓటర్ల సంఖ్య 1,200గా కమిషన్ నిర్ణయించడాన్ని స్వాగతించారు. ఛత్ పండుగ పూర్తయిన తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, ఇందువల్ల ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని కమిషన్‌కు తెలిపారు. సాధ్యమైనంత తక్కువ విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఈనెల 6 లేదా 7వ తేదీన ఎన్నికల కమిషన్ అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

# పివోకే ఆందోళనలపై భారత్ గుస్సా



**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో నిరసనకారులపై పాకిస్థాన్ దళాలు జరుపుతున్న అణచివేతను భారత్ తీవ్రంగా ఖండించింది. అక్కడి ప్రజలపై పాక్ సైన్యం దారుణాలకు పాల్పడుతోందని, ఈ హింసాత్మక ఘటనల్లో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలకు పాకిస్థాన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. గత కొన్ని రోజులుగా పీఓకేలో తమకు కనీస హక్కులు కల్పించాలని, వ్యవస్థీకృత అణచివేతను ఆపాలని కోరుతూ స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఈ నిరసనలు హింసాత్మకంగా మారడంతో పాక్ దళాలు జరిపిన కాల్పుల్లో ఇప్పటివరకు కనీసం 10 మంది పౌరులు మరణించగా, అనేకమంది గాయపడ్డారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. పీఓకేలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న నిరసనలు, అమాయక పౌరులపై పాకిస్థాన్ దళాల దౌర్జన్యాలపై వస్తున్న నివేదికలను మేము గమనిస్తున్నాం. చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించుకున్న ప్రాంతాల నుంచి వనరులను పాకిస్థాన్ ప్రణాళికాబద్ధంగా దోచుకోవడమే ఈ హింసకు అసలు కారణం" అని జైస్వాల్ విమర్శించారు. జమ్మూ కశ్మీర్, లడఖ్ ఎల్లప్పుడూ భారత్‌లో అంతర్భాగమేనని, భవిష్యత్తులో కూడా అలాగే ఉంటాయని ఆయన పునరుద్ఘాటించారు. పీఓకేలో జరుగుతున్న భయంకరమైన మానవ హక్కుల ఉల్లంఘనలకు పాకిస్థాన్ తప్పకుండా జవాబుదారీగా ఉండాలని భారత్ డిమాండ్ చేసింది. మరోవైపు, పాకిస్థాన్‌కు చెందిన మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సీపీ) కూడా పీఓకేలో హింసపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పౌరులు, భద్రతా సిబ్బంది మరణాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాపాడాలని పేర్కొంది. నిరసనకారులతో పాక్ ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలం కావడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి.

# రష్యానుంచి మరిన్ని ఎస్400 క్షిపణుల కొనుగోళ్లు



**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్-400 వైమానిక రక్షణ క్షిపణి వ్యవస్థలు బాగా పనిచేసినందున, రష్యా నుంచి భారత్ మరిన్ని ఎస్-400 వైమానిక రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసిన యోచనలో ఉంది. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఈ ఆయుధ వ్యవస్థ అత్యంత ప్రభావవంతంగా పనిచేసినందున ఈ విషయాన్ని భారత్ పరిశీలిస్తోందని రక్షణ వర్గాలు తెలిపాయి. ఈ డిసెంబర్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించే సందర్భంగా చర్చల్లో ఈ కొనుగోలు ప్రతిపాదన కీలక అంశంగా ఉండవచ్చని తెలుస్తోంది. 2018 అక్టోబర్‌లో భారత్, రష్యాతో 5 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుని ఎస్400 గగన రక్షణ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేసింది. అమెరికా ఈ ఒప్పందం కారణంగా కౌంటరింగ్ అమెరికాస్ అడ్వర్సరీస్ శాంక్షన్స్ యాక్ట్ కింద ఆంక్షలు విధించవచ్చని హెచ్చరించినప్పటికీ ఈ ఒప్పందం కొనసాగింది. ప్రస్తుతం మూడు స్క్వాడ్రన్‌లు భారత్‌కు సరఫరా అయ్యాయి. ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపీ సింగ్‌ను మరిన్ని ఎస్400 వ్యవస్థల కొనుగోలు గురించి ఆయన్ను ప్రశ్నించగా, ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.

# సంక్షిప్తంగా..

## స్వచ్ఛందంగా దేశం విడిచివెళ్తే 2,500 డాలర్లు ఇస్తాం: ట్రంప్



**వాషింగ్టన్, అక్టోబరు 4:** రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులను దేశం నుంచి పం పించేందుకు అధ్యక్షుడు ట్రంప్ ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా తాజాగా వలసదారుల పిల్లలకు ఆయన యంత్రాంగం ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. స్వచ్ఛందంగా దేశం వీడితే 2,500 డాలర్లు చెల్లిస్తామని తెలిపింది. అమెరికా ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈ విషయాన్ని వెల్లడించింది. 14యేళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వలసదారుల పిల్లలకు ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపింది. దేశం నుంచి స్వచ్ఛందంగా వెళ్లాలనుకునే వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా 2,500 డాలర్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. దీనిపై స్పందించేందుకు వారికి 24 గంటల సమయం ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఇది ఎప్పటి నుంచి అందిస్తుందనే వివరాలు వెల్లడించలేదు. ఈ ఆఫర్‌ను తొలుత 17 యేళ్ల పిల్లల నుంచి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారని రాయిటర్స్ పేర్కొంది. ఇక ఈ చర్యలను ఇమిగ్రేషన్ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఇది క్రూరమైన చర్య అని, పిల్లల రక్షణ చట్టాలను ఇది బలహీనపరుస్తుందన్నారు.

## అరేబియా సముద్రంలో పోర్టు నిర్మాణం కోసం పాక్ యత్నాలు




**ఇస్లామాబాద్, అక్టోబరు 4:** అమెరికా-పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలు ఇటీవల బలపడిన సంగతి తెలి సిందే. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అరేబియా సముద్రంలో పోర్టు నిర్మాణంపై పాకిస్థాన్ అమెరికా అధికారులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీచీఫ్ ఆసీం మునీర్ ఇటీవల అగ్రరాజ్యంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఈ ప్రతిపాదనలు చేసినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం.. అరే బియా సముద్రంలో ఓడరేవు నిర్మించే అంశం గురించి మునీర్ యుఎస్ అధికారుల ముందు ఉంచారు. దీంతో తమ దేశంలోని పాస్నీలో లభించే కీలక ఖనిజాల రవాణాకు దీన్ని ఉపయోగించవచ్చనేది పాక్ ఆలోచన. అఫ్ఘానిస్థాన్-ఇరాన్ సరిహద్దులో ఉన్న బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఈ పాస్నీ ఒక ఓడరేవు పట్టణం. మునీర్ వైట్‌హౌస్ పర్యటనకు ముందే ఆయన అడ్వైజరు యుఎస్ అధికారులతో ఈ విషయమై చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే, అమెరికా సైనిక స్థావరాల కోసం మాత్రం ఈ ఓడరేవును ఉపయోగించుకోవడాన్ని పాక్ వ్యతిరేకించినట్లు తెలుస్తోంది.

## ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య యుద్ధానికి ఇక తెర!



**న్యూఢిల్లీ, అక్టోబరు 4:**ఇజ్రాయెల్,హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధం ముగింపుకు కీలక ముందడుగు పడింది. గాజాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికాఅధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల ఫార్ములాను హమాస్ అంగీకరించింది. ఈ తాజా పరిణామాలను భారత్ స్వాగతించింది. గాజాలో శాంతి ప్రయత్నాలకు ట్రంప్ నాయకత్వాన్ని ప్రధాని మోడీ అభినందించారు.గాజాలో శాంతి ప్రయత్నాల్లో నిర్ణయాత్మక పురోగతిసాధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వాన్ని స్వాగతి స్తున్నట్లు మోడీ పేర్కొన్నారు. బందీల విడుదలకు అంగీకారం కుదరడం శాంతిస్థాపనకు కీలక ముందడుగు అన్నారు. శాశ్వత, న్యాయమైన శాంతి పునరుద్ధరణ ప్రయత్నాలక భారత్ ఎప్పుడూ గట్టిగామద్దతు ఇస్తుందన్నారు. గాజా యుద్ధం ఆపేందుకు ట్రంప్ చేసిన ప్రతిపాదనలు తొలుత ఇజ్రాయెల్ అంగీకరించింది. ఈ క్రమంలోనే హమాస్ తన అంగీకారం తెలపకపోవడంపై ట్రంప్ సీరియస్ అయ్యారు.ఆరుగంటల్లోగా ఒప్పందం కుదుర్చుకోవలని, లేదంటే తీవ్రపరిణామాలు ఉంటాయని హమాస్‌ను హెచ్చరించారు.దీంతో దిగొచ్చిన హమాస్ బందీల విడు దలకు అంగీకరించింది. అయితే ప్రతిపాదనలోని కొన్ని విషయాలపై ఇంకా చర్చలు జరపాల్సి ఉందని పేర్కొంది.హమాస్ ప్రకటననేపథ్యంలో గాజాపైదాడులు చేయవద్దంటూ ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచించారు.

## జపాన్ తొలిమహిళా ప్రధానిగా సనై తకైచి



**టోక్యో, అక్టోబరు 4:** జపాన్ చరిత్రలో తొలిసారిగా ఓ మహిళ ప్రధానమంత్రి కానున్నారు.జపాన్ అధికార లిబరల్ డెమొక్రాటిక్ పార్టీలో అంతర్గత విభేదాల కారణంగా షిగెరు ఇషిబా ఇటీవల ప్రధానిపదవికి రాజీనామా చేయగా, పార్టీ అధ్యక్షురాలిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఈ క్రమంలో తదుపరి ప్రధానిగా తకైచి బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఫలితంగా జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికార లిబరల్ డెమొక్రా టిక్ పార్టీ జపాన్ పార్లమెంట్ ఎగువ సభలో మెజారిటీ సాధించలేకపోయింది. అంతకు ముందు దిగువ సభలో కూడా మెజారిటీ కోల్పోయింది.దీనితో ఇషిబాపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. దీనితో ఆయన ప్రధాని పదవికి రాజీనామా చేశారు.తదుపరి ప్రధానికోసం శనివారం పార్టీలో ఎన్నిక నిర్వహించగా, మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమితో పాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి సనై తకైచి విజయం సాధించారు.

# దేశంలో ఎన్నికల ప్రక్రియను బిజెపి అపహాస్యం చేస్తోంది

## సిడబ్ల్యూసి సభ్యుడు గిడుగు రుద్రరాజు ధ్వజం



**తిరుపతి (రవాణా), అక్టోబర్ 4 ప్రభాతవార్త** అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో అత్యంత బాధ్యతతో నిర్వహించాల్సిన ఎన్నికల ప్రక్రియను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన అధికార దాహంతో అపహాస్యం చేస్తుందని సి డబ్ల్యూ సి సభ్యులు, పీసీసీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్నికల నిర్వహణ, ఓట్ చోరీపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలు రాజ్యాంగం తమకు కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే హక్కును అధికార దాహంతో కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ అక్రమంగా కాల రాస్తోందని మండిపడ్డారు. ఈ విషయాన్ని పార్లమెంట్లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టారని వెల్లడించారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న, జరిగిన ఎన్నికల తీరు, వచ్చిన ఫలితాలను పరిశీలిస్తే ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని బిజెపి ప్రభుత్వం చేస్తున్న మోసాలు బయటపడుతున్నాయని వివరించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజార్టీని సాధించిందని చెప్పారు. అయితే అసెంబ్లీ స్థానాలకు వచ్చేసరికి నమ్మలేని విధంగా బిజెపికి ఎక్కువ ఓట్లు రావడం గమనించాల్సిన విషయమని తెలిపారు. ఇది ఏ ఒక్క నియోజకవర్గానికి పరిమితం కాలేదని, అన్ని నియోజక వర్గాల్లోనూ బిజెపికి ఓట్లు అత్యధికంగా ఎలా వచ్చాయో ఆ పార్టీ చెప్పాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో తమకు అనుకూలమైన ఓట్లను కొనసాగించడం కొత్త ఓట్లను చేర్చడం, ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ అనుకూల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఓట్లను గల్లంతు చేయడం గుర్తించడం జరిగిందన్నారు. ఇదే తరహాలో కర్ణాటకలో జరిగిందని, బీహార్లో 60 లక్షల ఓట్లు అదృశ్యంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నిలదీస్తూనే ఉన్నారని చెప్పారు.



# ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అనే దానికి ఉదాహరణ ఆటో డ్రైవర్ల సేవా కార్యక్రమం

## - దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు, అక్టోబర్ 4, ప్రభాతవార్త -వైద్యం** శనివారం నెల్లూరులోని స్టోన్ హౌస్ పేట, లక్ష్మీపురంలోని ఎస్‌బీఎస్ కళ్యాణ మండపంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నప్పటికీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు అన్ని కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పది లక్షల కోట్ల రూపాయలకు వడ్డీలతో పాటు అసలు చెల్లిస్తూ పథకాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద మూడు లక్షల 12 వేల దరఖాస్తులు రాగా స్క్రూట్‌ని అనంతరం 2,91,000 మందిని అర్హులుగా ప్రకటించి వారికి 15 వేల వంతున ఒకే సారి 435 కోట్ల రూపాయలను నేరుగా వారి ఖాతాలలోకి జమ చేయడం జరిగిం దన్నారు. నెల్లూ రు లో 17,46 మంది డ్రైవర్లకు గాను 26 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నెల్లూరు అర్బన్‌లో 1821 మంది లబ్దిదారులకు 2.7 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగిందని, అదే విధంగా నెల్లూరు రూరల్‌లో 3441 మంది, కందుకూరు నియోజకవర్గం సంబంధించి 1004 మందికి కావాలి నియోజకవర్గం సంబంధించి 1888 మందికి ఆత్మకూరు నియోజకవర్గం సంబంధించి 1636 మందికి, కోవూరు నియోజకవర్గం సంబంధించి 2585 మందికి, అదేవిధంగా సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి 2651 మందికి ఉదయగిరి నియోజక వర్గం సంబంధించి 1406 మందికి వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాలకు సంబంధించి 974 మందికి వెరసి 17406 మందికి నగదు జమ చేయడం జరుగుతుం దన్నారు. వీరిలో మైనార్టీస్ కార్పొరేషన్ ద్వారా 402 మందికి, వైశ్య కార్పొరేషన్ ద్వారా ఇద్దరికి, బీసీఏ కార్పొరేషన్ ద్వారా 2946, బీసీ బీ కార్పొరేషన్ ద్వారా 1921 మందికి, బీసీసీ కార్పొరేషన్ ద్వారా పది మందికి, బీసీ డీ కార్పొరేషన్ ద్వారా 1755 మందికి, బీసీ ఈ కార్పొరేషన్ ద్వారా 20245 మందికి బ్రాహ్మిన్ కార్పొరేషన్ ద్వారా 24 మందికి, ఈ బీసీ కార్పొరేషన్ ద్వారా 340 మందికి, కమ్మ కార్పొరేషన్ ద్వారా 327 మందికి, కాపు కార్పొరేషన్ ద్వారా 957 మందికి, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 14 మందికి, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 744 మందికి, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 4804కి ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 104 మందికి, ఇతరులకు 11 మందికి నగదు జమ చేయడం జరిగిందని వివరించారు. చూపించిన విధంగా సూపర్ సక్సెస్ కార్యక్రమం అయిందని ఆయన తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంచడం జరిగిందని, తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ వంటి ప్రారంభించామన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా చాలా మంది మహిళలు సుదూర ప్రాంతాల నుండి ప్రయాణించి విజయవాడ కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు, తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవాలలో పాల్గొన్నారు.

# త్యాగాలు తప్పవు, సర్దుకుపోవటం, కలసి కట్టుగా పని చేయటమే మార్గం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 4 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ పదవిని జనసేన నాయకుడు కొట్టె సాయికి వరించటం పట్ల శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి వివిధ సమీకరణలతో నిర్ణయించారని తనకు సంతోషంగా ఉందన్నారు. అయితే తాము అనుకున్నది ఒకటి జరిగింది మరొకటి అయితే కీలక నిర్ణయాలపట్ల పాజిటివ్‌గా స్పందించాలి. సమిష్టి నిర్ణయాల పట్ల కొన్ని త్యాగాలు తప్పదని సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో తమ కోసం పాటు పడిన వారు కేసులు పెట్టించుకున్నారు. కొట్టించు కున్నావారిలో సాయి ఒకరు. ఆయన సేవలను గుర్తించి శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి పగ్గాలు ఇచ్చారు. రాష్ట్రంలో 10 సంవత్సరాలు కష్టపడి పని చేసిన వారు తమ ఎంఎల్ఏ సీట్లను వదలు కున్నారు. నేడు శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి యువకునికి అందించారు. యువ టీం శ్రీకాళహస్తీశ్వరాయ చరిత్రను తిరగరాస్తామని ప్రకటించారు. కూటమిలో ఉన్నపుడు పాజిటివ్‌గా కలుపుకొని పోవాలన్నారు. అయితే తమ మధ్య పుల్లలు పెట్టేవారు ఉంటారు. కానీ శ్రీకాళహస్తిలో కూటమి బలోపేతంగా ఉంటుంది. రాబోవు ఎన్నికల్లో కలసి మెలసి పని చేస్తాము. జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీలు కలసి కట్టుగా పని చేస్తాము.

శ్రీకాళహస్తీశ్వరాలయ రూపు రేఖలు మార్చేస్తాం. కమిటీలో అందరూ చదువుకున్న వారే కాబట్టి విభేదాలు లేకుండా పార్టీ క్యాడర్ కలసి పోవాలి. రాబోవు రోజుల్లో మంచి రోజులుంటాయి. తెలుగుదేశం పార్టీ వర్గాలు కలసి పోవాలని సూచించారు. మరి కొట్టేసాయికి శివయ్య స్వామి అవకాశం కల్పించటంలో ఆంతర్యమేమిటో కాని మనలోని అసంతృప్తిని పక్కన పెట్టి కలసి మెలసి పని చేయాలని కేడర్‌కు పిలుపు నిస్తున్నామని సుధీర్‌రెడ్డి అన్నారు.



## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవం

**రాపూరు, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు, వేద మంత్రోచ్ఛ రణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, సిబ్బంది నరసింహా, వెంకట సుబ్బయ్య, పులగల నరసింహా పర్యవేక్షించారు.

## నకిలీ మద్యం మాఫియాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

### బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్

**పుంగనూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త** నకిలీ మద్యం మాఫియాపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లాలో వెలుగు చూసిన నకిలీ మద్యం మాఫియా వెనుక ఉన్న ప్రభుత్వ పెద్దల పాత్ర బయట పడాలంటే సమగ్ర విచారణ జరిపించాల్సిందేనన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏమాత్రం జంకూ బొంకూ లేకుండా నేషనల్ హైవేను ఆనుకొనే నకిలీ మద్యం తయారు చేస్తున్నారంటే కచ్చితంగా వారికి ప్రభుత్వ పెద్దల అండదండలు ఉన్నాయన్నారు. అధికార టిడిపికి చెందిన నియోజకవర్గ ఇన్ చార్జ్ అనుచరులు ఈ నకిలీ మద్యం తయారు చేస్తున్నారంటే దీని వెనుక పెద్ద రాకెట్ ఉందని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప మాఫియాలు మారడం లేదన్నారు.

వైసిపి హయాంలో మద్యం కుంభకోణం జరిగితే... కూటమి హయాంలో ఏకంగా నకిలీ మద్యం తయారు చేసి అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆ మద్యం తాగితే ఎంతో మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కచ్చితంగా ఈ నకిలీ మద్యం మాఫియా వెనుక ప్రభుత్వ పెద్దల పాత్రం ఉందన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో భవానీల రద్దీ

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 4, ప్రభాతవార్త** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిసినప్పటికి భవానీ మాలధారుల రద్దీ కొనసాగుతోంది. శనివారం కూడా పెద్ద ఎత్తున భవానీ మాలదారులు రావడంతో వారికి విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇఓ వికె శీనా నాయక్ ఆలయ ప్రాంగణమంతా పర్యటిస్తూ ఏర్పాట్లపై పరిశీలన చేస్తూ అధికారులకు సూచనలు చేస్తూ సులభంగా, త్వరితంగా రద్దీ తగ్గే ఏర్పాట్లు చేశారు. దుర్గమ్మవారిని శనివారం ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రధ్యుమ్న దంపతులు దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను ఇఓ వికె శీనా నాయక్ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



భవానీ మాలధారుల రద్దీ దృశ్యాలు

# అపస్మారక స్థితిలో ఉన్న మహిళకు ఎన్టీఆర్ జిల్లా ఉన్నతాధికారుల సపర్యలు



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సుహాసిని,డీసీపీ కేజీవి సరిత

**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య, పోలీస్ శాఖల ఉన్నతాధికారుల సత్వర స్పందనతో ఓ మహిళ ప్రాణాలు నిలిచాయి. హోదాలను పక్కనపెట్టి బాధితురాలి కాళ్ళను పట్టుకొని చేసిన చికిత్స ఆమెకు పునర్జన్మను ప్రసాదించింది. ముఖ్యమంత్రి పాల్గొన్న "ఆటో డ్రైవర్ల సేవలో" పథకం సభలో జరిగిన ఈ సంఘటన అధికారుల సేవా దృక్పథానికి సజీవ తార్కాణంగా నిలుస్తోంది. విజయవాడ వాంబే కాలనీ ఏఎస్ నగర్ కు చెందిన గట్టి నాగజ్యోతి శనివారం జరిగిన "ఆటో డ్రైవర్ల సేవలో" సభకు హాజరైంది. శాశ్వత మానసిక వైకల్యం (మెంటల్ రిటార్డేషన్) ఉన్న తన ఐదు సంవత్సరాల కుమార్తెకు ప్రభుత్వ సాయం కోసం వచ్చిన ఆమె ఉన్నట్టుండి కుప్పకూలిపోయింది. ఆమెను గమనించిన విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు స్వయంగా వెళ్లి అంబులెన్స్ ను తీసుకువచ్చారు. అక్కడే ఉన్న పోలీస్ డిప్యూటీ కమిషనర్ కేజీవి సరిత ఆమెను ఒడిసి పట్టుకున్నారు. తన కాళ్ళను చాపి చేతులతో రాపిడి కలగజేశారు. దీన్ని గమనించిన ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్వో డాక్టర్ సుహాసిని హుటాహుటిన బాధితురాలి వద్దకు వచ్చారు. నాగజ్యోతి నాడి కొట్టుకోవడం లేదని, పరిస్థితి విషమంగా ఉందని గ్రహించారు. బాధితురాలు సెరిబ్రల్ ఎనాక్సియా (మెదడుకు ఆక్సిజన్ అందకపోవటం) కు గురైందని గుర్తించి తక్షణం ఆమె కాళ్ళను తన భుజంపై ఉంచుకొని మెదడుకు రక్తప్రసరణ జరిగేలా చేశారు. ఈ చర్య వల్ల బాధితురాలి లో నాడీ స్పందనలు మొదలయ్యాయి. వెంటనే ఆమెను అంబులెన్సులో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం నాగజ్యోతి ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. నాగజ్యోతికి పునర్జన్మ ప్రసాదించిన ఉన్నతాధికారులను ప్రజలు, అధికారులు ప్రశంసిస్తున్నారు.

## యువకుడి లైంగిక వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** యువకుడి లైంగిక వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకుంది. ఈ సంఘటన కృష్ణాజిల్లా పామర్రు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొమరవోలు గ్రామానికి చెందిన మెరుగుమాల పవన్ అనే వ్యక్తి గత కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన వసంత అనే వివాహితను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. రోజు రోజుకు అతడి వేధింపులు పెరుగుతూ పోయాయి. అతడి వేధింపులు భరించలేకపోయిన వసంత షాకింగ్ నిర్ణయం తీసుకుంది. కలుపు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వసంత కలుపు మందు తాగిందని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## మానవహక్కుల పరిరక్షణకు హేమలతా లవణం దంపతుల కృషి చిరస్మరణీయం

### కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు

**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక రుగ్మతలను పారదోలి.. మానవహక్కుల పరిరక్షణ, నిరాదరణకు గురైన సాంఘికవర్గాల అభ్యున్నతికి హేమలతా లవణం దంపతులు చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిందని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. నేరస్థ జాతుల సంఘ సంస్కరణోద్యమం అర్థ శతాబ్దం పూర్తి చేసుకున్న నేపథ్యంలో సంస్కార్ స్వచ్ఛంధ సంస్థ అధ్వర్యంలో దివంగత హేమలతా లవణం దంపతులు రచించిన పుస్తకాలను పునర్ముద్రించారు. ఈ పుస్తకాలను విజయవాడ నాస్తిక కేంద్రంలో జస్టిస్ మన్మథ రావు గురువారం ఆవిష్కరించారు. మొదటి ప్రతులను నేరస్థ జాతుల అభివృద్ధికి కృషి చేస్తున్న గరిక ప్రభాకరరావుకు అందచేశారు. ఈ సందర్భంగా జస్టిస్ మన్మథ రావు మాట్లాడుతూ అసాధ్యమవుతున్న సాంఘి కోద్యమాన్ని హేమలతాలవణం దంపతులు తమ భుజాత కెత్తుకుని న్యాయ మార్గంలో నడిపించి విజయవంతం చేశారన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఎంవిఎస్ శర్మ నాస్తిక కేంద్రం అధ్యక్షుడు సంమరం, సంస్కార్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు హరి, సుబ్రహ్మణ్యం, కొంపల్లి సుందర్, గోరా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అవయవదానంపై అవగాహన దిశగా టిటిడి!

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం ఆస్పత్రి నిర్వహిస్తూ అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని భావిస్తోంది. ఇప్పటికే పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో రెండువేలవరకు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేయడం, గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్న విషయం విదితమే. ఈ సమయంలో ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉంటే ప్రాణాపాయస్థితిలో ఉన్న వారి జీవితాల్లో వెలుగునింపవచ్చనే ఆలోచనతో ముందుకు కదలనుంది. ఓ భక్తుడు టిటిడికి చేసిన అమూల్యమైన సూచనలతో రెండునెలల క్రిందట తిరుపతిలోని ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రిలో నేత్రదానం కేంద్రం ప్రారంభించింది. శ్రీవారి భక్తులు, ప్రజలు స్వచ్ఛందంగా నేత్రదానం చేసి ,ఎంతోమందికి కొత్తజీవితాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. అరవింద్ కంటి ఆస్పత్రి ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్ 9398358828ను అందుబాటులోకి తీసుకువచ్చారు. సహజంగానే ఆరోగ్యంగా ఉండి ఏదేని కారణాలతో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తులు, మరణించిన వారికి సంబంధించిన కాలేయం, గుండె, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కళ్ళు వంటి అవయవాలను దానం చేయవచ్చు. ఒక దాత నుండి ఎనిమిదిమందికి ప్రయోజనం చేకూర్చి

## గుండె, నేత్రదానానికి ప్రాధాన్యత

పునర్జన్మనిచ్చే వీలుకలుగుతుందనేది ప్రముఖ వైద్యుల సూచనలు. పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో కొనసాగుతున్న గుండె శస్త్రచికిత్సలతో చాలావరకు అవసరమైన రోగులకు, చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేయడం, అమర్చడం ప్రధానంగా మారింది. దీంతో అవయవదానంపై అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువమంది ఈ మహాదానంలో పాలుపంచుకునేలా ప్రోత్సహించే అవకాశంఉంది. దేశంలో ప్రతి ఏటా అవయవదానం లేకపోవడం వల్ల ఐదులక్షలమంది ప్రాణాలు కోల్పోతున్నారనేది సమాచారం. అవయవదానం వల్ల కొంతమంది జీవితంలో పునర్జన్మనివ్వవచ్చనేది వైద్యులు చెబుతున్నారు. చట్టప్రకారం అవయవదానం కోసం ప్రతిజ్ఞ ఫారమ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇప్పుడు టిటిడి కళ్ళదానం కోసం ప్రత్యేకంగా కేంద్రాన్ని ప్రారంభించింది. శరీరంలోని అన్ని ఇంద్రియాలలో కంటికి ఉన్న ప్రాధాన్యత అత్యంత ఉత్కృష్టమైనది. మనదేశంలో

కంటిమార్పిడి(కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్)కోసం కనీసం ఒక లక్షకళ్ళు అవసరం ఉంటే కేవలం 25వేల కళ్ళే అందుబాటులో ఉన్నాయనేది వైద్యుల సమాచారం. ఒక్కరి నేత్రదానం ద్వారా ఇద్దరికీ దృష్టి లభిస్తుంది. సిఎం చంద్రబాబు సూచనలతో ప్రస్తుతం టిటిడి బోర్డు, అధికారులు అవయవదానంపై అవగాహన కల్పించాలని భావిస్తున్నారు.

# అభిమాని పెళ్లి వేడుకలకు మంత్రి నారా లోకేశ్




**విజయవాడ, అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మానవ వనరులు శాఖా మంత్రి నారా లోకేష్ కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ముఖ్యంగా పార్టీ అధికారంలో లేనప్పుడు తన వెన్నంటి ఉన్న వారిని ఆయన మరిచిపోరు. వారు వ్యక్తిగతంగా ఏ కుటుంబ కార్యక్రమానికి పిలిచిన అక్కడికి లోకేష్ అక్కడి వెళ్తారు. తానే స్వయంగా వారితో సెల్ఫీ తీసుకుంటారు. అభిమానుల కుటుంబ కార్యక్రమాలో ఆయన ఎంతో హుషారు గడుపుతారు, తాజాగా తమ పెళ్లికి రావాలని ఓ మహిళా అభిమాని పంపిన ఆహ్వానాన్ని మన్నించిన లోకేశ్ అకస్మాత్తుగా వారి ఇంట ప్రత్యక్షం కావడంతో ఆ అభిమాని కల నిజమా అన్నట్లుగా ఆశ్చర్య పోయింది. యువగళం ద్వారా లక్షలాదిమంది యువతీ యువకుల్లో చైతన్యాన్ని రగిల్చి, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించడంలో యువనేత నారా లోకేశ్ పాదయాత్ర కీలకపాత్ర పోషించింది. యువగళంలో భాగంగా 2023 ఆగస్టు 20వ తేదీన నారా లోకేశ్ విజయవాడ నగరంలో నిర్వహించిన పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. విజయవాడ మొగల్రాజపురానికి చెందిన భవానీ (భవ్య) అనే యువతి ఆనాటి పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొని సంఘీభావం తెలిపింది. యువగళం యాత్ర ద్వారా లోకేశ్ అభిమానిగా మారిన భవ్య తన పెళ్లికి విచ్చేసి ఆశీర్వదించాలంటూ ఇటీవల మంత్రి నారా లోకేశ్ కు ఆహ్వానపత్రిక పంపించారు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత గన్నవరం ఎయిర్ పోర్టు సమీపంలోని ఓ కళ్యాణ మండపంలో భవ్య వివాహం జరగుతుంది.

# వాగ్దానాలతో నిమిత్తం లేకుండా ప్రజలకు అండగా ప్రభుత్వం :మంత్రి మండిపల్లి

**విజయవాడ,అక్టోబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** వాగ్దానాలతో నిమిత్తం లేకుండా ప్రజల అవసరాలు గుర్తించి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రవాణా శాఖామంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మంచి చేయాలనే ఆలోచనా దృక్పథం సీఎం చంద్రబాబుదన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభంకార్యక్రమంలో రవాణా శాఖామంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలో లేకపోయినా ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించిన సీఎం చంద్రబాబు నాయుడు వారిని ఆదుకోవడానికి ఆటో డ్రైవర్ల సేవలో పథకంలో భాగంగా అర్హులందరికీ ఒక్కొక్కరికి రూ. 15వేలు అందించడం హర్షనీయమన్నారు. ఈ ప్రభుత్వం కార్మిక సంక్షేమ ప్రభుత్వమని, వారి సంక్షేమం కోసం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ప్రజల కష్టాలను తీర్చడానికి సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను కొంతమంది అమలు చేయడం సాధ్యం కాదని ఎగతాళి చేశారని, కాని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి సూపర్ హిట్ అని నిరూపించిందని, అదనంగా ఆటో డ్రైవర్ల సేవలో పథకం ను కూడా అమలు చేసి చూపించామన్నారు. కాని గత ప్రభుత్వ పాలనలో విధ్వంసం మాత్రమే జరిగిందని, అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లను పున:ప్రారంభించిన సిఎం చంద్రబాబు నాయుడు పేదలు, కార్మికుల ఆకలిని తీరుస్తున్నారన్నారు. బిజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల్లో సంతోషం నింపాలన్న సీఎం చంద్రబాబు తపనపడుతుంటారన్నారు. స్త్రీ శక్తి పథకం అమలుతో ఆటో కార్మికులు ఇబ్బంది పడకూడదని సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన చేసి హామీల్లో లేకపోయినా ఆటో డ్రైవర్ల సేవలో పథకంను ప్రారంభించడం హర్షనీయమన్నారు. ఎన్టీయార్ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కష్టాలను తీర్చడానికి ముందుంటాయన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖామాత్యులు వై. సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ లక్ష్మీశ అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# పశు వధశాలలపై అధికారుల దాడి - గోశాలకు 120 పశువుల తరలింపు

**హిందూపురం అక్టోబర్ 4 ప్రభాతవార్త** హిందూపురం పట్టణంలోని పరిగి రోడ్డు కంపోస్ట్ యార్డ్ పక్కన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పశు వధ కేంద్రాలపై పోలీసులు, మున్సిపల్ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి దాడులు చేశారు. గో సంరక్షణ స్వచ్ఛంద సంస్థ మహారాష్ట్ర నుంచి ఫిర్యాదు రావడంతో బెంగళూరు కేంద్రంగా ఉన్న ప్రాంతీయ కార్యాలయం నుంచి ప్రతినిధులు స్వయంగా వచ్చి హిందూపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి గోవులను అక్రమంగా బెంగళూరుకు తరలిస్తున్నారని తెలిసిందని అక్కడ విచారించగా హిందూపురం నుంచి భారీ ఎత్తున గోమాంసం ఎద్దు మాంసం బెంగళూరుకు వస్తున్నట్లు తెలిసింది అన్నారు. ఉన్నత స్థాయి నుంచి ఆదేశాల రావడంతో సత్యసాయి జిల్లా ఎస్పీ నుంచి కూడా స్థానిక పోలీస్ అధికారులకు ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే డి.ఎస్.పి మహేష్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున నేతృత్వంలో సిఐలు రాజగోపాల్ నాయుడు, కరీం, పోలీస్, మున్సిపల్ సిబ్బంది శనివారం పెద్ద ఎత్తున పశువధ కేంద్రాలపై దాడులు చేసి అక్కడ వధ చేసేందుకు సిద్ధంగా



విచారణ చేస్తున్న అధికారులు

ఉన్న 120 పశువులను గుర్తించారు. ఇందులో 5 ఆవులు, కొన్ని దూడలు ఉన్నట్లు డిఎస్పి తెలిపారు. అంతేకాకుండా 200 కేజీల మాంసాన్ని, భారీ ఎత్తున తోళ్ల నిల్వ ను కూడా గుర్తించారు. ఈ పశువులను రక్షిస్తూ కళ్యాణదుర్గం లోని గోశా లకు తరలించేందుకు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. వదశాలల నిర్వాహకులు ఎంతమంది ఉన్నారో అన్నదానిపై ఇంకా విచారణ జరుగుతుందని, ఆదివారం వివరాలు వెల్లడిస్తామని డిఎస్పి తెలిపారు. మాంసాన్ని పూడ్చివేసినట్లు అధికారులు తెలిపారు. తోళ్లను కూడా భూమిలో పూడ్చి వేయాలని తొలుత అధికారులు భావించినప్పటికీ పర్యావరణానికి హాని కలుగుతుందన్న విషయం తెలియడంతో, బెంగళూరు నుంచి తోలు కొనుగోలుదారులను ఇక్కడికి పిలిపించి వారికి అమ్మిన తర్వాత వచ్చిన సొమ్మును మున్సిపల్ ట్రెజరీ ఖాతాలో జమ చేస్తామని కమిషనర్ వివరించారు. ఉదయ్ కేంద్రాలను సీజ్ చేశామని చెప్పారు.



శనివారం మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి అంత్యక్రియల్లో పాడె మోస్తున్న పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్, విహెచ్ తదితరులు

## అధికార లాంఛనాలతో దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు

### పాడె మోసిన పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్, విహెచ్

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది పలు మంత్రి పదవులను సమర్థవంతంగా నిర్వహించి, కమ్యూనిస్టులు బలంగా ఉన్న ప్రాంతంలో తనదైన శైలిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసిన మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలను శనివారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. పెద్దఎత్తున జనం తరలి వచ్చి తమ ప్రియతమ నాయకుడికి కన్నీటి వీడ్కోలు పలికారు. తుంగతుర్తి జనసంద్రంతో నిండిపోయింది. టైగర్ దామన్న అమర్ హై అంటూ నినాదాలు చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన పార్థివదేహాన్ని హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు తీసుకొచ్చి రెడ్‌హౌస్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. శనివారం ఉదయం దామోదర్ రెడ్డి భౌతిక కాయాన్ని తుంగతుర్తికి తరలించగా ఉదయం 6 గంటల నుంచి ప్రజలు, నాయకులు, పార్టీ శ్రేణులు తమ ప్రియతమ నాయకుడిని కడసారిగా చూసుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. దామోదర్‌రెడ్డి కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి చితికి నిప్పంటించి సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అంత్యక్రియల సందర్భంగా పాడె మోశారు. దామోదర్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, మందుల సామేల్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హను మంతరావు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పాల కుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ప్రభృతులు అంత్యక్రియలలో పాల్గొన్నారు.

**పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిది : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

దివంగత కాంగ్రెస్‌నేత, మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆశయ సాధనకు అవిరళ కృషి చేస్తానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. దామోదర్ రెడ్డి అంత్యక్రియల నిమిత్తం ఆయన శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రా నికి చేరుకున్నారు. ఈ సందర్భంగా దివంగత నేత దామన్న పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి విస్మరిం చలేనిదని కొనియాడారు. అన్నిరకాల ఆటుపోట్లను అధిగ మించి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. వ్యాపార దృక్ప థంతో రాజకీయాలు నడుపుతున్న ఈ రోజుల్లో పార్టీని పార్టీ యంత్రాంగాన్ని కాపాడుకునేందుకు సొంత ఆస్తులను కర్పూరంలా కరిగించుకున్న మహానేత దామోదర్‌రెడ్డి అని

## రాష్ట్రంలో మద్యం దుకాణాలకు వారం రోజుల్లో 447 దరఖాస్తులు

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మద్యం దుకాణాలకు వారం రోజుల వ్యవధిలో 447 దరఖాస్తులు అందాయి. గత నెల 26వ తే దీన మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ మొదలవడం తెలిసిందే. శనివారం సాయంత్రం వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కలిపి 447 దరఖాస్తులు అందినట్లు అబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. వచ్చే డిసెంబర్ ఒకటవ తేదీన నూతన మద్యం దుకాణాలు ప్రారంభం కానుండడం విదితమే. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 18వ తేదీ వరకు వుంటుంది. ఈ నెల 23వ తేదీన లాటరీ పద్ధతిలో దుకాణాలను ఎంపిక చేస్తారు. మొత్తం 2620 దుకాణాల్లో గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు పది శాతం, ఎస్టీలకు ఐదు శాతం కేటాయించడం తెలిసిందే.



సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్‌శర్మ

## ధన్వంతరి ఫౌండేషన్ కేసులో నిందితుడు కమలాకరశర్మ

### ఇది బాధితులకు శుభవార్త: గిరిప్రసాద్‌శర్మ

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 4, ప్రభాతవార్త:** ధన్వంతరి ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ సంస్థ బాధితులకు శుభవార్త. ధన్వంతరి రియల్ ఎస్టేట్ ఆస్తులన్ని విక్రయించి ఆ డబ్బును పెట్టుబడిదారులైన బాధితులకు పంపిణీ చేయాలని ధన్వంతరి బాధితుల ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులతో కలిసి ఆయన మాట్లాడుతూ నాంపల్లి ఎంఎస్‌జె కోర్టు ఇచ్చిన తాజాతీర్పు ప్రకారం నిందితుడు కమలాకరశర్మ అని తేలిందన్నారు. ఆయనతోపాటు భార్య జయశ్రీ కలిసి కుట్రపన్ని ధన్వంతరి సంస్థ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగించారని ఆరోపించారు. వారు మరికొంతమంది కలిసి ముఠాగా ఏర్పడి మోసపూరిత ప్రకటనలు ఇచ్చి బ్రాహ్మణ కుటుంబాల నుంచి కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆయన తెలిపారు. నిందితుడు బాధితుల డబ్బులతోనే ఆస్తులు కొనుగోలు చేశారని, ఈ అస్తులన్నీ బాధితులకే చెందాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కేసును స్వీకరించిన సిసిఎస్ మొత్తం బాధితులు 4,400లుగా తేల్చిందని, ఒకటిన్నర సంవత్సరంలోనే సిసిఎస్ ఈ కేసును విజయవంతంగా తేల్చిందన్నారు. ధన్వంతరి రియల్ ఎస్టేట్ ఆస్తులన్ని ప్రభుత్వం విక్రయించి, బాధితులకు అసలు, వడ్డీ చెల్లించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిసిఎస్ పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సమావేశంలో బాధితులు రాధారోహిణి, పరిమళ, సరళాదేవి, ఛాయాదేవి, విజయలక్ష్మి, వీణాగాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమానికి రూ.83 కోట్లు విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** గిరిజన సంక్షేమ శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజన సంక్షేమ శాఖలో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులకు వాటి చెల్లింపుల నిమిత్తం రూ. 83.07 కోట్లను విడుదల చేసింది. ఇందులో డైట్ బిల్లులు నిమిత్తం 55.19 కోట్ల రూపాయలు, హాస్టల్ కార్మికుల వేతనాలు కింద 9.44 కోట్ల రూపాయలు, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో రోజు వారీ వేతన సిబ్బందికి 8.84 కోట్ల రూపాయలు, గురుకులకు సంబంధించి కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల(సీఆర్టీ)లకు 9.60 కోట్ల రూపాయలను విడుదల చేసింది. కాగా పెండింగ్ బిల్లుల విడుదల కాకపోవడం వల్ల ఇప్పటి వరకూ ఇబ్బంది పడుతున్న సిబ్బందికి ఇది ఉపశమనం కలిగించింది. ప్రధా నంగా విద్యార్థుల భోజన సరఫరా, సిబ్బంది వేతనాలు, విద్యా కార్యకలా పాలు సజావుగా సాగేందుకు ఇది దోహదం చేస్తుందని అధికవర్గాలు వెల్లడించాయి.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తాం

## మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో మంత్రి దామోదర రాజనర్సింహా సమావేశం

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతున్నదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ధీమా వ్యక్తం చేశారు. పార్టీ, ప్రభుత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహా శనివారం సాయంత్రం బంజారా హిల్స్‌లోని తన నివాసంలో సమావేశం నిర్వహించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, పర్ణికారెడ్డి, రాజేశ్ రెడ్డి, గవినొళ్ల మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అవలంబించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, ప్రచార శైలి, ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లడం, ప్రతిపక్షాల విమర్శలకు ఎప్పటికప్పుడు ధీటుగా బదులివ్వడం, సోషల్ మీడియాలో జరిగే అసత్య ప్రచారాలను ఎదు ర్కొని.. ప్రజలకు నిజాలు తెలియజేయడం వంటి పలు అంశాలు సమావేశంలో చర్చించారు. ఆయా అంశాలపై ఎమ్మెల్యేలు, నాయకులకు మంత్రి దామోదర్ రాజనర్సింహా పలు సూచనలు చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కోసం కష్టపడ్డ కార్య కర్తలకు, నాయకులకు టికెట్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నాయకుల మధ్య సమన్వయ లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరువ చేయాలన్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను బలంగా తిప్పికొడుతూనే, ప్రజలకు వాస్తవాలు తెలిపేలా కార్యకర్తలను సమాయత్తం చేయాలని మంత్రి సూచించారు.

## గోమాతల రక్షణకు స్వచ్ఛంద సంస్థలు ముందడుగేయాలి

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్‌న(కంటోన్మెంట్), అక్టోబరు 4, ప్రభాత వార్త:** గోమాతలకు రక్షణ కల్పించేందుకు, పశువులను సంరక్షించేందుకు గురుగౌతమ్ ముని జైన్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకురావడం అభినందనీయమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సికిందరాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు సంబంధించిన ఎకరం స్థలంలో శనివారం బొల్లారం సమీపంలో గురుగౌతమ్ మునిజైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోశాల, పశువుల ఆస్పత్రి ప్రారంభోత్సవాలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. గోశాల, ఆస్పత్రిని స్థాపించడం అభినందనీ యమన్నారు. ఇలాంటి గోశాల, పశువుల ఆస్పత్రులు నెలకొల్పడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. గోమాతలకు రక్షణ కల్పించేందుకు ముందుకువచ్చిన గౌతమ్ జైన్ ట్రస్ట్‌ను అభినందిం చారు. గోమాతల సంరక్షణ, పశువుల ఆసుపత్రి నిర్మా ణానికి గురుగౌతమ్ మునిజైన్ చారిటబుల్ ట్రస్ట్ నిధులతో చేపట్టి నందుకు వారు అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కంటో న్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్, బోర్డు సిఇఒ మధుకర్ నా యక్, గురుగౌతమ్ మునిజైన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గౌతమ్‌చందు, కటారియా, సంపత్‌రాజ్ జైన్‌కొటారి, మంగళ్‌చంద్ కటారి యా, కంటోన్మెంట్ బోర్డు చీఫ్ ఇంజినీర్ సి.హెచ్. ఉమా శంకర్, శానిటరీ సూపరింటెండెంట్ ఎ.మహేందర్, ఎఇ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



బొల్లారం తుర్కపల్లిలో గోశాల, పశువుల ఆస్పత్రి ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అభ్యర్థి ఎంపికకు బిజెపి త్రిసభ్య కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు అభ్యర్థి ఎంపికలో తలమునకలై ఉన్నాయి. బీజేపి నుంచి పోటీలో నిలిచేందుకు ఆపార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్ రెడ్డి ఆసక్తి చూపుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలైన విష యం తెలిసిందే. అదేవిధంగా ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాం చంద్రారెడ్డి, ఎన్వీ సుభాష్, మాధవీలత టిక్కెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇక్కడ అభ్యర్థి స్థానికత కీ ఫ్యాక్టర్‌గా మారింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర బీజేపీ అధినాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక కోసం నాయకులు, పార్టీ కేడర్ నుంచి అభిప్రానయాలను సేకరించేందుకు త్రిసభ్య కమిటీని నియమించింది. అందులో మాజీ ఎమ్మెల్యే ఎం. ధర్మారావు, మాజీ ఎంపీ పోతుగంటి రాములు, పార్టీ సీనియర్ నేత, అడ్వొ కేట్ కోమల ఆంజనేయులు ఉన్నారు. వారు ఇచ్చే నివేదిక ఆధారంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వ హించి జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు అభ్యర్థిని ఖరారు చేయనున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ పార్టీ నుంచి దివంగత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత ఉప ఎన్నికల బరిలో నిలుస్తుందని ఇప్పటికే గులాబీ బాస్ ప్రకటిం చారు. ఇక అధికార కాంగ్రెస్ పార్టీలో నవీన్ యాదవ్, అంజన్ కుమార్ యాదవ్, మైనంపల్లి హనుమంతరావు, బొంతు రామ్మోహన్ పోటీకి ఆసక్తి చూపుతున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ ఈ నెల 6న స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించి అభ్యర్థుల జాబితాను ఖరారు చేయనున్నారు.

## ఉపముఖ్యమంత్రి భట్టితో డిజిపి శివధర్‌రెడ్డి భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్కను డిజిపి శివధర్‌రెడ్డి కలిశారు. డిజిపిగా ఈ నెల 1న బాధ్యతలు చేబట్టిన శివ ధర్‌రెడ్డి ప్రజాభవన్‌లో శనివారం భట్టి విక్ర మార్కను మర్యాద పూర్వకంగా కలిశారు.



## పత్తిని దెబ్బతీస్తున్న వాతావరణ మార్పులు

### దిగుబడిపై తీవ్రప్రభావం

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పత్తి రైతులకు కష్టాలు తప్పడం లేదు. వాతావరణ మార్పుల ప్రభావం పత్తి పంటపై తీవ్రంగా చూపుతోంది. ఇటీవల కురిసిన వర్షాలు, తాజాగా పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో వాతావరణంలో ఏర్పడిన మార్పులు రైతుల పాలిట శాపంగా పరిణమించాయి. ఫలితంగా పత్తి చేలకు రసం పీల్చే పురుగులు, పచ్చ, తెల్ల దోమ, నల్లితో ఆకుముడత, పండాకు, ఎండాకు వంటి లపు తెగుళ్లు విజృంభిస్తున్నాయి. పత్తి పూత, పిందె రాలిపోతుండడటంతో పాటు, కాయలు నల్లబారుతున్నాయి. చేతికొచ్చిన పత్తి వర్షాలు, ఎండలకు నాణ్యత పడిపోవడంతో పాటు, వేరుకుళ్లుతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా నల్లమట్టి భూముల్లో వీటి ప్రభావం అధికంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఇప్పటికే ఎకరానికి 30 నుండి 40 వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని, వాతావరణంలో మార్పులతో దిగుబడి తగ్గిపోయి, నష్టపోతున్నట్లు పలువురు రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మరోపక్క రాష్ట్రంలో పత్తి సాగు పడిపోయింది. వ్యవసాయ శాఖ నిర్దేశించిన లక్ష్యం కాదు కదా, కనీసం సాధారణ విస్తీర్ణం కంటే కూడా భారీగా పడిపోయింది. ఈ వానాకాలం సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో పత్తి సాధారణ విస్తీర్ణం 50.48 లక్షల ఎకరాలు కాగా ఈ సీజన్‌లో తెలంగాణ వ్యాప్తంగా 45.85 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది.

## న్యాయవాదులకు రక్షణ చట్టానికి కేంద్రం యోచన

### బిజెపి లీగల్‌సెల్ స్టేట్ కన్వీనర్ గోకుల్ రామారావు

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకుని రావాలని కేంద్రం ఆలోచిస్తుందని బిజెపి లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్‌గోకుల్ రామారావు పేర్కొన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బిజెపి లీగల్ సెల్ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ హాజరరయ్యారని, ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మాట్లాడారని తెలిపారు. గత 75 సంవత్సరాలలో జరగని విధంగా న్యాయవాదుల డిమాండ్స్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరఫున స్టేట్ బార్ కౌన్సిల్స్ ద్వారా ప్రతిపాదనలను, దేశవ్యాప్తంగా న్యాయవాదులకు సంబంధించిన సమస్యలను స్పష్టంగా వెల్లడించారన్నారు. బీమా, మెడికల్ ఇన్సూరెన్స్ త్వరలో అందరికీ లభిస్తుందని కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ చెప్పారని, ఇది హర్షణీయం అన్నారు.

దేశంలో న్యాయవాదులపై పెరుగుతున్న దాడులను అరికట్టడానికి అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అవసరమని తాము వినతిపత్రం ఇచ్చామన్నారు. దీనికి కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లా కమిషన్ రిపోర్ట్ వచ్చిన వెంటనే చట్టం అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారని, ఈ సమావేశం ద్వారా కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల భద్రత, ఆర్థిక సాయం, ప్రొటెక్షన్ చట్టం అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడానికి ముందడుగు వేసిందన్నారు. ఇది న్యాయవాదులకు ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు.

అలాగే జూనియర్ న్యాయ వాదులకు స్టైఫండ్‌పై కూడా కేంద్ర ప్రభుత్వానికి విన్నవించామన్నారు. ఈ స్కీమ్ ద్వారా న్యాయవాదుల కుటుంబ సభ్యులు కూడా మేలు జరుగుతుంది. ప్రస్తుతం, 50,000 అడ్వకేట్లలో కేవలం సగానికి మాత్రమే స్టేట్ వెల్ఫేర్ ట్రస్ట్ ఇన్సూరెన్స్ ద్వారా అందుతుందని, మిగతా వారి రీన్యూవల్, కొత్తగా కవర్ చేయడం జరగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 100 కోట్లు విడుదల చేసి, న్యాయవాదులకు సమా నంగా ఇన్సూరెన్స్ అందించాలన్నారు. హైకోర్ట్, డిస్ట్రిక్ట్ కోర్ట్స్, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యు నల్స్‌లోని స్టాండింగ్ కౌన్సిల్స్ తక్షణమే అపాయింట్ చేస్తామని కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ హామీ ఇచ్చారన్నారు.

## బస్తీ దవాఖానాలకు సుస్తీ

### పేదలకు వైద్యం ఇవ్వాలన్నదే కెసిఆర్ లక్ష్యం

### మాజీమంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి

### కొత్తపేట టిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన బిఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), అక్టోబరు 4, ప్రభాత వార్త:** ప్రజలకు మంచి వైద్యం అందాలన్నదే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుదీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్‌తో కలసి హరీశ్‌రావు శనివారం కొత్తపేటలోని గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ (టిమ్స్) పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పదివేల పడుకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉండాలని 100 సంవత్సరాల ముందు చూపుతో ప్రణాళికలు రచించి ఆచరణలో పెడుతూ నగరం నలుమూలల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆస్పత్రుల పనులను పూర్తి చేయకుండా వాటిని నిలిపివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 33 జిల్లాలలో 33 ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఘనత కేసిఆర్కే దక్కుతుం దన్నారు. పేదలకు విద్యా, వైద్యం అందాలని కెసిఆర్ ఎంతో తపించిపో యా రన్నారు. 2023లో రూ. 176 కోట్లతో మహేశ్వరం నియో జకవర్గం లో మెడికల్ కళాశాల మంజూరి చేస్తే అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి పనులకు శంకు స్థాపన కూడా చేయడం జరిగింద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆ మెడికల్ కళాశాలను రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్ నాయకుల తప్పుడు చర్యల వల్ల రాష్ట్ర ప్రజలకు తీవ్ర నష్టం జరుగు తుందన్నారు. రేవంత్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ ఆసుపత్రుల పనులు పూర్తి చేయడం చేయడంలో విఫల మయ్యారన్నారు. మీ రాజకీయాల కోసం ఆసుపత్రుల నిర్మాణం ఆపొద్దు, వరంగల్ హెల్త్ సిటీ, హైదరాబాద్ టిమ్స్ ఆసుపత్రులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మీ వ్యక్తిగత రాజకీయాల కోసం చెలగాటం ఆడవద్దని హెచ్చరించారు. లేదంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని అన్నారు. రేవంత్ పుణ్యమా అని బస్తీ దవాఖానాలో పనిచేసే డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఉద్యోగులకు ఆరు నెలల నుంచి జీతాలు లేవని, కేసీఆర్ ప్రారంభించిన బస్తీ దవాఖానలు మూత పడాలన్నదే రేవంతు లక్ష్యమా అని ప్రశ్నించారు.



ఆస్పత్రిని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి మహేశ్వరం నియోజకవర్గం మురుకుంట్ల అరవింద్, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, కొత్తపేట బీఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో విజయానికి కాంగ్రెస్ వ్యూహం

### రంగారెడ్డి ఇన్‌ఛార్జిలతో శ్రీధర్‌బాబు సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 4:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో తమ సత్తా చూపించాలని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాలను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల ఇంఛార్జిలతో సమావేశాన్ని నిర్వహించారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యక సీట్లను పొందేందుకు కేడర్ కృషి చేయాలని శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ సమన్వయ లోపం రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, గత ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ప్రతి నియోజకవర్గంలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించిన తర్వాతే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఆయన అన్నారు. అభ్యర్థుల ఎంపికపై ఎమ్మెల్యేలు, ఇంఛార్జిల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని, అయితే తుది నిర్ణయం మాత్రం పార్టీ అధిష్ఠానం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ బలం, బల హీనతలు, గత ఎన్నికల ఫలితాలపై సమీక్ష చేయాలని ఆయన సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రంగారెడ్డి డీసీసీ ప్రెసిడెంట్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి(ఇబ్రహీంపట్నం), టి. రామ్మోహన్ రెడ్డి(పరిగి), కసిరెడ్డి నారాయణ రెడ్డి (కల్వకుర్తి), కె.శంకరయ్య (షాద్‌నగర్), బి. మనోహర్‌రెడ్డి (తాండూర్), కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీలు కేఎల్ఆర్ (మహేశ్వరం), భీం భరత్ (చేవెళ్ల) తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో తగ్గిన జిఎస్టీ ఇన్‌కమ్

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయం పెరగాల్సి ఉండగా, తగ్గుదల చోటు చేసుకుంది. గత నెలలో జీఎస్టీ కింద ఖజానాకు 4,998 కోట్ల రూపాయలు సమకూరాయి. ఇది ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో 5 వేల కోట్ల కు తక్కువగా రావడం విశేషం. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో అత్యధికంగా 6,983 కోట్ల రూపాయలు జీఎస్టీ కింద రాబడులు సమకూరగా, మే నెలలో 5,310 కోట్ల రూపాయలు, జూన్‌లో 5,200 కోట్ల రూపాయలు, జూలైలో దాదాపు 5,500 కోట్ల రూపాయల మేర ఆదాయం వచ్చింది. అయితే అగస్టు, సెప్టెంబరు నెలల్లో మాత్రం తగ్గుదల నమోదైంది. ఇక గత ఏడాది సెప్టెంబరు నెలతో పోలిస్తే ఈ సారి 269 కోట్ల రూపాయల చొప్పున జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయంలో కోత పడింది. గత యేడాది సెప్టెంబరు నెలలో 5,267 కోట్ల రూపాయలు మేర ప్రభుత్వ ఖజానాకు చేరింది.




శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పిసిసి మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

## ప్రశాంత్‌కిషోర్ పొలిటికల్ ప్రిపేయిడ్ రిచార్జ్!

### పిసిసి మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ప్రశాంత్ కిషోర్ ఒక రాజకీయ చోర్, మాటలకే పరిమితం అని టిపిసిసి మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రశాంత్‌కిషోర్ ప్రిపేయిడ్ రిచార్జ్ లాంటి వాడని, ఎంత రిచార్జ్ చేస్తే అంత టాక్ టైం అన్నారు. అంతకుమించి కాదు అన్నారు. బీహార్ ప్రజల సంక్షేమం కోసం తన 50 ఏళ్ల జీవితంలో కనీసం 15 నిమిషాలు మాట్లాడిని పాపాన పోలేదని, బీహార్ కోసం ఆయన ఏనాడు పనిచేయలేదన్నారు. ఇతర నేతల పక్షాన టాక్‌టైమ్‌లా ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతాడు అన్నారు. అలాంటి వ్యక్తిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు, ఎన్నికల వ్యూహకర్తగా కోట్లు సంపాదించాడే తప్ప పార్టీలను ఆయన గెలిపించి లేదన్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అంత సీన్ ప్రశాంత్ కిషోర్‌కు లేదన్నారు. రేవంత్ రెడ్డి కుటుంబానికి ఏలాంటి రాజకీయ నేపథ్యం లేదు, సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి అని, తెలంగాణ ప్రజల ఆశీర్వాదం, విశ్వాసంతో సిఎం అయ్యారన్నారు. ఒక రోల్ మోడల్ సిఎంగా తెలంగాణలో ప్రజా పాలన అందిస్తున్నారు. ఇప్పుడ దేశం మొత్తం తెలంగాణ వైపునకు చూస్తుందని, రేవంత్ రెడ్డిదమ్ము, ధైర్యం తెలంగాణ ప్రజలు. ప్రజలతో మమేకమై పాలన చేయడంలో ప్రత్యేకం అన్నారు. తెలంగాణలో నివసిస్తున్న బీహార్ ప్రజలు ఎవరిని అడిగినా ఇదే విషయం చెబుతారు. ఈ రాష్ట్రం ఆ రాష్ట్రం అన్న భేదభావం లేకుండా తెలంగాణలో ఉన్న అన్ని రాష్ట్రాల ప్రజలను సమభావంతో చూసే వ్యక్తి రేవంత్ రెడ్డి అని, ప్రజలను తన గుండెల్లో పెట్టుకుని చూసే నాయకుడని, అలాంటి వ్యక్తి గురించి ప్రిపేయిడ్ రిచార్జ్ ప్రశాంత్ కిషోర్ మాట్లాడటం పెద్ద జోక్‌గా ఉందన్నారు.

## వెంకటేష్‌తో శంకర వర ప్రసాద్ గారి విమాన ప్రయాణం



తాజాగా మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ కలిసి ఉన్న ఫోటో సోషల్ మీడియాలోవైరల్అవుతోంది. వారిద్దరు కలిసి చెన్నైలో 80 రీయూనియన్ కోసం విమానంలో ప్రయాణించారు. చార్టర్డ్ ఫ్లైట్‌లో చెన్నై బయలుదేరే ముందు వారిద్దరు కలిసి ఓ ఫొటోకు పోజిచ్చారు. ఇక సినిమాల విషయంలో చిరంజీవి హీరోగానటిస్తున్న మన శంకర వరప్రసాద్ గారు మూవీలో విక్టరీ వెంకటేష్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు.

# తెర




# నిజాయితీగా ఓ మంచి సినిమాను చేశా
## ప్రెస్‌మీట్‌లో హీరో రక్షిత్ అట్లూరి



'శశివదనే' క్లైమాక్స్ అందరినీ సర్ ప్రైజ్ చేసేలా చాలా కొత్తగా ఉంటుంది. ప్రెస్ మీట్‌లో హీరోయిన్ కోమలి ప్రసాద్.'శశివదనే' ఏ ఒక్కరిని కూడా నిరాశ పర్చదు.. ప్రెస్ మీట్‌లో నిర్మాత అహితేజ బెల్లంకొండ. రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా నటించిన చిత్రం 'శశివదనే'.గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్స్ కంపెనీ, ఎస్.వి.ఎస్ స్టూడియోస్ బ్యానర్స్‌పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల సినిమాను నిర్మించారు. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. అక్టోబర్ 10న రిలీజ్ కానున్న ఈ మూవీ శనివారం నాడు మీడియా ముందుకు వచ్చింది. ఈ మేరకు నిర్వహించిన ఈవెంట్‌లోహీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ,నాకు మూడేళ్ల క్రితం తేజ ఈ కథ గురించి చెప్పారు. సాయి చెప్పిన కథ మొదట్లో నాకు నచ్చలేదు. ఆయనేం చెబుతున్నాడో కూడా అర్థం కాలేదు. కథగా అయితే అర్థంకాలేదు కానీ ఆయన చెప్పిన సీన్లు నచ్చాయి. ఆయన తీసినషార్ట్‌ఫిల్మ్స్ కూడాచూశాను. ఇందులోఆయన రాస ుకున్న ట్టుగా ఫాదర్ అండ్‌సన్ ఎమోషనల్ సీన్స్ ఇంత వరకు తెలుగులోరాలేదు.శ్రీమాన్‌చేసినపాత్ర అందరికీ గుర్తుండి పోతుంది. సినిమాచాలా బాగావచ్చింది. గోదావరి జిల్లాల్ని అద్భుతంగా చూపించిన సాయికుమార్ పనితనం గురించి అందరూ చెప్పుకుంటారు.

గౌరీక్యాస్ట్యూమ్స్,శర్వామ్యూజిక్,అనుదీప్ఆర్ఆర్అన్నీ అద్భుతంగా కుదిరాయి.కోమలి అద్భుతమైన నటి.తేజకి,అభిలాష్‌కి మంచి సక్సెస్ రావాలి. సాయికి డైరెక్టర్‌గా మంచి పేరు రావాలి. కెమెరామెన్ సాయికి ఆల్రెడీ ప్రశంసలు వస్తున్నాయి. అశ్లీలతకు తావు లేకుండా నిజాయితీగా ఓ మంచి సినిమాను చేశాం. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఆనందంతో బయటకు వస్తారు. ఏ ఒక్కరినీ నిరాశ పర్చదు అని మాత్రం చెప్పగలను. అక్టోబర్ 10న మా చిత్రం రాబోతోంది. అందరూచూడండి అనిఅన్నారు .డైరెక్టర్‌సాయిమోహన్ మాట్లాడుతూ, నేను ఇండస్ట్రీలోకి రావాలన్నది మా నాన్న కల, కోరిక. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన తేజకి, గౌరీకి థాంక్స్. రక్షిత్ ఓ పది రోజుల షూటింగ్ తరువాత నన్ను చాలా గట్టిగా నమ్మారు. శశివదనే సినిమాను మీడియా ముందుకు తీసుకు వెళ్తోంది. సాయికుమార్ నాకు మంచి విజువల్స్ ఇచ్చారు. నేను రాసుకున్న కథను అందమైన పెయింటింగ్‌లా మార్చాడు. శర్వా, అనుదీప్ నాకు మంచిమ్యూజిక్,ఆర్ఆర్ ఇచ్చారు. నేను ఎంత అందంగా రాసుకున్నానో.అంతకుమించి అనేలా కోమలి నటించారు. కథ చెప్పిన వెంటనే శ్రీమాన్ ఓకే చేశారు. ఆయన చేసిన సింగిల్ షాట్ సీన్ గురించి అందరూ చెప్పుకుంటారు. గ్యారీ ఎడిటింగ్ అందరికీ నచ్చుతుంది. అక్టోబర్ 10న మా చిత్రం రాబోతోంది.అందరూ చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను అనిఅన్నారు. నిర్మాత అహితేజ మాట్లాడుతూ,శశివదనే కోసంమేం ఎంతకష్టపడ్డా కూడా ఆడియెన్స్‌కి మంచి అనుభూతిని ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. మాకు ముందు నుంచీ కూడా మీడియా ఫుల్‌సపోర్ట్ఇచ్చింది.ఈ మూవీ ఏ ఒక్కరినీ కూడా నిరాశపర్చదు. నాకు అంతగా అనుభవం లేకపోవడంతోనే రిలీజ్‌లో జాప్యం కలిగింది. కంటెంట్ మీద మా అందరికీ నమ్మకం ఉంది. సినిమా పూర్తికాకముందే అన్ని రైట్స్ అమ్ముడుపోయాయి. నన్నునమ్మిన డిస్ట్రిబ్యూటర్లందరికీ ధన్యవాదాలు. మామూవీ ట్రైలర్ అందరికీ నచ్చింది.శశివదనేలాంటి క్లైమాక్స్‌ను నాకు తెలిసినంత వరకు అయితే తెలుగులోఇంత వరకు చూడలేదు.నాకుఈ ప్రయాణంలో సపోర్ట్‌గా నిలిచిన ఎస్‌కేఎన్‌కి, సీడెడ్ డిస్ట్రిబ్యూటర్ అనీష్, డైరెక్టర్ యోగి అన్నకి, అండగా ఉన్న మీడియాకి, మా పీఆర్ టీంకి థాంక్స్అని అన్నారు.హీరోయిన్ కోమలి ప్రసాద్ మాట్లాడుతూ, శశివదనే నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. నేను ఇందులో పోషించిన పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ టీంలోని చాలా మంది కొత్త వారే. అందరూ ప్రాణం పెట్టి పని చేశారు. అక్టోబర్ 10న మా చిత్రం రాబోతోంది. క్లైమాక్స్ చాలా కొత్తగా ఉంటుంది. థియేటర్లో అందరినీ మా సినిమా కచ్చితంగా సర్ ప్రైజ్ చేస్తుంది అని అన్నారు. కెమెరామెన్ సాయి కుమార్ మాట్లాడుతూ, గత నెలలో నా 'బ్యూటీ' చిత్రం వచ్చింది. కానీ నాకు టెక్నికల్‌గా ఇదే మొదటి చిత్రం. ఈ మూవీలో రాసినట్టుగా ఈ చిత్రం కోసం మేమంతా ఓ యుద్ధం చేశాం. నన్ను మా అహితేజ చాలా నమ్మారు. రక్షిత్ మా అందరికీ ఎంతో సపోర్ట్ ఇచ్చారు. రక్షిత్‌కి గాయాలైనా కూడా షూటింగ్ కంటిన్యూ చేయడం గ్రేట్. కోమలి అద్భుతంగా నటించారు. గౌరీ క్యాస్ట్యూమ్స్, కలర్ ప్యాలెట్ గురించిఅందరూగొప్పగా చెబుతున్నారు. సాయి మోహన్ ఈ మూవీ కోసం ఎంతోకష్టపడ్డారు. శశి వదనే విజువల్స్ చూసిన తరువాతే నాకు అందరూ అవకాశాన్ని ఇచ్చారు అని అన్నారు.ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్ మాట్లాడుతూ, శశివదనే టీం చాలా కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించింది. గౌరీ, అహితేజ ఎంతో ప్యాషనేట్‌గా ఈ మూవీని నిర్మించారు. ట్రైలర్ అందరికీ రీచ్ అయింది. దర్శకుడు, రక్షిత్, కోమలి, టీం ఇలా అందరికీ ఈ సినిమా మంచి పేరు తీసుకురావాలి అని అన్నారు.నటి అంబికా మాట్లాడుతూ,శశి వదనే కోసం మేమంతా ఎంతో కష్టపడ్డాం. మా కష్టానికి తగ్గ ప్రతిఫలం అక్టోబర్ 10న వస్తుందని ఆశిస్తున్నాను. మా అందరికీ ఆడియెన్స్ నుంచి సపోర్ట్ లభించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. నటీనటులు :రక్షిత్అట్లూరి,కోమలిప్రసాద్, శ్రీమాన్, దీపక్ ప్రిన్స్, జబర్దస్త్‌బాబీ తదితరులు. సాంకేతికబృందం:బ్యానర్:ఏజీ ఫిల్మ్‌కంపెనీ, ఎస్‌వీఎస్‌స్టూడియోస్,సమర్పణ:గౌరీనాయుడు,నిర్మాతలు: అహితేజ బెల్లంకొండ,అభిలాష్ రెడ్డిగోదాల,దర్శకుడు : సాయి మోహన్ ఉబ్బన, సంగీత దర్శకుడు: శరవణ వాసుదేవన్, నేపథ్య సంగీతం :అనుదీప్ దేవ్, కెమెరామెన్ :శ్రీ సాయికుమార్ దారా, ఎడిటర్ : గ్యారీ బీహెచ్, కాస్ట్యూమ్ డిజైనర్ : గౌరీ నాయుడు, పీఆర్వో : నాయుడుసురేంద్ర కుమార్, ఫణి కందుకూరి (బియాండ్ మీడియా), మార్కెటింగ్ : విష్ణు తేజ పుట్టా (క్రాస్ క్లిక్ మార్కెటింగ్)

# అఖండ 2: తాండవం
## డిసెంబర్ 5న థియేట్రికల్ రిలీజ్



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను, రామ్ ఆచంట, గోపి ఆచంట, 14 రీల్స్ ప్లస్, ఎం తేజస్విని నందమూరి ప్రజెంట్స్ అఖండ 2: తాండవం డిసెంబర్ 5న థియేట్రికల్ రిలీజ్'గాడ్ ఆఫ్ ది మాసెస్' నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను డైనమిక్ అండ్ పవర్ ఫుల్ ఫోర్త్ కొలాబరేషన్ లో మోస్ట్ అవైటెడ్ హైఆక్టేన్ సీక్వెల్ 'అఖండ 2: తాండవం' పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది.14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను ఎం తేజస్విని నందమూరి సగర్వంగా సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన అఖండ 2 టీజర్ భారీ బజ్ క్రియేట్ చేసి అభిమానులను ఉర్రూతలూగించింది. మేకర్స్ మరింత ఎక్సయిట్మెంట్ క్రియేట్ చేస్తూ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. అఖండ 2: తాండవం డిసెంబర్ 5, 2025న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సీక్వెల్ ఒక గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. బోయపాటి శ్రీను బిగ్గెస్ట్ కాన్వాస్‌పై లార్జర్ దెన్ లైఫ్ మూవీ రూపొందిస్తున్నారు.రిలీజ్ డేట్ పోస్టర్‌లో బాలకృష్ణ లాంగ్ హెయిర్, రగ్గడ్ బీర్డ్‌తో పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. మెడ నిండా పవిత్ర మాలలు, ఆభరణాలు, చేతిలో భారీ త్రిశూలం, కాషాయం, గోధుమరంగు సంప్రదాయ దుస్తులు ఆయన లుక్‌కి మైథాలజికల్, డివైన్ వైబ్ జోడించాయి. మంచుతో నిండిన ప్రకాశవంతమైన బ్యాక్‌డ్రాప్‌లో కనిపించిన లుక్ అదిరిపోయింది.ఎస్. థమన్ అందిస్తున్న పవర్ ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకి హై వోల్టేజ్ ఎనర్జీ అందించబోతోంది. అభిమానులు, మాస్ ఆడియెన్స్ బాలయ్య డివైన్ ఫెరోషియస్ అవతార్ కట్టిపడేసింది.కొత్త రిలీజ్ డేట్‌తో ప్రమోషన్స్‌కు టీమ్‌కు మరింత సమయం దొరికింది. రెగ్యులర్ అప్‌డేట్స్, సర్ప్రైజ్‌లతో అలరించేలా ప్లాన్ చేస్తున్నారు.



# హీరో సాగర్ పాన్ ఇండియా చిత్రం..
## త్వరలోనే షూటింగ్ ప్రారంభం..

ది 100 సినిమాతో రీసెంట్‌గా హిట్ కొట్టిన హీరోసాగర్ మరో వినూత్న ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల్ని అలరించేందుకు రెడీ అవుతున్నారు. సింగరేణి కార్మికుల జీవితాల్ని తెరపైకి తీసుకు వచ్చేందుకు సాగర్ ముందడుగు వేశారు. పాన్ ఇండియా వైడ్‌గా ఈ మూవీని ప్లాన్ చేస్తున్నట్టుగా ప్రకటించారు. సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో చాలా తక్కువ చిత్రాలు వచ్చిన సంగతి తెలిసిందే.సింగరేణి కార్మికుల దుర్భలమైన జీవితాలు, వారి కష్టాల్ని తెరపై ఆవిష్కరించేందుకు జార్జి రెడ్డి దర్శకుడు జీవన్ రెడ్డి ముందుకు వచ్చారు. జార్జి రెడ్డి చిత్రంతో మేకర్‌గా జీవన్ రెడ్డికి మంచి ఇమేజ్ వచ్చిన సంగతి తెలిసిందే. మరోసారి తెలంగాణ నేపథ్యంలోని సింగరేణి బ్యాక్ డ్రాప్‌పై సినిమాను తెరకెక్కించేందుకు సిద్ధమయ్యారు. సింగరేణి బొగ్గు గనుల కార్మికుల కష్టాలు, పోరాటాలు, ఆశలు, అనుబంధాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం భారతదేశ సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని ఇవ్వడం ఖాయమని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు. మైనింగ్ ప్రాంతాల కఠినమైన వాతావరణం, కార్మికుల దినచర్య, వారి త్యాగాలు వంటి అంశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని చెబుతున్నారు. దసరా సందర్భంగా ఈ మూవీకి సంబంధించిన ప్రకటన చేశారు. ఈ మూవీలో హీరోగా సాగర్ నటించనున్నారు. ముఖ్య పాత్రలో ప్రముఖ స్టార్ హీరోని తీసుకోబోతోన్నారని సమాచారం. ఈ స్పెషల్ కారెక్టర్ సినిమాకే స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుందని సమాచారం. తెలుగు, కన్నడ, తమిళ, హిందీ భాషల్లోని ప్రముఖ నటుల్ని ఈ చిత్రం కోసం తీసుకోనున్నారు.

# 'మారియో'నుంచి అద్భుతమైన పోస్టర్



నాటకం తీస్ మార్ ఖాన్ వంటి డిఫరెంట్ చిత్రాలతో దర్శకుడిగా కళ్యాణ్ జీ గోగణ మంచి పేరు సంపాదించుకున్నారు. ఇక దసరా సందర్భంగా ఆయన తదుపరి చిత్రం 'మారియో' నుంచి అప్డేట్ ఇచ్చారు. మారియో నుంచి అద్భుతమైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌తోఅందరినీ అలరించారు. ఈరోజు విడుదలైన ఈపోస్టర్ ఎటర్నో చార్జ్ ర్యాంప్‌రైడ్' అనే ట్యాగ్‌లైన్‌తో అందరినీ ఆశ్చర్యపరిచింది. యాక్షన్‌ప్యాక్డ్, స్టైలిష్, రొమాంటిక్‌వైబ్‌తో ఈ పోస్టర్‌ఇట్టేట్రెండ్ అవుతోంది. ఫస్ట్ లుక్‌లో హీరో అనిరుధ్, హెబ్బా పటేల్ పెట్టిన పోజుతోమధ్యఉన్నకెమిస్ట్రీఅర్థం అవుతుంది. అనిరుధ్ రైఫిల్‌పట్టుకుని ఉన్న తీరు, ఇంటెన్స్ లుక్ చూస్తుంటే హై ఓల్టేజ్ యాక్షన్ సీన్స్ ఉండేలా కనిపిస్తున్నాయి. హెబ్బా పటల్ ఎరుపురంగు దుస్తుల్లో డైనమిక్‌గా కనిపిస్తున్నారు.

క్లాసిక్ కారు, చీకటి, వర్షం ఇలా అన్నింటినీ చూస్తుంటే థ్రిల్లర్ థీమ్‌ను సూచిస్తుంది. సీట్ ఎడ్జ్ థ్రిల్ కలిగించేలా అన్నిరకాల కమర్షియల్ అంశాలను తగినంత వినోదంతో మిళితం చేసే చిత్రాన్ని అందించనున్నారు.సిల్వర్ స్క్రీన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో 'మారియో' చిత్రాన్ని నిర్మిస్తుండగా రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. గత చిత్రాలలో కామెడీ, థ్రిల్‌ను విజయవంతంగా మిళితం చేసిన దర్శకుడు కళ్యాణ్‌జీ గోగణ ఈసారి సినిమాటిక్ అనుభవాన్ని అందించబోతున్నారు.ఈ చిత్రానికి సాయి కార్తీక్, రాకేందు మౌళి సంగీతాన్ని అందిస్తున్నారు. పాటలు, మాటలు రాకేందు మౌళి సమకూరుస్తున్నారు. కథ, సంభాషణలను అభివృద్ధి చేయడంలో రాకేందు మౌళి కూడా గోగణకు మద్దతు ఇచ్చారు. లీవిరెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, మణికాంత్, మదీ మన్నెపల్లి ఎడిటర్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పూర్తి స్థాయి నిర్మాణంలో ఉంది. ఈ పండుగ సీజన్‌లో ఫస్ట్ లుక్ పోస్టర్ ఖచ్చితంగా సంచలనాన్ని సృష్టించిందనే చెప్పొచ్చు.తారాగణం: అనిరుధ్, హెబ్బాపటేల్, రాకేందు మౌళి, మోర్య సిద్ధవరం, యష్నా ముతులూరి, కల్పిక గణేష్, మదీ మన్నెపల్లి, లతా రెడ్డి తదితరులు.

# 'అనుమాన పక్షి', టైటిల్, ఫస్ట్‌లుక్ మోషన్



దర్శకుడు విమల్ కృష్ణ 2022లో డిజె టిల్లుతో అద్భుతమైన అరంగేట్రం చేశాడు. ఈ చిత్రం భారీ విజయాన్ని సాధించింది. ఆ పాత్ర తెలుగు రాష్ట్రాల్లో ఇంటి పేరుగా మారింది. ఇప్పుడు విమల్ కృష్ణ మరోసారి సర్ ప్రైజ్ చేయడానికి రెడీ అయ్యారు. ఈసారి డిఫరెంట్ స్టయిల్‌లో మరొక విచిత్రమైన పాత్రను పరిచయంచేశాడు. అతని అప్ కమింగ్ ప్రాజెక్ట్‌ను చిలకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది, ఇది ఆ ఒక్కటి అడక్కు వంటి చిత్రాల తర్వాత బ్యానర్ నాల్గవ వెంచర్. రాజీవ్ చిలకా, రాజేష్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. ట్యాలెంటెడ్ రాగ్ మయూర్ హీరోగా నటిస్తుండగా, మెరిన్ ఫిలిప్ హీరోయిన్. దసరా శుభ సందర్భంగా, నిర్మాతలు తమ అప్ కమింగ్ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.'అనుమాన పక్షి' అనే టైటిల్ రాగ్ మయూర్ పాత్ర విచిత్రమైన స్వభావాన్ని సూచిస్తుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ ఒక కామిక్ పుస్తక బ్యూటీని కలిగి ఉంది, రంగురంగుల ఆలోచన బుడగలు ఆఫ్‌బీట్, హిలేరియస్ ప్రశ్నలు సినిమా యూనిక్ నెస్ ని ప్రజెంట్ చేస్తోంది. మోషన్ పోస్టర్‌లోని విజువల్స్, శ్రీ చరణ్ పాకాల సంగీతం ఎంటర్‌టైమెంట్ డబుల్ చేశాయి. ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ ఈ కంప్లీట్ ఎంటర్‌టైనర్‌లో కీలక పాత్రలు పోషిస్తున్నారు.సునీల్ కుమార్ నామా సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, జెకె మూర్తి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అభినవ్ కునపరెడ్డి ఎడిటర్.అనుమాన పక్షి త్వరలో థియేటర్లలో విడుదల కానుంది.తారాగణం: రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, సుప్రీత్‌సాంకేతిక సిబ్బంది: రచన,దర్శకత్వం: విమల్‌కృష్ణ, నిర్మాతలు: రాజీవ్ చిలక, రాజేష్ జగ్తియాని, హీరాచంద్ దండ్, సహనిర్మాత, భరత్‌లక్ష్మీపతి, ప్రొడక్షన్ హౌస్ చిలక .

# 'మహాశక్తి'పవర్ ఫుల్
## ఫస్ట్ లుక్ రిలీజ్



నయనతార లీడ్‌రోల్‌లో సుందర్‌సిదర్శకత్వంలో తమిళ చిత్రపరిశ్రమలోని ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలలో ఒకటైన వెల్స్ ఫిల్మ్ ఇంటర్నే షనల్, ఐవీఎంటర్‌టైన్ మెంట్‌తో కలిసి బిగ్గెస్ట్‌పాన్ ఇండియా ఎంటర్ టైనర్‌లలో ఒకటైన' మూకుతి అమ్మన్2'ను నిర్మిస్తోంది. అవ్ని సినిమాక్స్ (పి) లిమిటెడ్, రౌడీ పిక్చర్స్ సహ నిర్మాతలు. మూకుతి అమ్మన్ పార్ట్ 1 భారీ విజయాన్ని సాధించింది, తెలుగు డబ్బింగ్‌వెర్షన్ అమ్మోరు తల్లికిబ్లాక్ బస్టర్‌రెస్పాన్స్ లభించింది. దసరాశుభ సందర్భంగా 'మూకుతి అమ్మన్ 2' తెలుగు టైటిల్ ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి మహాశక్తి అనే టైటిల్ పెట్టారు. నయనతారని అమ్మవారి రూపంలో ప్రజెంట్ చేసిన ఫస్ట్ లుక్ పవర్ ఫుల్‌గా వుంది. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ డాక్టర్ ఇషారి కె గణేష్ ఐవీ ఎంటర్‌టైన్ మెంట్‌తో కలిసి మూమహాశక్తిని భారీస్థాయిలో విజువల్ వండర్‌గా నిర్మిస్తున్నారు. 'మూకుతి అమ్మన్ 2' అన్ లిమిటెడ్ నవ్వులతో కూడిన ఎక్సయిటింగ్ కథాంశంతో వుంటుంది. సుందర్ సి, నయనతార తొలిసారి కలిసి నటిస్తున్న చిత్రం కావడంతో అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి.నయనతార లీడ్ రోల్ లో నటిస్తుండగా, దునియావిజయ్,రెజీనా కాసాండ్రా,యోగి బాబు,ఊర్వశి,అభినయ, రామచంద్రరాజు, అజయ్‌ఘోష్, సింగం పులి, విచ్చు విశ్వనాథ్, ఇనియా, మైనా నందిని ఈ చిత్రంలో ప్రముఖ పాత్రలు పోషిస్తున్నారు.ఈచిత్రానికి హిప్‌హాప్‌ఆదిసంగీతం అందిస్తున్నారు. గోపీఅమర్‌నాథ్ సినిమాటోగ్రాఫర్, ఫెన్నీ ఆలివర్ ఎడిటర్. వెంకట్ రాఘవన్ సంభాషణలు అందిస్తున్నారు, గురురాజ్ ఆర్ట్ వర్క్‌లను పర్యవేక్షిస్తున్నారు. రాజశేఖర్ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రఫీ చేస్తున్నారు.మహాశక్తి ఎక్సయిటింగ్ యాక్షన్, బలమైనకథాంశం,అన్ లిమిటెడ్ నవ్వులతో కూడిన పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. ఈ చిత్రం అన్ని దక్షిణ భారత భాషలు, హిందీలో పాన్ ఇండియా విడుదల కానుంది.

# 'ప్రేమకు నమస్కారం' లో
## పవర్‌ఫుల్ పాత్రలో శివాజి



న్యూకాన్సెప్ట్ చిత్రాలను, కొత్తతరహా న్యూ ఏజ్ చిత్రాలనుఆదరించడంలో తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారు. ఇటీవల వచ్చిన ఆ తరహాచిత్రాల విజయాలే అందుకు ఉదాహరణ. ఇకప్రస్తుతం సోషల మీడియాలో, యూట్యూబ్‌లో సన్సేషన్ సృష్టించిన వారు వెండితెరకు పరిచయ మవుతున్నారు. సక్సెస్ సాధిస్తున్నారు. ఇటీవల లిటిల్‌హార్ట్స్ చిత్రంతో యూట్యూబ్ సన్సేషన్, మీమ్ కంటెంట్ క్రియేటర్‌మౌళితనూజ్ బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు.ఇప్పుడుఈ కోవలోనే యూ ట్యూబ్‌లో వీడియోలతో తనకంటూ ఓ ప్రత్యేక మార్క్‌ను క్రియేట్ చేసుకున్న యూట్యూబ్ సన్సేషన్ షణ్ముఖ్ జస్వంత్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'ప్రేమకు నమస్కారం' ఉల్క గుప్తా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ గ్లింప్స్ వచ్చిన స్పందన అనూహ్యం. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు శివాజీ సినిమాలో ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. 'మహాదేవ నాయుడు' గా ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నాడు. కాగా మహాదేవ నాయుడు పాత్రకు సంబంధించిన ఓ వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. ఈ వీడియోను చూస్తే ఆయన పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతుందో తెలుస్తోంది. ప్రముఖ నటి భూమిక మరో ముఖ్యపాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని ఏబీ సినిమాస్ పతాకంపై అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్న ఈ చిత్రానికి వి. భీమ శంకర్ దర్శకుడు.ఇదొక యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌లా కనిపిస్తుంది. లవ్ ఫెయిల్యూర్స్.. లవ్ బ్రేకప్ అయిన వాళ్లంతా ఒక దగ్గర చేరి మాట్లాడుకుంటున్న సంభాషణలు, వాళ్ల గర్ల్‌ఫ్రెండ్స్ తమకు ఎలా హ్యాండ్ ఇచ్చారు అని చెప్పుకునే ఫన్నీ బాధలు అన్ని ఎంతో ఎంటర్‌టైనింగ్‌గా ఉన్నాయి. ఇక ఫైనల్‌గా షణ్ముఖ్ ఇది పాన్ ఇండియా ప్రేమ ప్రాబ్లమ్ అని చెప్పడం, మీరు అమ్మాయి దక్కలేదని మందుకు, సిగరెట్లకు ఖర్చు పెట్టే డబ్బులతో కైలాసగిరి దగ్గర ల్యాండ్‌తో పాటు కారు కొనుక్కోవచ్చు అని చెప్పే సంభాషణలు నేటి యూత్‌కు, వాళ్ల ప్రేమకు ఎంతో కనెక్ట్ అవుతాయి.టోటల్‌గా ప్రేమకు నమస్కారంఅనే టైటిల్‌అనౌన్స్‌మెంట్ వీడియో ఎంతో ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ఇదొక యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో యూత్‌తో పాటు అందరికి కనెక్ట్ అయ్యే అంశాలున్నాయి. ముఖ్యంగా నేటి యువత లవ్, బ్రేకప్‌అప్, ఇలా అన్ని అంశాలను పూర్తి వినోదభరితంగా ఈ చిత్రంలో చూపించబోతున్నాం. నేటి యువత బాగా కనెక్ట్ అయ్యే కథ ఇది. ఈ చిత్రంలో నటుడు హీరో శివాజీ పాత్రలో ఎంతో కీలకంగా ఉంటుంది. సినిమా ఆద్యంతం కనిపించే పాత్ర ఇది. ఆయన పాత్రలో కామెడీ, ఎమోషన్, సెంటిమెంట్ అన్నీ ఉంటాయి. కోర్టు సినిమాలో ఆయనకు ఎంతో పేరు వచ్చిందో ఈ సినిమాలో అంతకు మించిన పేరు వస్తుంది. ఆయన పాత్ర సినిమాకు కీలకంగా ఉంటుంది. మహాదేవ నాయుడుగా ఆయన నట విశ్వరూపం చూస్తారు అన్నారు.నిర్మాత మాట్లాడుతూ, వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రమిది. కొత్తదనం, హిలేరియస్ ఎంటర్‌టైనర్‌మెంట్ ఈ చిత్రంలోని ప్రత్యేకతలు. శివాజీ పాత్ర ఆయన కెరీర్‌లో గుర్తుండిపోతుంది. మహాదేవ నాయుడు పాత్రకు అందరికి నచ్చే విధంగా ఉంటుంది. అన్నారు.

# ఫోన్‌కాల్‌తో మహిళా తోటమాలి



ఫోన్ చేస్తే ఇంటికి మెకానిక్ వస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలను బాగుచేస్తున్నారు. మరి ఇంటి తోటకు ఇబ్బందొస్తే ఏం చేస్తారు? చెన్నైలోనైతే ఒక్క ఫోన్‌కాల్ చేస్తారు. కాసేపటికే ఓ మహిళ వచ్చి తోటను బాగుచేసి వెళ్తారు. అంతేకాదు, ఆ తోటకు కావాల్సినప్పుడల్లా కేర్‌టేకర్‌గానూ ఉంటారు. నగర ఇళ్లలో తోటల పెంపకం కోసం ఈ తరహా మహిళలు ప్రత్యేక నిపుణులుగా ఎదిగారు.

వాళ్లనే 'మద్రాస్ మాలి'గా పిలుస్తున్నారు.

ఇంట్లో కాస్త ఖాళీ స్థలమున్నా ఏదో ఒక మొక్క వేయాలనే ఆలోచన చాలామంది ఆడవారికి ఉంటుంది. ప్రత్యేక నగరాల్లో ఇలాంటి ఆవరణ, మిద్దెతోటలు చాలా అవసరం. దీన్ని దృష్టిలో ఉంచుకునే చెన్నై రెసిలెన్స్ సెంటర్ (సీఆర్సీ) స్వచ్ఛంద సంస్థ ఏళ్లుగా ఇంటి ఆవరణలో తోటలు పెంచేలా ప్రోత్సహిస్తోంది. వేలాది మంది ఈ ఒరవడికి అలవాటు పడ్డారు.. వారికి తోటపనిలో తరచుగా వచ్చే సమస్యలను తీర్చేందుకు నిపుణులు లేక నిరుత్సాహపడేవారు. కొందరైతే మొక్కలు పెంచడన్నీ మానుకున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఆలోచించిన సంస్థ సభ్యులు.. మహిళా తోట సంరక్షణ నిపుణులను తీసుకొచ్చారు. స్వయం సహాయక బృంద సభ్యులు (ఎస్‌హెచ్‌జి)గా ఉంటూ చురుకైన పాత్ర పోషించే 250మందిని చెన్నైలో ఎంపిక చేశారు. రెండేళ్ల శిక్షణ ఇవ్వడంతో పాటు 'మద్రాస్ మాలి' పేరుతో వారికి ప్రత్యేక గుర్తింపునిచ్చింది. ఇంటి తోటల్ని పెంచుతున్నవారికోసం వాట్సాప్ హెల్ప్ లైనను అందుబాటులోకి తెచ్చారు.



**నెలకు రూ.20వేల ఆధాయం ...**
మద్రాస్ మాలి.. ఇప్పుడు ఎస్‌హెచ్‌జిలోని పేద, మధ్యతరగతి మహిళలకు ఆదాయవనరుగా మారుతోంది. 'ఆసక్తి చూపినవారి తోటలకు మే కేర్‌టేకర్‌లుగా ఉన్నాం. ప్రతీకారం వారి ఇళ్లను సందర్శిస్తాం. ఏ సమయంలో ఏ మొక్కలు నాటాలి, మంచి దిగుబడి ఎలా రాబట్టాలి, వాతావరణ పరిస్థితులకు తగ్గట్లు నిర్వహణ.. వంటివి వారికి వివరిస్తుంటాం. ఇలా నెలకు రూ.20వేలదాకా సంపాదిస్తు న్నాను. 'మద్రాస్ మాలి' ఉపాధి ఎంతో పేరు తెచ్చిపెడుతోంది' అంటారు సభ్యురాలు ఎం.కృష్ణవేణి.

**పిల్లలకూ ఆ కూరగాయలే ..** ఇళ్లలోనే కాదు చెన్నైలోని 114 అంగన్వాడీ కేంద్రాలు, 16 ప్రభుత్వ పాఠశాలల్ని 'మద్రాస్‌మాలి' సభ్యులు తోటలతో పర్యావరణహితంగా మార్చారు. అక్కడ పనిచేసే ఆడవారికీ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆయా కేంద్రాల్లోని పిల్లలకు ఈ తోటల్లోని ఆరోగ్యకర కూరగాయలే వండి తినిపించేలా చేస్తున్నారు. మరోవైపు చెన్నైలోని వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లతో కలిసి ఆయా కాలనీల్లో పట్టణ తోటలమీద అవగాహన పెంచుతున్నారు. కాంక్రీట్ జంగిల్‌గా మారుతోన్న చెన్నైలాంటి నగరాలు దేశంలో చాలా ఉన్నాయి. వాటన్నింటికీ పరిష్కారంగా మే 'మద్రాస్ మాలి' వ్యవస్థను రూపొందించాం అంటున్నారీ సంస్థ సభ్యులు. □

# పసి పిల్లలపై దాడులకు వ్యతిరేకంగా..

**శక్తి, రక్షణలకు ప్రతిరూపం దుర్గాదేవి. ఆమె అంశను అంది పుచ్చుకున్న మహిళల సమాజంలో చాలా మందే ఉన్నారు. వారిలో ఢిల్లీకి చెందిన అర్చనా అగ్నిహోత్రి 'సమాధాన్ అభియాన్' పేరుతో పసి పిల్లలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఆమె గురించి...**




పసిపిల్లలపై లైంగిక దాడుల గురించి వార్తలు విన్నప్పుడల్లా అర్చన కలవరపడేవారు సమాజంలోని చెడు గురించి మాట్లాడుకోవడం కాదు... దానిపై పోరాడాలనుకున్నా. చుప్పీ టాడ్... హల్లా బోల్ (మౌనాన్ని వీడండి. నోరు విప్పి చెప్పండి) అనేది అర్చన నినాదం. ఇందుకోసం గత పదేళ్లుగా అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ఈ ప్రయత్నం బాధితురాలు విప్పి మాట్లాడే ధైర్యాన్నిచ్చింది. ఇందుకోసమే అర్చన 2015లో తన పొదుపు డబ్బు అభియాన్ పేరుతోస్వచ్ఛంద సంస్థను ఒప్రారంభించారు ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో మొదటి వర్క్‌షాప్ పిల్లలపై జరుగుతున్న వేధింపులు, పోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం ద్వారా ఆమె ప్రయాణం మొదలై తల్లిదండ్రులతోనూ సమావేశ మయ్యారు. ఆ సందర్భంగా చాలామంది తాము ఎదుర్కొన్న వేధింపుల అనుభవాలను పంచుకోవడమే . దశాబ్దాల తర్వాత కూడా ఆ బాధ తమని వెంటాడు తోందని ఒప్పుకొన్నారు. ఆ క్షణమే ఈ సమస్య ఎంత తీవ్రమైనదో అర్చనకి అర్థమైంది. అందుకే దాని చుట్టూ ఉన్న నిశ్శబ్దాన్ని చేధించాలి అనుకున్నారు. దేశవ్యాప్తంగా అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ సుమారు ఎనిమిది లక్షల మందిని చేరుకున్నారు. వారిలో 75శాతం మంది మైనర్లే.

**ఇబ్బందులెన్నో దాటి..** మొదటి ఏడేళ్లూ వర్క్‌సాప్‌లు,ర్యాలీలు, కమ్యూనిటీ సమావేశాలు, ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఆర్థిక ఇబ్బందులెన్నో ఎదుర్కొన్నారు అర్చన. తన పొదుపు మొత్తంతోనే ఇవన్నీ చేసేవారు. తర్వాత కొంతకాలం బంధువులూ, స్నేహితులూ చేయూత నిచ్చారు. ఇలా 2022 వరకూ సాగాక.. ఇండియా పెస్టిసైడ్స్ లిమిటెడ్ సంస్థ సిఎస్ఆర్‌లో భాగంగా నిధులు అందించడంతో తన కార్యక్రమాల పరిధిని మరింత విస్తరాంచారామె



'పసిపిల్లలు మంచి చెడులను త్వరగా గుర్తించలేరు. ఒక వేళ ఏదో జరుగుతోందని అనిపించినా భయం, సిగ్గు, బెదిరింపులు వంటివి వారి గొంతు నొక్కేస్తాయి. అందుకే వారు తమ సమస్యల్ని కనీసం తల్లిదండ్రులకైనా చెప్పేలా ధైర్యానిస్తున్నాం అంటారామె. 2024లో 'బి అలర్ట్, బీ సేఫ్, పోక్సో నాలెడ్జ్ అనే పుస్తకాన్ని తీసుకొచ్చింది సమాధాన్ అభియాన్. పిల్లలపై జరుగుతోన్న ప్రమేయ వేధింపులను ఎలా గుర్తించాలి, నిరోధించాలి, ప్రతిస్పందించాలన్న విషయాలు సులువుగా పిల్లల బొమ్మలతో దీన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని ప్రస్తుత ఎస్ఈఆర్‌టి పాఠ్యాంశాల్లోనూ చేర్చారు. అంతేకాదు. వేధింపుల నుంచి బయటపడ్డ వారికి తగిన భరోసా, భద్రత, రక్షణ కల్పించడానికి ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్, షాజన్‌పూర్, ఘజియాబాద్, గోరఖ్ పుర్‌లలో ఆరు బాలమిత్ర కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలీసులు, సంక్షేమ చైనా కమిటీలతో కలిసి బాధిత చిన్నారులు, వారి కుటుంబాలకు కౌన్సెలింగ్ చేస్తారు. అవసరమైన న్యాయసాయాన్ని అందిస్తారు. అర్చన బృందం ఇప్పటివరకూ 350కి పైగా కేసులనుపరిష్కరించింది □

# కురులకు లవంగ స్నానం..



**పట్టుకుచ్చులాంటి కురులంటే మనసు పారేసుకోనివారుండరు. ఒత్తైన జుట్టుతో ముఖం మరింత అందంగానూ మారుతుంది.**

అయితే వాతావరణ మార్పులు, కాలుష్య ప్రభావంతో శిరోజాలు పొడిబారి జీవాన్ని కోల్పోతుంటాయి. ఇలాకాకుండా ఉండాలంటే లవంగ స్నానాన్ని మించిన ఔషధం లేదంటున్నారు నిపుణులు రెండు కప్పుల నీళ్లలో రెండు టేబుల్‌స్పూన్ల లవంగాలు వేసి అయిదారు నిమిషాలపాటు మరగనిచ్చి చల్లార్చాలి. దీన్ని ఒక రాత్రంతా ఉంచి, ఆ తర్వాత వడకట్టి పొడిసీసాలో నింపి మూత బిగించి చల్లని ప్రదేశంలో భద్రపరచాలి. తలస్నానం చేసిన వెంటనే ఈ నీటిని తలకు రాయాలి. కుదుళ్లకంతా పట్టించి మాడుపై మృదువుగా పది నిమిషాలపాటు మర్దనా చేసి మరో అయిదునిమిషాలు ఆరనివ్వాలి. ఆ తర్వాత మంచినీళ్లతో జుట్టును కడిగేస్తే సరి.

**ప్రయోజనాలెన్నో...** వంట రుచిని పెంచే లవంగాల్లో కురులకు రక్తాన్ని సరఫరాచేసే గ్రంథులను ఉత్తేజపరిచే లక్షణాలూ ఉన్నాయి. ఇన్ఫెక్షన్లను నిరోధించి ఇవి కుదుళ్లను మాడును ఆరోగ్యగా ఉంచుతాయి. చైనాలో పురాతన ఔషధంగానూ, మన దేశంలో ఆయుర్వేదవైద్యంలోనూ వినియోగించే ఈ లవంగాల్లో యాంటీ ఆక్సిడెంట్లూ పుష్కలంగా ఉంటాయి. యాంటీమైక్రోబియల్, యాంటీ ఫంగల్ లక్షణాల తో మాడుపై ఇన్‌ఫ్లమేషన్‌నూ ఇవి తగ్గించ గలవు.దీంతో శిరోజాలు రాలడం, చుండ్రు, దురదవంటి సమస్యలు దూరమవుతాయి. యుక్తవయసులోనే జుట్టు నెరవడాన్ని ఈ లవంగ స్నానం నియంత్రిస్తుంది. వారానికి రెండు సార్లు చేసే ఈ స్నానంతో మృదువైన శిరోజాలను సొంతం చేసుకోవచ్చు. □

# పండ్లను వండేద్దాం..

**పండ్లు ఆరోగ్యానికి మంచివో మనందరికీ తెలిసిందే. ఆయా సీజన్లలో దొరికే తాజా పండ్లను అలాగే తింటిం. లేదా సలాడ్, కస్టర్‌నడ రూపంలనట ఆరగిస్తాం. ఆ సంగతలా ఉంచితే..కాయగూరలతో చేసినట్లు పండ్లతోనూ కూరలు చేయొచ్చు. ఎప్పుడూ సొర, బీర, దోస..ల ఆంటివేనా అనిపిస్తే.. ఈ వైరైటీ వంటలు చేసి చూడండి.**

## గ్రీన్ యాపిల్ కర్రీ..



**కావలసినవి :** గ్రీన్ యాపిల్-4, ఉల్లి తరుగు-అర కప్పు, నూనె-టేబుల్ స్పూన్, ఆవాలు, జీలకర్ర-అరచెంచా చొప్పున, కరివేపాకు-2 రెబ్బలు, వెల్లుల్లి తరుగు-రెండు చెంచాలు, పచ్చిమిర్చి-3, జీడిపప్పు పలుకులు-పావు కప్పు, ఉప్పు-తగినంత, కారం-చెంచా, కొబ్బరి పాలు-కప్పు, బ్రౌన్ షుగర్-చెంచా, కొత్తిమీర తరుగు-చారెడు.

**తయారీ :** కడియిలో నూనె కాగనిచ్చి ఆవాలు, జీలకర్ర కరివేపాకు, వెల్లుల్లి తరుగు, పచ్చిమర్చి ముక్కలు వేయాలి. అవి కాస్త వేగాక..జీడిపప్పు పలుకులు,ఉల్లి తరుగు వేసి వేయించాలి. రెండు నిమిషాల తర్వాత కారం, ఉప్పు, గ్రీన్ యాపిల్ ముక్కలు వేయాలి. బాగా కలియ తిప్పి కొన్ని నీళ్ల పోసి ముక్కలను మెత్తబడనివ్వాలి. అందులో కొబ్బరి పాలు, బ్రౌన్ షుగర్ వేసి ఇంకో రెండు నిమిషాలు ఉడికించి, కొత్తిమీర తరుగు వేసి దించేయాలి. ఇది అన్నం, చపాతీలు.. ఎందులోకైనా సూపర్‌గా ఉంటుంది.

## మిక్స్‌డ్ ఫ్రూట్ కుర్మా ..



**కావలసినవి :** ఈ కాలంలో దొరికే యాపిల్ తదితర పండ్ల ముక్కలు-రెండు కప్పులు, టొమాటో గుజ్జు-కప్పు, జీడిపప్పు-పావు కప్పు, గుమ్మడి గింజలు-2 చెంచాలు, కొబ్బరి తురుము-2 టేబుల్ స్పూన్లు, దానిమ్మ గింజలు-చెంచా, జీలకర్ర-చెంచా, దాల్చిన చెక్క-అంగుళం ముక్క-యకాలకులు-4, బిర్యానీ ఆకులు-2, అల్లం ముద్ద-చెంచా, పసుపు-పావు చెంచా,కారం-2 చెంచాలు, నూనె, ఉప్పు-తగినంత, మెంతి ఆకుల పొడి, మిరియాల పొడి, గరం మసాలా-చెంచా చొప్పున, ధనియాల పొడి-2 చెంచాలు, పుదీనా పొడి-2 చెంచాలు, పెరుగు-అర కప్పు, నెయ్యి-2 టేబుల్ స్పూన్లు, కుంకుమ పువ్వు - చెటికెడు.

**తయారీ :** జీడిపప్పు, గుమ్మడి గింజలను అర గంట వేడినీళ్లలో నానబెట్టి గ్రైండ్ చేయాలి. కడియిలో నూనె కాగిన తర్వాత జీలకర్ర, దాల్చిన చెక్క, యాలకులు, బిర్యానీ ఆకులు, అల్లం ముద్ద, టొమాటో గుజ్జు, జీడిపప్పు పేస్టు,కారం, ఉప్పు, పసుపు, మిరియాల పొడి, ధనియాల పొడి, పుదీనా పొడి వేసి కలియతిపానపలి.సన్న సెగ మీద ఐదు నిమిషదాలుంచి పెరుగు, మెంతి ఆకులు పొడి, గరం మసాలా వేయాలి. అడుగు భాగం మందంగా ఉననన పాత్రలో నెయ్యి వేసి డ్రైఫ్రూట్స్ పలుకులు, మఖానా, కిస్‌మిస్, ఫైనాపిల్,యాపిల్ ముక్కలు వేసి వేయించాలి.న గ్రేవీ ఉన్న కడియిలో ఈ వేయించిన పండ్ల మిశ్రమం వేసి కలియ తిప్పి మూత పెట్టాలి. నాలుగు నిమిషాల్లో కుర్మా ఉడికిపోతుంది. అందులో కొబ్బరి తురుము, దానిమ్మ గింజలు,కుంకుమ పువ్వు, కొత్తిమీర తరుగు వేసి నిమిషం తర్వాత దించేయాలి. ఈ మిక్స్‌డ్ ఫ్రూట్ కుర్మా హోటలో స్టైల్లో చాలా బాగుంటుంది

## స్పైసీ కివీ కర్రీ...



**కావలసినవి :** కివీ పండ్లు-4, క్యాప్సికెం, టొమాటో ముక్కలు,ఉల్లి తరుగు-పావు కప్పు చొప్పున, పచ్చిమర్చి-5, కొబ్బరి పాలు-కప్పు, నూనె-2 టేబుల్ స్పూనునటల, గరం మసాలా-చెంచా, మిరియాల పొడి-చెంచా, జీలకర్ర-అర చెంచా, యాలకులు-3, దాల్చిన చెక్క-అంగుళం ముక్క లవంగాలు-4, జీడిపప్పుల పొడి-2 చెంచాలు, బియ్యప్పిండి-చెంచా, కరివేపాకు-రెండు రెబ్బలు,కారం, పసుపు,ఉప్పు-తగినంత, అల్లం-వెల్లుల్లి పేస్టు-చెంచా, కొత్తిమీర తరుగు-చారెడు.

**తయారీ :** కివీ పండ్లను కడిగి ముక్కలు కోసుకోవాలి. కడాయిలో నూనె కాగిన తర్వాత జీలకర్ర, యాలకులు, దాల్చిన చెక్క లవంగాలు వేయాలి. అవి కాస్త వేగాక.. ఉల్లి తరుగు, అద ఇవేగాక, టొమాటో, క్యాప్సికం, మర్చి ముక్కలు, అల్లం-వెల్లుల్లి పేస్టు జతచేయాలి. నాలుగు నిమితషాల తర్వాత కొన్ని నీళ్ల, పసుపు, ఉప్పు, గరం మసాలా, కారం, మిరియాల పొడి, జీడిపప్పుల పొడి, బియ్యపినపండి వేసికలియతిప్పాలి. అందులో కొబ్బరి పాలు, కివీ ముక్కలు వేసి..దగనగరపడిన తర్వాత దించి,కొత్తిమీర తరుగు వేయాలి. అంతే.. రంగూ రుచీ అద్భుతంగా ఉండే స్పైసీ కివీ కర్రీ రెడీ. ఇది అన్నం రోటీ..ఎందులోకైనా బాగుంటుంది.

## జామకాయ కూర...



**కావలసినవి :** దోర జామకాయలు-4, నూనె-2 టేబుల్ స్పూన్లు,ఉల్లి తరుగు-కప్పు, పచ్చిమర్చి-4, టొమాటో గుజ్జు-కప్పున్నర, నువ్వులు పొడి-ముప్పావుకప్పు,గరం మసాలా-చెంచా,అల్లం వెల్లుల్లి పేస్టు-చెంచా,కొత్తిమీర తరుగు-చారెడు, పసుపు-పావు చెంచా, కారం-చెంచా,ఉప్పు-తీగినంత, కరివేపాకు-రెండు రెబ్బలు, తాలింపు దినుసులు.

**తయారీ :** జామకాయలు కోసి మధ్యలో విత్తనాలున్న భాగాన్ని తీసేసి ముక్కలుగా కోసుకోవాలి. కడాయిలో నూనె కాగనిచ్చి తాలింపు దినుసులు వేయాలి. ఆవాలు చిటపటలాడాక..కరివేపాకు ఉల్లి తరుగు, పచ్చిమర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేయాలి. అవి దోరగా వేగాక.. టొమాటో గుజ్జు, కారం, పసుపు, ఉప్పు వేయాలి. అదికూడా వేగిన తర్వాత..నువ్వుల పొడి, గరం మసాలా వేసికలియ తిప్పి.. కొన్ని నీళ్ల పోసి మగ్గనివ్వాలి. దగ్గరగా అయ్యాక..కొత్తిమీర తరుగు వేసి దించేయాలి. అంతే నోరూరించే జామకాయ కూర సిద్ధం. తిని ఆనందించడమే తరువాయి.

## సీమచింత పప్పు కూర..




**కావలసినవి :** సీమచింత (గుబ్బ)కాయలు-పావు కిలో,ఉల్లి తరుగు-కప్పు,పచ్చిమర్చి-మూడు టొమాటో గుజ్జు-కప్పు, నూనె-నాలుగు చంచాలు, ధనియాలు, గసగసాలు నువ్వులు-రెండు చెంచాలు చొప్పున, జీలకర్ర-చెంచా, జీడిపప్పు-అర కప్పు, లవంగాలు-ఆరు, దాల్చిన చెక్కపొడి, యాలకుల పొడి-పావు చెంచా చొప్పున, కొబ్బరి కోరు-అరకప్పు, బిర్యానీ ఆకులు-రెండు షాజీరా-చెంచా, పసుపు-పావు చెంచా, ఉప్పు-తగినంత, అల్లం, వెల్లుల్లి ముద్ద-రెండు చెంచాలు, కారం-చెంచా, కొత్తిమీర తరుగు.

**తయారీ :** ముందుగా సీమచింత కాయలనుకడిగి, గింజలు తీసేసి, పప్పులను పక్కనుంచుకోవాలి.కడాయిలో ధనియాలను కాస్త వేగనిచ్చి.. జీలకర్ర, గసగసాలు, నువ్వులు వేసి వేయించాలి. వీటికి జీడిపప్పు జతచేసి గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె కాగనిచ్చి.. దాల్చిన చెక్క బిర్యానీ ఆకులు లవంగాలు, షాజీరా, ఉల్లి తరుగు, పచ్చిమర్చి ముక్కలు వేయాలి. అవి దోరగా వేగిన తర్వాత టొమాటో గుజ్జు, పసుపు, ఉప్పు రెండు చెంచాల అల్లం, వెల్లుల్లి ముద్ద వేసి మగ్గనివ్వాలి. అందులో సీమచింత పప్పులు, ధనియాలు, జీడిపప్పుల పొడి, కారం, ఉప్పు, యాలకులపొడి వేసి కలియ తిప్పి, సన్న సెగ మీద ఐదు నిమిషాలు ఉడకనిచ్చి.కొబ్బరి కోరు, కొత్తిమీర చల్లి దించేయాలి.,అంతే ఘుమఘుమలాడే సీమచింత పప్పు కూర రెడీ. □

# దేవుడి కృప గొప్పది

అంతర్వాణి

**ఇతరుల గురించి ప్రార్థన చేస్తే చాలు..**



'ఆయన (యేసు) ఆ ఊరిగవినియొద్దకు వచ్చినప్పుడు, చనిపోయిన యొకడు వెలుపలికి మోసికొని పోబడుచుండెను. అతని తల్లికి అతడొక్కడే కుమారుడు, ఆమె విధవరాలు. ఆ ఊరి జనులు అనేకులు ఆమెతో కూడా ఉండిరి. ప్రభువు ఆమెను చూచి ఆమెయందు కనికరపడి-ఏడవవద్దని..చిన్నవాడా, లెమ్మని నీతో చెప్పుచున్నానగా, ఆ చనిపోయిన వాడు లేచి కూర్చుండి మాటలాడసాగెను. ఆయన(యేసు) అతనిని అతని తల్లికి అప్పగించెను' (లూకా 7:12-15). 'యేసు ఆమెను చూచి, రమ్మని పిలిచి-అమ్మా, నీ బలహీనత నుండి విడుదల పొందియున్నావని ఆమెతో చెప్పి, ఆమె మీద చేతులుంచగానే ఆమె చక్కగా నిలువబడి దేవుని మహిమపరచెను' (లూకా 13:10-13). ఈ రెండు ఉదంతాలను గమనిస్తే పైఇద్దరు స్త్రీలు తమ సమస్యలను యేసుక్రీస్తుకు చెప్పుకున్నట్లుగా మనకు కనిపించదు. కానీ వారి కష్టాన్ని చూసిన ప్రభువు వారిపై తన కనికరాన్ని చూపించాడు. మొదటి ఉదంతంలో ఒక విధవరాలికి ఒకేఒక్క కుమారుడు. ఆ యువకుడు చనిపోయాడు. ఆమెకు ఇంకెవరూ లేరు. దూరం నుంచి ప్రభువు ఆ స్త్రీని చూచి, జాలిపడి, మరణించిన ఆమె కుమారుడిని లేపాడు. రెండవ ఉదంతంలో 18 సంవత్సరాలుగా ఒక స్త్రీ దయ్యం పట్టి, నడుము ఒంగిపోయి, ఏమాత్రం చక్కగా నిలవలేని పరిస్థితిలో దేవాలయానికి వచ్చింది. ప్రభువు ఆమెను చూచి, ఆమెపై తన కనికరాన్ని చూపి, ఆ స్త్రీని స్వస్థపరిచాడు. ఇద్దరు స్త్రీలు తమను బాగుచేయమని ప్రభువు వద్దకు రాలేదు. కానీ వారిస్థితిని యేసు చూచి, కనికరంతో వారి సమస్య నుంచి బయటకు తీసుకొచ్చాడు. ప్రభువు చెంతకు చాలామంది తమను బాగుచేయమని వేడుకున్నారు. కాని కొందరిని మాత్రం వారు ఏమీ అడగకపోయినా వారి సమస్య నుంచి వారిని ఆదుకున్నాడు. యేసుక్రీస్తు ఎంతో జాలిగలవాడు. దయాసంవృద్ధిగల దేవుడు. ఎంతో సున్నితమైన మనసుగలవాడు. ప్రభువు మనసు మనకూ ఉండాలి. అందరిపట్ల జాలి, ప్రేమను చూపించాలి. యేసుక్రీస్తులా మనం అద్భుతాలు, స్వస్థతలు చేయలేకపోవచ్చు. కానీ వారి గురించి పట్టుదలతో ప్రార్థన చేస్తే చాలు. అదే గొప్ప భాగ్యం మనకు.

-పి.వాణిపుష్ప

# చెలి చిట్కా

★ ఫ్రిజ్‌లో ఆహార పదార్థాలను కూరగాయలను ఏ మాత్రం ఖాళీలేకుండా ఇరికించి పెట్టరాదు. ఫ్రిజ్‌లోపలగాలి ప్రవేశం చేలా కొంతఖాళీవుండేలా చూడాలి.

★. సువాసన వస్తువులను పూలనుఫ్రిజ్‌లో పెట్టేటప్పుడు వాటివాసన బయటకు రాకుండా జాగ్రత్తగా వేసి కవర్‌లోపెట్టాలి.

★. కూరగాయలను కడిగినతర్వాత పూర్తిగా తడి ఆరిపోయిన తర్వాతనే వాటిని ఫ్రిజ్‌లో పెట్టాలి. □

# చాపెల్ హాడ్లీ ట్రోఫీ ఆస్ట్రేలియాదే

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక చాపెల్ హాడ్లీ ట్రోఫీని ఆస్ట్రేలియా నిలబెట్టుకుంది. న్యూజిలాండ్‌తో మౌంట్ మౌంగనుయ్ వేదికగా జరగాల్సిన రెండో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడం ఆసీస్‌కు కలిసి వచ్చింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్ చాలా ఆలస్యంగా ప్రారంభం కావడంతో 20 ఓవర్ల మ్యాచ్‌ను 9 ఓవర్లకు కుదించారు. ఆస్ట్రేలియా తొలుత బ్యాటింగ్‌కు దిగింది. 2.1 ఓవర్ల ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 16 పరుగులు చేసింది. ఈ సమయంలో మరోసారి భారీ వర్షం కురిసింది. మ్యాచ్ నిర్వహించే పరిస్థితులు లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకముందు బుధవారం ఇదే మైదానంలో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ క్రమంలో మూడో టీ20 మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండానే ఆస్ట్రేలియా చాపెల్ హాడ్లీ ట్రోఫీని నిలబెట్టుకుంటుంది. కాగా చాపెల్‌హాడ్లీ ట్రోఫీ ని 2004 నుంచి నిర్వహిస్తున్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు ఈ ట్రోఫీ పేరు పెడుతున్నారు. ఇరు దేశాల దిగ్గజ క్రికెటర్ల పేరుతో దీన్ని నిర్వహిస్తున్నారు. ఇక 2019 నుంచి ఈ ట్రోఫీ ఆస్ట్రేలియా వద్దనే ఉంటూ వస్తోంది.

# గ్రాండ్ చెస్ ఛాంపియన్‌గా కరువానా



**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్-2025 ఫాబియానో కరువానా ఛాంపియన్‌గా నిలిచాడు. ఫైనల్స్‌లో మాక్సిమ్ వాచియర్‌లాగ్రేవ్‌ను 13-15 తేడాతో ఓడించి కరువానా టైటిల్ సాధించాడు. దీంతో వాచియర్‌లాగ్రేవ్ రన్నరప్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో వాచియర్‌లాగ్రేవ్ మొదటి గేమ్‌ను గెలుచుకున్నాడు, కానీ కరువానా వరుసగా మూడు గేమ్‌లను గెలిచి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. వాచియర్‌లాగ్రేవ్ చివరి గేమ్‌ను గెలిచి ప్లేఆఫ్స్‌కు వెళ్లే ప్రయత్నంలో ఒత్తిడికి గురై కరువానా చేతిలో ఓటమి పాలయ్యాడు. మొదటి గేమ్‌లో వాచియర్ లాగ్రేవ్ ప్రారంభంలోనే ఇబ్బందుల్లో పడ్డాడు. అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ వరుసగా విజయాలు సాధించి స్కోరును సమం చేయడంతో కరువానా పునరాగమనం బ్లిట్జ్‌లో ప్రారంభమైంది. మొదటిదానిలో, వాచియర్‌లాగ్రేవ్ వాస్తవానికి మరొక స్వేష్నికోవ్ సిసిలియన్‌లో అతనిని అధిగమించాడు. అక్కడ ఫ్రెంచ్ వ్యక్తి చేసిన అతిపెద్ద తప్పుతో కరువానా సమం చేశాడు. వాచియర్‌లాగ్రేవ్ ఒక కదలికలో స్లిప్ అయిన తర్వాత కరువానా మళ్ళీ ఆధిపత్యం సంపాదించాడు. ఇక భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానందపై 8-20 తేడాతో లెవాన్ అరోనియన్ విజయం సాధించి మూడవ స్థానంలో నిలిచాడు. దీంతో ప్రజ్ఞానంద రమేష్‌బాబు నాల్గవ స్థానానికి పరిమితమయ్యాడు.

# తొలి టెస్టులో భారత్ ఘన విజయం

## 140 రన్స్ తేడాతో విండీస్ ఓటమి

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటి మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయం సాధించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో శనివారం జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు బ్యాటింగ్‌లో కానీ, బౌలింగ్‌లో కానీ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయింది. టీమిండియా తరపున ముగ్గురు ఆటగాళ్లు సెంచరీలు సాధించగా, వెస్టిండీస్ బ్యాట్స్‌మెన్‌లు ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయారు. భారత బౌలర్ల ధాటికి నిలబడలేక, వెస్టిండీస్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో టీమిండియా 31 ఏళ్ల రికార్డును పదిలం చేసుకుంది. టీమిండియాకు వ్యతిరేకంగా వెస్టిండీస్ బ్యాటింగ్ రెండు ఇన్నింగ్స్‌లలో పూర్తిగా విఫలమైంది. మొదటి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ జట్టు కేవలం 162 పరుగులకే ఆలౌట్ అయింది. దీనికి సమాధానంగా టీమిండియా 5 వికెట్ల నష్టానికి 448 పరుగులు చేసి, తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. 286 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన వెస్టిండీస్ జట్టు మొత్తం పేకమేడలా కూలిపోయింది. మూడవ రోజు రెండో సెషన్‌లోనే వెస్టిండీస్ కేవలం 146 పరుగులకు ఆలౌట్ అయింది. వెస్టిండీస్ తరపున ఎలిక్ అథానాజ్ అత్యధికంగా 38 పరుగులు చేశాడు. జస్టిన్ గ్రేవ్స్ 25 పరుగులు, జైడెన్ సీల్స్ 22 పరుగులు చేశారు. మిగిలిన ఏ బ్యాట్స్‌మెన్ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలబడలేకపోయారు. భారత బౌలర్ల దెబ్బకు రెండు ఇన్నింగ్స్‌లలోనూ అతిథి జట్టు తరపున ఏ బ్యాట్స్‌మెన్ కూడా హాఫ్ సెంచరీ సాధించలేకపోయాడు. రవీంద్ర జడేజా అత్యధికంగా 4 వికెట్లు, మహ్మద్ సిరాజ్ 3 వికెట్లు, కుల్దీప్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టారు. దీంతో భారత జట్టు సిరీస్‌లో 10 ఆధిక్యంలో నిలిచింది.



ఆట



వరల్డ్ పారా అథ్లెటిక్స్

# సిమ్రాన్, నిషాద్‌లకు స్వర్ణాలు

## భారత్ ఖాతాలో మరో 4 పతకాలు

**న్యూఢిల్లీ:** 2025 ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ భారత అథ్లెట్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు, బహుళ ఈవెంట్లలో 7వ రోజు నాలుగు పతకాలను సాధించారు. మహిళల 100 మీటర్ల టి12 విభాగంలో భారత్ తరపున తొలి స్వర్ణం సాధించడం ద్వారా సిమ్రాన్ చరిత్ర సృష్టించింది. 11.95 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసి, ఈ ఈవెంట్‌లో 12 సెకన్ల అవరోధాన్ని అధిగమించిన తొలి భారతీయ పారా అథ్లెట్‌గా నిలిచింది. పురుషుల హైజంప్ టి47లో, నిషాద్ తన మునుపటి నాలుగు ఉన్నత స్థాయి పోటీలలో రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు, రెండు పారాలింపిక్ క్రీడలతో సహా రజతంతో ముగించిన తర్వాత తన తొలి మేజర్ స్వర్ణాన్ని సాధించాడు. 2.14 మీటర్ల దూరం దూకి బంగారు పతకం సాధించడం ద్వారా అతను కొత్త ఆసియా రికార్డును కూడా సృష్టించాడు, ఇది అతని కెరీర్‌లో ఒక మైలురాయి విజయాన్ని సూచిస్తుంది. 25 ఏళ్ల ప్రీతి పాల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించి, మహిళల 200 మీటర్ల టి35లో కాంస్యం గెలుచుకుంది, అయితే మైన్ బ్లాస్ట్ ప్రాణాలతో బయటపడిన మరియు ఆర్మీ అనుభవజ్ఞుడైన పర్దీప్ కుమార్ పురుషుల డిస్కస్ ఎఫ్64లో 46.23 మీటర్ల ఉత్తమ త్రోతో కాంస్యం గెలుచుకున్నాడు. అలాగే రెండుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్ అయిన సచిన్ ఖిలారి పురుషుల షాట్ పుట్ టి46 ఈవెంట్‌లో నాల్గవ స్థానంలో నిలిచాడు.

# కెప్టెన్సీ నుండి రోహిత్ ఔట్

## శుభ్‌మన్‌గిల్‌కే వన్డే పగ్గాలు



**న్యూఢిల్లీ:** టీమిండియా సీనియర్ ప్లేయర్, కెప్టెన్‌గా 2024లో టీ20 వరల్డ్ కప్, 2025లో ఛాంపియన్స్ ట్రోఫీ అందించిన రోహిత్ శర్మకు బీసీసీఐ ఊహించని షాకిచ్చింది. తాజాగా ఆస్ట్రేలియా వన్డే సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పించింది. అతని స్థానంలో యంగ్ ప్లేయర్, భారత టెస్టు జట్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌కు వన్డే కెప్టెన్సీ పగ్గాలు అప్పగించింది. కాగా టీ20 వరల్డ్ కప్ విజయం తర్వాత టీ20 ఫార్మాట్‌కు, ఆ తర్వాత టెస్టు ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. రోహిత్ వన్డే వరల్డ్ కప్ 2027 వరకు ఈ ఫార్మాట్ ఆడాలని అనుకుంటున్నట్లు ప్రచారం జరిగింది. మరి అప్పటి వరకు రోహితే కెప్టెన్‌గా ఉంటాడని అంతా భావించారు. కానీ, అనూహ్యంగా రోహిత్‌ను తప్పించి, అతని ప్లేస్‌లో శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ కెప్టెన్‌గా నియమించింది. దీంతో టెస్టు, వన్డే రెండు ఫార్మాట్లకు టీమిండియా కెప్టెన్‌గా అయ్యాడు





# మహిళల వన్డే వరల్డ్ కప్‌లో నేడు హై ఓల్టేజ్ మ్యాచ్

## భారత్, పాక్ మధ్య బిగ్ ఫైట్

**న్యూఢిల్లీ:** ఆసియాకప్ పుణ్యమా అని రెండు వారాల వ్యవధిలోనే 3 సార్లు భారత్, పాక్ జట్లు తలపడ్డాయి. ఈ మూడు సార్లు భారత్ గెలిచింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ ను ఓడించి భారత్ ఆసియాకప్ ను కైవసం చేసుకుంది. ఇక ఇప్పుడు మరోసారి దాయాదుల పోరు జరగనుంది. మహిళల వన్డే ప్రపంచకప్-2025కు భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. పాకిస్తాన్ ఆడే మ్యాచ్‌లు అన్ని శ్రీలంకలోని కొలంబో వేదికగానే జరగనున్నాయి. ఈ వేదికగా భారత్, పాక్ జట్ల మధ్య ఈ నెల 5, ఆదివారం మధ్యాహ్నం 3 గంట లకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. హర్మన్ ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా బరిలోకి దిగనుంది. ప్రస్తుతం జరుగుతున్న వన్డే ప్రపం చకప్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు తమ ఆరంభ మ్యాచ్‌లను ఆడేశాయి. శ్రీలంకపై భారత్ ఘనవిజయం సాధిస్తే తన కంటే బలహీనమైన బం గ్లాదేశ్ చేతిలో పాకిస్తాన్ చిత్తు చిత్తుగా ఓడింది. ఈ క్రమంలో ఆదివా రం జరిగే పోరులో టీమిండియా ఏకపక్ష విజయం సాధించే అవకాశం ఉంది. భారత్, పాకిస్తాన్ మహిళల జట్ల మధ్య ఇప్పటి వరకు 11 మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో 11 సార్లు కూడా టీమిండియానే నెగ్గిం ది. పాకిస్తాన్ ఏ మాత్రం ఫైట్ ఇవ్వలేకపోయింది. గత నెల 30న ఆరంభమైన ప్రపంచకప్, నవంబర్ 2 వరకు జరగనుంది. మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి. భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, ఇంగ్లండ్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక జట్లు ప్రపంచకప్‌లో తమ లక్‌ను పరీక్షించుకోనున్నాయి. రేసులో 8 జట్లు ఉన్నప్పటికీ టైటిల్ పోటీ కేవలం 4 జట్ల భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్ల మధ్యే టైటిల్ ఫైట్ ఉండనుంది. గతంలో పలుమార్లు టీమిండియా ఫైనల్ వరకు చేరి తుది మెట్టును అధిగమించలేకపోయిం ది. అయితే ఈసారి మాత్రం ఎలాగైనా ట్రోఫీ నెగ్గాలనే పట్టుదల మీద ఉంది. భారత్ టీమ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), క్రాంతి గౌడ్, సయాలి సత్ఘరే, రాధా యాదవ్, శ్రీ చరణి, యాస్తికా భాటియా (వికెట్ కీపర్), స్నేహ రాణా.

# నవంబరు 23న నీరవ్‌మోడీ భారత్‌కు అప్పగింత!



**లండన్, అక్టోబరు 4:** పంజాబ్ నేషనల్ బ్యాంకు కు రూ.వేల కోట్ల రుణాలు ఎగవేసిన కేసులో ప్రస్తుతం లండన్ జైలులో శిక్ష అనుభవిస్తున్న డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీని వచ్చేనెల 23న భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ సూత్రప్రాయంగా అంగీకరించింది. అయితే, ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. నీరవ్ మోదీని త్వరలోనే భారత్‌కు అప్పగించేందుకు లైన్ క్లియర్ అయింది. బ్రిటన్ అధికారులు వచ్చే నెల అంటే నవంబర్ 23న నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించనున్నట్లు బ్రిటన్ అధికారులు చెపుతున్నారు. అతన్ని ముంబైలోని ఆర్థర్ రోడ్డు జైలులో ఉంచనున్నట్లు సమాచారం. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు నీరవ్ మోదీ దాదాపు రూ.14 వేల కోట్ల రుణం ఎగవేసిన ఉదంతం 2018లో వెలుగులోకి వచ్చింది. ఆ వెంటనే అతను విదేశాలకు పారిపోయాడు. ఈ కేసును సీబీఐ, ఈడీ విచారిస్తోంది. దర్యాప్తులో భాగంగా నీరవ్ ఆస్తులను కూడా ఈడీ స్వాధీనం చేసుకుంది. ఈ ఆర్థిక నేరగాన్ని స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో నీరవ్ మోదీ తమదేశంలోనే నివసిస్తున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం 2018 డిసెంబర్‌లో ప్రకటించింది. దీంతో అతడిని తమకు అప్పగించాలని భారత్ విజ్ఞప్తి చేయగా.. 2019లో నీరవ్ మోదీని అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. అతన్ని భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపింది. 2021, ఏప్రిల్‌లో అతన్ని భారత్‌కు అప్పగించాలని ఆ నాటి యూకే హోంమంత్రి ప్రీతి పటేల్ ఆదేశించారు. ఇక ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఈడీ ఇప్పటిదాకా దేశ, విదేశాల్లోని రూ.2,596 కోట్ల విలువైన నీరవ్ ఆస్తుల్ని అటాచ్ చేసింది. ముంబైలోని బ్రాడీ హౌజ్ పీఎన్‌బీ శాఖ కేంద్రంగా ఈ కుంభకోణం జరిగింది. బ్యాంక్ ఉన్నతాధికారులతో కలిసి నకిలీ/మోసపూరిత ఎల్‌వోయూలతో నీరవ్, చోక్సీలు వేల కోట్ల రుణాలను పొందారు. ఇక ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటిదాకా రూ.1,052.42 కోట్ల సొమ్మును పీఎన్‌బీ, ఇతర బ్యాంకులకు అప్పజెప్పినట్టు ఈడీ వర్గాలు వెల్లడించాయి.




# వారాంతంలోనే ఈక్విటీ సూచీలకు ఊరట!

**ముంబయి, అక్టోబరు 4:** భారత్ ఈక్విటీ మార్కెట్లు ఈనెల మొదటివారంలో అత్యంత అప్రమత్తపు ట్రేడింగ్‌తోముగిసాయి. వారం మధ్యస్తంలో కొంత అనిశ్చితి నెలకొంది. విదేశీ ఫండ్స్ ఎక్కువ విత్‌డ్రా కావడం, కరెన్సీ క్షీణత, వివిధ విభాగాల రొటేషన్లు వంటివి కొంత మార్కెట్లను ప్రభావితం చేసాయి. వీటికితోడు గ్లోబల్ మార్కెట్లు కూడా మిశ్రమంగా కొనసాగడం ఇన్వెస్టర్లకు జాగ్రత్తలునేర్పింది. కొన్ని బ్యాంకులు, కన్స్యూమర్, మెటల్ స్టాక్స్ ఈ వారంలో మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. సెన్సెక్స్ 224 పాయింట్లు వారాంతంలోపెరిగితే నిఫ్టీ కూడా 24,850 మార్కును మేనేజ్‌చేసుకుంది. ఒక్క సెప్టెంబరునెలలోనే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు 2.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కితీసుకున్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్లు కూడా అమెరికా బాండ్లనేపథ్యంలో కొంతమేర అప్రమత్తంగా వ్యవహరించారు. ఫెడ్‌రిజర్వు ఫలితాలుకూడా కొంత ప్రభావం చూపించాయి. వారాంతంలో డాలరుతో రూపాయి మారకం విలువలు 88.77గా చెలామణి అయింది. వారం చివరిరోజులో మాత్రమేమూడుశాతంపెరిగాయి. ఆటో విభాగం కూడా మారుతిసుజుకి 26% పెరుగుదలను నమోదుచేసింది. ఇందుకుభిన్నంగా బ్యాంకింగ్ ఆర్థికరంగ కంపెనీల షేర్లు అమ్మకాల వత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇక డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఆర్థికసేవలరంగ కంపెనీలపై కొంత ఫోకస్‌పెరిగింది. అనేక భారత రక్షణరంగ స్టాక్స్‌లో 58శాతం వరకూ పెరిగే ఛాన్స్ ఉందని గోల్డ్‌మాన్ శాక్స్ వంటి సంస్థలు పేర్కొన్నాయి. ఇక వచ్చేవారం పరంగాచూస్తే విదేశీ పెట్టుబడులు నిలకడగా ఉంటేనే మార్కెట్లకు ఊతం ఇచ్చినట్లవుతుంది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల నిధుల రాక, డాలర్ రూపాయి మారకం విలువలు, కార్పొరేట్‌ల రాబడుల ఫలితాలు, కీలకమైన ఐటి సంస్థల ఫలితాలు, అమెరికాతో పాటు ఇతర ప్రపంచ మార్కెట్ల సూచీలపైనా కొంత ఇన్వెస్టర్లు ఫోకస్ పెంచే అవకాశం ఉంది.

# ప్రభుత్వ ఆర్థికసంస్థల్లో రూ.1.84 లక్షలకోట్ల అన్‌క్లెయిమ్డ్ సొమ్ము!

## ప్రత్యేక జాతాను ప్రారంభించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**అహ్మదాబాద్, అక్టోబరు 4:** బ్యాంకులు, బీమా సంస్థలు, పిఎఫ్ వంటి సంస్థల్లో మొత్తం అన్‌క్లెయిమ్డ్ సొమ్ములు రూ.1.84 లక్షలకోట్లవరకూ ఉన్నాయని, వీటిలో ఒక్క బ్యాంకుల్లోనే 64 వేల కోట్లవరకూ ఉన్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈమొత్తం సొమ్ము నిజమైన హక్కుదారులకు చెందేటట్లు సంస్థలన్నీ చర్యలుచేపట్టాలన్నారు. ఆప్కీపూంజీ, ఆప్కా అధికార్( మీసొమ్ము మీహక్కు) పేరిట గాంధీనగర్‌లో ఆమె మూడునెలలప్రత్యేక ప్రచార జాతాను ప్రారంభించారు. ప్రజల్లో చైతన్యం కల్పించి సత్వర కార్యాచరణ తీసుకోవడమే ఈప్రచార లక్ష్యం అన్నారు. గుజరాత్ ఆర్థికమంత్రి కనుభాయ్ దేశాయి ఇతర సీనియర్ బ్యాంకుఅధికారులు, ఆర్థికశాఖ అధికారులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు వాణిజ్యబ్యాంకులు లేదా ఆర్బీఐ వద్ద మూలుగుతున్నాయని, అలాగే ఈ నిధులు ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ ప్రొటెక్షన్ ఫండ్‌కిందు న్నాయన్నారు. ఈ సొమ్ములకు నిజమైన హక్కుదారులను మనం గుర్తించాల్సి ఉందని, వెనువెంటనే వారికి బదలాయించడం జరుగుతుందన్నారు. ఆర్థిక సేవల విభాగం లెక్కలప్రకారం మొత్తం సొమ్ము రూ.1.84 లక్షలకోట్లు ఉందని ఆమె గుర్తుచేసారు. బ్యాంకులనుంచి ఈ సొమ్ము డిపాజిట్లుగా ఉంటే ఆర్‌బిఐకి చేరుతుందని, స్టాక్స్, ఇతర ఆస్తులపరంగా అయితే సెబీకి, లేదా ఐఇపిఎఫ్‌కు చేరుతుందన్నారు. ఆర్‌బిఐ ఇందుకోసమే ఉద్‌గామ్ పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. ఈ విషయంలో గుజరాత్‌గ్రామీణ బ్యాంకు కార్యాచరణను ఆమె ప్రశంసించారు. బ్యాంకు సిబ్బంది అదికారులను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి పంపించి ఖాతాదారులకు సాయం చేసేందుకు నియమించిందని ఆమె కొనియాడారు. ఇతర బ్యాంకులు కూడా గ్రామాల్లో అవగాహన పెంచి ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుచేసి చైతన్య కార్యక్రమాలునిర్వహించి కస్టమర్లకు సహకారం అందించాలని ఆదేశించారు.

# విడియో కాన్ఫరెన్స్‌లోకి వచ్చిన సెకనుకే ఉద్యోగంనుంచి తొలగింపు

## అమెరికాలో భారత్ టెక్కీల దుర్భర పరిస్థితులు




**న్యూయార్క్, అక్టోబరు 4:** కేవలం మూడు నిమిషాల వీడియో కాల్ ఎన్నో ఏళ్ల కెరీర్‌కు ముగింపు పలికింది. కనీసం ప్రశ్న అడిగే అవకాశం కూడా ఇవ్వకుండా, మాట్లాడేందుకు వీల్లేకుండా మైకులు, కెమెరాలు ఆఫ్ చేసి ఉద్యోగంలో నుంచి తొలగించారు. ఓ అమెరికన్ కంపెనీ అనుసరించిన ఈ అమానవీయ విధానంపై ఓ భారత టెకీ రెడిట్‌లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అమెరికాకు చెందిన ఓ టెక్ కంపెనీలో పనిచేస్తున్న భారత ఉద్యోగి తనకు ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకున్నారు. అక్టోబర్ నెలలో ఒక రోజు ఉదయం 11:01 గంటలకు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) అకస్మాత్తుగా ఓ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ కాల్‌లో జాయిన్ అయిన వెంటనే ఉద్యోగులందరి మైక్రోఫోన్లు, కెమెరాలను డిజేబుల్ చేశారని ఆయన వివరించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా అధికశాతం భారతీయ ఉద్యోగులను తొలగిస్తున్నట్లు సీఓఓ ప్రకటించారని సదరు ఉద్యోగి తెలిపారు. అయితే, ఇది ఉద్యోగుల పనితీరు ఆధారంగా తీసుకున్న నిర్ణయం కాదని ఆయన స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. తమ వాదన వినిపించేందుకు గానీ, కనీసం సందేహాలు అడిగేందుకు గానీ ఎలాంటి అవకాశం ఇవ్వకుండా కేవలం మూడు నిమిషాల్లోనే కాల్ ముగించారని ఆవేదన వ్యక్తం చేశారు. అనూహ్యంగా ఉద్యోగం కోల్పోయిన వారికి ఒక నెల జీతంతో పాటు, వాడుకోని సెలవులకు సంబంధించిన నగదు చెల్లిస్తామని కంపెనీ హామీ ఇచ్చినట్లు ఆ టెకీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నా జీవితంలో ఇలా ఉద్యోగం కోల్పోవడం ఇదే మొదటిసారి. ఎలాంటి జాలి, దయ లేకుండా అత్యంత కర్కశంగా తొలగించారు. కనీసం మానసికంగా సిద్ధమయ్యే అవకాశం కూడా ఇవ్వలేదని ఆయన వాపోయారు. ఈ పోస్ట్ వైరల్ అవడంతో నెటిజన్ల నుంచి ఆయనకు భారీగా మద్దతు లభిస్తోంది. ధైర్యంగా ఉండండి, ఇది ముగింపు కాదు కొత్త ఆరంభం అంటూ చాలామంది కామెంట్లు పెడుతున్నారు. టెక్ రంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో ఈ తరహా తొలగింపులు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.




# విన్‌ట్రాక్ లావాదేవీలు మొత్తం నిలిపివేత

## ఎక్సైజ్, కస్టమ్స్ అధికారుల వేధింపులే కారణమన్న కంపెనీ

**చెన్నై, అక్టోబరు 4:** చెన్నై కస్టమ్స్ అధికారులపై లంచం, వేధింపుల ఆరోపణలను చేసిన కార్గో కంపెనీ విన్ట్రాక్ దేశంలో తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం సంచలనం రేపుతోంది. 45 రోజులుగా తమను కస్టమ్స్ అధికారులు తీవ్రంగా వేధిస్తున్నారని ఆ సంస్థ తేల్చి చెప్పింది. అయితే ఈ ఆరోపణలను కస్టమ్స్ శాఖ తీవ్రంగా ఖండించింది. దీంతో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ విషయంపై నిష్పక్షపాత విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో ఈనెల 1వ తేదీ నుంచి భారత్‌లో అన్ని దిగుమతిఎగుమతి కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు విన్‌ట్రాక్ కంపెనీ ప్రకటించింది. దీంతో ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపడంతో కేంద్రం ఎంట్రీ ఇచ్చింది. ఈ ఘటనపై పూర్తిగా దర్యాప్తు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. గత 45 రోజులుగా చెన్నై కస్టమ్స్ అధికారులు తమను నిరంతరాయంగా వేధిస్తున్నారని విన్‌ట్రాక్ కంపెనీ ఫౌండర్ ప్రవీణ్ గణేషన్ సంచలన ఆరోపణలు చేశారు. తమను లంచం అడిగినట్లు చేసిన డిమాండ్‌లను తాము బయటికి వెల్లడించడంతో ప్రతీకార చర్యలకు దిగి తమ వ్యాపారాన్ని దెబ్బతీశారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ అండ్ ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారుల పేర్లను ప్రస్తావించారు. తన భార్య కంపెనీకి చెందిన ఒక రవాణా కోసం రూ.1.5 లక్షల లంచం ఇవ్వాల్సి వచ్చిందని చర్చల సమయంలో అధికారులు 10 శాతం తగ్గింపును కూడా ఆఫర్ చేశారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా విన్‌ట్రాక్ సంస్థ తన ఎక్స్ అకౌంట్ బయోలో చేసిన ఆరోపణలు మరింత దుమారానికి కారణం అయ్యాయి. బిల్ ఆఫ్ ఎంట్రీ, ఇన్‌వాయిస్, ప్యాకింగ్ లిస్ట్‌లో లేని వస్తువులను కార్గో బాక్సుల్లో కనుగొన్నామని ఇది కస్టమ్స్ చట్టం 1962లోని సెక్షన్ 111 ఉల్లంఘన అని కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

# ఈవారంలో రూ.28,500 కోట్ల ఐపిఒలు




**ముంబయి, అక్టోబరు 4:** ఈక్విటీ ప్రైమరీ మార్కెట్లలోకి ఐదు పబ్లిక్ ఇష్యూలు వస్తున్నాయి. మొత్తంగా రూ.28,500 కోట్ల మేర నిధుల సమీకరణకు ఐపిఒలు రానున్నాయి. వీటిలో సోమవారం టాటాక్యాపిటల్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సంస్థల మెగా ఐపిఒలు కూడా ఉన్నాయి. టాటాగ్రూప్ ఎన్‌బిఎఫ్‌సిసంస్థ టాటాక్యాపిటల్ పబ్లిక్ ఇష్యూ ఈనెల 6న ప్రారంభం అయి 8న ముగుస్తుంది. 15,512 కోట్లు మార్కెట్లనుంచి సమీకరిస్తుంది. ఇష్యూధరను రూ.310-326గా నిర్ణయించింది. ఇన్వెస్టర్లు ఈ ఐపిఒకు ఎక్కువ ఆసక్తిచూపిస్తున్నారు. ఎల్జీఎలక్ట్రానిక్స్ ఇండియా కూడా రూ.11,607 కోట్ల మెగా ఐపిఒకు వస్తోంది. ఏడో తేదీ ప్రారంభం అయి తొమ్మిదన ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.1080నుంచి 1140గా ఉంటుందని కంపెనీ నరపకటించింది. అలాగేరూబికాన్ రీసెర్చి ఫార్మాకంపెనీ రూ.1377 కోట్లు సమీకరించేందుకు ఈనెల 9న మార్కెట్లకు వస్తున్నది. 13న బిడ్డింగ్‌ముగుస్తుంద.ఇ ధరలు కూడా రూ.461-481గా ఉంటాయి. ఇక అనంతమ్ హైవేస్ ఇన్విట్ కూడా మెయిన్‌బోర్డులో రూ.400 కోట్లు మీకరించాలనినిర్ణయించింది. ఏడోతేదీ ప్రారంభం అయి 9న ముగుస్తుంది. ఎస్ఎంఇ సెగ్మెంట్‌లో స్టీల్ ఉత్పత్తి కంపెనీ మిట్టల్‌సెక్షన్స్ రూ.53 కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. ఏడో తేదీ ప్రారంభించి 9న ముగుస్తుంది. ఇష్యూధరలు రూ.136 నుంచి రూ.143గా కంపెనీ నిర్ణయించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.